# కార్ల్ మార్క్స్

# వేతనం, ధర, లాభం[10]

## తొలి పలుకు

సిటిజెన్స్,

అసలు విషయంలోకి వెళ్లేముందు, ఉపోద్ఘాత ప్రాయంగా నాలుగు మాటలు చెప్పేందుకు నాకు అనుమతినివ్వండి.

యూరప్ ఖండ దేశాల్లో యీనాడు ప్రబలమైన అంటుజాడ్యం లాగ సమ్మెలు సాగుతున్నాయి, వేతనాలు పెరగాలన్నది సార్వత్రిక డిమాండైంది. ఈ సమస్య మన మహాసభలో చర్చకు వస్తుంది. అంతర్జాతీయ సంఘ[11] నాయకులుగా మీరు, అత్యంత ప్రధానమైన యీ సమస్యపై దృఢాభిప్రాయాలు కలిగివుండాలి. అందుచేత, మీ ఓపికను తీవ్ర పరీక్షకు గురి చెయ్యాల్సిన ప్రమాదాన్ని ఎదుర్కోవలసివచ్చినా కూడా, యీ విషయాన్ని కూలంకషంగా పరిశీలించాల్సిన అవసరముందని భావిస్తున్నాను.

సిటిజెన్ వెస్టన్‌ని గురించి కూడా నేను ముందుగా ఒక మాట చెప్పాల్సివుంది. కార్మిక వర్గానికి అత్యంత అయిష్టమైనవని తెలిసివున్నా కూడా, తన దృష్టిలో, కార్మికవర్గపు శ్రేయస్సుకు ఉపయోగపడుతాయన్న నమ్మకంతో ఆయన తన అభిప్రాయాలను మీకు ప్రతిపాదించడమే కాకుండా, వాటిని బహిరంగంగా సమర్థించాడు. అటువంటి నైతిక ధైర్యప్రదర్శనను మనమందరం ఘనంగా గౌరవించితీరాల్సిందే. నా యీ నివేదిక, నిరలంకృతమైన శైలిలోనే రచింపబడినప్పటికీ, దీన్ని సాంతంగా విన్నమీదట, తన ప్రధాన అంశాల మూలంలో వున్నట్లు కనిపించే అసలు భావాన్ని నేను ఆమోదించినట్లు ఆయన గుర్తిస్తాడని ఆశిస్తున్నాను; కానైతే, అవి, వాటి ప్రస్తుత రూపంలో, సిద్ధాంతరీత్యా తప్పనీ, ఆచరణ దృష్ట్యా ప్రమాదకరమైనవనీ నేను పరిగణించకుండా ఉండలేకపోతున్నాను.

ఇప్పుడిక వెంటనే నేను మనముందున్న విషయానికి వెళ్తాను.

# 1. ఉత్పత్తి, వేతనం

సిటిజెన్ వెస్టన్ వాదం వాస్తవానికి రెండు పూర్వసిద్ధాంతాలపై ఆధారపడివుంది: మొదటిది, జాతీయ ఉత్పత్తి మొత్తం ఒక నిర్దిష్టాంశం, స్థిరమైన ఒక మొత్తం, లేక గణితశాస్త్రజ్ఞులు చెప్పినట్లు స్థిర రాశి; రెండవది, నిజ వేతన మొత్తం, అంటే, అవి కొనగలిగిన సరుకుల ద్వారా ఎంచదగిన వేతనం, ఒక స్థిర మొత్తం, ఒక స్థిర రాశి.

అతని మొదటి ఉద్ఘాటన పొరపాటనేది స్పష్టం. ఏటేటా ఉత్పత్తి విలువా, పరిమాణమూ పెరగడమూ, జాతీయ శ్రమయొక్క ఉత్పాదక శక్తులు పెరగడమూ, పెరుగుతున్న యీ ఉత్పత్తి చలామణీకి అవసరమైన ధనం మొత్తం నిరంతరాయంగా మారుతూ ఉండటమూ మీకు తెలుసు. ఒక సంవత్సరాంతానికి ఏదైతే వర్తిస్తుందో, ఒకదానితో మరొకదాన్ని పోల్చినప్పుడు వేర్వేరు సంవత్సరాలకు ఏదైతే వర్తిస్తుందో, అది ఆ సంవత్సరంలోని ప్రతిఒక దినానికీ వర్తిస్తుంది. జాతీయ ఉత్పత్తికి సంబంధించిన మొత్తం లేక పరిమాణం నిరంతరాయంగా మారుతుంది. అదొక స్థిర పరిమాణం కాక, అస్థిర పరిమాణం, జనాభాలో సంభవించే మార్పుల మాట అటుంచి, పెట్టుబడి సంచయనంలోను, శ్రమయొక్క ఉత్పాదక శక్తులలోను నిరంతరాయంగా వచ్చే మార్పు కారణంగా కూడా, అది అలా మారుతూ ఉండక తప్పదు. ఈ రోజున సాధారణ వేతన రేటులో పెరుగుదల సంభవించినట్లయితే, ఆ పెరుగుదల, దాని తర్వాతి ఫలితాలేమైనప్పటికీ, దానికి అదిగా, వెంటనే ఉత్పత్తి మొత్తాన్ని మార్చదు. మొదటి సంగతి, ఆనాడున్న పరిస్థితులనుబట్టి అది జరుగుతుంది. కాని వేతనం పెరుగుదలకు ముందు జాతీయ ఉత్పత్తి స్థిరంగా కాక, అస్థిరంగా ఉండి ఉన్నట్లయితే, వేతనం పెరుగుదల తర్వాత కూడా అది స్థిరంగా కాకుండా అస్థిరంగానే కొనసాగుతుంది.

కాని, జాతీయ ఉత్పత్తి మొత్తాన్ని అస్థిరమైనదిగా కాక స్థిరమైనదిగా ఊహించుకోండి. అప్పుడు సైతం, మన మిత్రుడు వెస్టన్ సహేతుకమైన నిర్ధారణగా దేన్నైతే పరిగణిస్తాడో అదింకా రుజువు లేని ఉద్ఘాటనే అవుతుంది. నాకొక నిర్దిష్టమైన అంకె, ఉదాహరణకు ఎనిమిది ఉంటే, యీ సంఖ్యయొక్క పరమ రూఢమైన అవధులు దాని భాగాలు తమ సాపేక్ష అవధులను మార్చుకొనడాన్ని నిరోధించవు. లాభాలు ఆరూ, వేతనాలు రెండూ అయివుంటే, వేతనాలు ఆరుకి పెరగవచ్చు, లాభాలు రెండుకి తరగవచ్చు, కాని అప్పటికీ మొత్తం సంఖ్య ఎనిమిదిగానే ఉంటుంది. ఈ విధంగా, ఉత్పత్తియొక్క స్థిర మొత్తం ఎటువంటి పరిస్థితిలోనూ కూడా వేతనాల మొత్తం స్థిరంగా వుండాలన్నదాన్ని ధృవపరచదు. మరి అలాంటప్పుడు మన మిత్రుడు వెస్టన్ యీ స్థిరత్వాన్ని ఎలా రుజువుచేస్తున్నాడు? దాన్ని నొక్కి వక్కాణించడం ద్వారానే.

కాని అతని ఉద్ఘాటనను ఒకవేళ అంగీకరించినా కూడా, అతడు దాన్ని ఒక వైపుకే ఒత్తిచెప్పినా, రెండుదానికి పక్కలా పడునుంది. వేతనాల మొత్తం స్థిరమైన పరిమాణం కలిగినదైతే, దాన్ని అప్పుడిక హెచ్చించడంగాని తగ్గించడంగాని సాధ్యం కాదు. మరి అప్పుడు, తాత్కాలికంగా వేతనాలలో పెరుగుదలకోసం ప్రయత్నించే కార్మికులు మూర్ఖంగా ప్రవర్తించారనుకుంటే, వేతనాలలో తాత్కాలికమైన కోతకోసం ప్రయత్నించే పెట్టుబడిదారులు అంతకు తక్కువ మూర్ఖంగా ప్రవర్తించినట్లేమీ కాదు. కొన్ని పరిస్థితులలో, కార్మికులు వేతనాల పెరుగుదలను సాధించుకోగలరన్న విషయాన్ని మన మిత్రుడు వెస్టన్ తిరస్కరించడు, కాని వేతనాల మొత్తం సహజంగానే స్థిరమైనది కనుక, దాని వెంట ప్రతిక్రియ ఉండితీరాలంటాడు. మరోవంక, పెట్టుబడిదారులు వేతనాల తగ్గింపును బలవంతంగా అమలు జరపగలరనీ, మరి నిజానికి, దానికోసం వారు నిరంతరాయంగా ప్రయత్నిస్తారనీ కూడా అతనికి తెలుసు. వేతన స్థిరత్వ సూత్రం ప్రకారం మొదటి సందర్భంలో మాదిరిగానే యీ సందర్భంలో కూడా ప్రతిక్రియ వెంటనే జరగాల్సివుంటుంది కదా. అందుచేత, కార్మికులు వేతనాలను తగ్గించే ప్రయత్నానికి, లేక తగ్గించే చర్యకు వ్యతిరేకంగా ప్రతిచర్యకు పూనుకొన్నప్పుడు, సరిగా వ్యవహరించినవారవుతారు. అందుచేత వారు, వేతనాల పెరుగుదలను సాధించుకోవడంలో సరిగా వ్యవహరించారన్న మాటే, ఎందుకంటే, వేతనాల తగ్గింపుకి వ్యతిరేకంగా జరిపే ప్రతి ఒక ప్రతిచర్యా వేతనాల పెరుగుదలకోసం జరిపే చర్యయే. అందుకని, సిటిజెన్ వెస్టన్‌యొక్క సొంత వేతన స్థిరత్వ సూత్రం ప్రకారమే, కార్మికులు, కొన్ని పరిస్థితులలో, సమైక్యమై వేతనాల పెరుగుదలకోసం పోరాడాల్సివుంటుంది.

ఈ నిర్ధారణను అతడు తిరస్కరించేట్టయితే, అది ఏ పూర్వ సిద్ధాంతంనుంచి అయితే ఉత్పన్నమవుతుందో దానిని అతడు వదులుకోవలసివుంటుంది. వేతనాల మొత్తం స్థిర పరిమాణం అని చెప్పరాదు, తద్భిన్నంగా, వేతనం పెరగజాలదు, పెరగకూడదు, కానైతే, పెట్టుబడిదారులు దాన్ని తగ్గించాలనుకున్నప్పుడల్లా అది పడిపోగలదు, పడిపోయి తీరాలి అని అతడు చెప్పాల్సివుంటుంది. ఆ పెట్టుబడిదారు నీకు మాంసానికి బదులు బంగాళదుంపలను, గోధుమకు బదులు ఓట్లను తినిపించదలుచుకుంటే, నువ్వు అతని యిచ్ఛను, అదొక అర్థశాస్త్ర నియమమన్నట్లు అంగీకరించి, దాన్ని ఔదలదాల్చాలి. ఒకవేళ ఒక దేశంలో మరొక దేశంలోకన్న వేతనాలు అధికంగా ఉన్నట్లయితే — ఉదాహరణకు ఇంగ్లండులోకన్న అమెరికాలో — వేతనాల రేటులోని యీ తేడాను అమెరికన్ పెట్టుబడిదారు అభీష్టానికీ ఇంగ్లీషు పెట్టుబడిదారు అభీష్టానికీ మధ్య గల తేడాగా నువ్వు వివరించాల్సివుంటుంది. ఒక్క ఆర్థిక విషయాల అధ్యయనాన్నే కాకుండా యితర అన్ని విషయాల అధ్యయనాన్నీ కూడా, తప్పకుండా అతి సరళం చేసివేసే పద్ధతి యిది.

కానైతే అప్పుడు సైతం మనమొక ప్రశ్న అడగాల్సివుంటుంది: అమెరికన్ పెట్టుబడిదారు అభీష్టం ఇంగ్లీషు పెట్టుబడిదారు అభీష్టంతో ఎందుకు విభేదిస్తుంది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలంటే మీరు అభీష్ట పరిధి దాటి వెళ్ళాల్సివుంటుంది. భగవంతుడు ఫ్రాన్సులో ఒకటి సంకల్పిస్తాడనీ, ఇంగ్లండులో మరొకటి సంకల్పిస్తాడనీ ఒక క్రిస్టియన్ మత గురువు నాకు చెప్పవచ్చు. ఈ ద్వంద్వాభీష్టాన్ని గురించి వివరించమని నేనతడిని నిలదీసి సంజాయిషీ అడిగితే, ఫ్రాన్సులో ఒక అభీష్టాన్నీ, ఇంగ్లండులో మరొక అభీష్టాన్నీ కలిగివుండటం భగవంతుని అభీష్టమని అతడు మోటుగా జవాబు చెప్పనూవచ్చు. కాని మన మిత్రుడు వెస్టన్, సకల హేతుజ్ఞానానికీ పూర్తిగా విరుద్ధమైన అటువంటి వాదం చేసేవాళ్ళలో చిట్టచివరి వాడుగా ఉంటాడనడం నిస్సందేహం.

పెట్టుబడిదారుని అభీష్టం సాధ్యమైనంత ఎక్కువగా రాబట్టుకోవడమేననడం నిస్సందేహం. మనం చెయ్యాల్సిన పని అతని అభీష్టాన్ని గురించి మాట్లాడటం కాదు, అతని శక్తిని గురించీ, ఆ శక్తియొక్క అవధులను గురించీ, ఆ అవధుల స్వభావాన్ని గురించీ చర్చించడం.

## 2. ఉత్పత్తి, వేతనాలు, లాభాలు

సిటిజెన్ వెస్టన్ మనకి చదివి వినిపించిన నివేదికను క్లుప్తీకరించి ముక్తసరిగా చెప్పియుండవచ్చు.

అతని వాదన సారాంశమంతా యిలా వుంటుంది: కార్మికవర్గం పెట్టుడిదారీ వర్గంచేత డబ్బువేతనాల రూపంలో నాలుగు షిల్లింగులకు బదులు అయిదు షిల్లింగులను కక్కిస్తే, పెట్టుబడిదారు సరుకుల రూపంలో అయిదు షిల్లింగుల విలువకు బదులు నాలుగు షిల్లింగుల విలువను యిచ్చి బదులుతీర్చుకుంటాడు. కార్మికవర్గం, వేతనాల పెరుగుదలకు ముందు, తాము దేనినైతే నాలుగు షిల్లింగులకు కొన్నారో, దానికే యిప్పుడు అయిదు షిల్లింగులు చెల్లించాల్సివుంటుంది. అయితే యిలాగే ఎందుకు జరుగుతుంది? పెట్టుబడిదారు అయిదు షిల్లింగులకు బదులు నాలుగు షిల్లింగుల విలువైన సరుకులనే ఎందుకిస్తాడు? వేతనాల మొత్తం స్థిరమైనది కనుక. కాని అది నాలుగు షిల్లింగుల విలువైన సరుకులవద్దనే ఎందుకు స్థిరపరచబడింది? మూడు దగ్గరో, లేక రెండు దగ్గరో, లేక మరే యితర మొత్తం దగ్గరో ఎందుకని స్థిరపరచబడలేదు? వేతనాల మొత్తపు మితి ఏదైనా ఒక ఆర్థిక నియమంచేత — పెట్టుబడిదారుని అభీష్టానికీ, కార్మికుని అభీష్టానికీ కూడా ఒకే మాదిరిగా అతీతమైన నియమంచేత — నిర్ణయింపబడే మాటైతే, సిటిజెన్ వెస్టన్ చేసివుండాల్సిన మొట్టమొదటి పని ఆ నియమమేమిటో పేర్కొనడం, దాన్ని రుజువుచెయ్యడమూను. అంతేగాకుండా,

అప్పుడతడు, ప్రతి ఒక నిర్దిష్ట తరుణంలో వాస్తవంగా చెల్లింపబడే వేతనాల మొత్తం సదా అవసర వేతనాల మొత్తానికి అనురూపంగా ఉంటుందనీ, దానినుండి ఎన్నడూ బెసక దనీ నిరూపించాల్సివుంటుంది. మరి, అలా కాకుండా, వేతనాల మొత్తంయొక్క ఆ స్థిర పరిమితి పెట్టుబడిదారుయొక్క కేవల అభీష్టం పైననో, లేక అతని పేరాశ పరిమితులపైననో మాత్రమే ఆధారపడివున్నట్లయితే, అది అతను చిత్తంవచ్చిన రీతిలో పెట్టిన పరిమితే అవుతుంది. దానిలో అవశ్యకమైన దంటూ ఏదీ లేదు. అది పెట్టుబడిదారుని అభీష్టానికి అనుకూలంగానూ మార్చబడవచ్చు, ప్రతికూలంగానూ మార్చబడవచ్చు.

సిటిజెన్ వెస్టన్ తన సిద్ధాంతాన్ని రుజువుచేసేందుకు యీ కింది ఉదాహరణనిచ్చాడు: ఒకానొక గిన్నెలో, ఒకానొక నిర్దిష్ట సంఖ్య వ్యక్తులు తాగేందుకుగాను పాయసం ఉంద నుకోండి. అప్పుడు మామూలుగా వాడేవాటికన్న పెద్ద చెమ్చాలు వారికిచ్చినంత మాత్రాన గిన్నెలోని పాయసం పరిమాణం పెరగదు. అయితే యీ ఉదాహరణ పేలవంగా ఉన్నదని చెప్పాలి. ఈ ఉదాహరణ ఒక విధంగా నాకు మెనెనియస్ అగ్రిప్పా వాడిన ఉపమానాన్ని జ్ఞాపకం తెచ్చింది. రోమన్ సామాన్యులు రోమన్ ప్రభువర్గీయులపై దాడిచేసినప్పుడు, ప్రభువర్గీయుడైన అగ్రిప్పా వారితో, రాజ్యం అనే సామాన్య శరీరాంగాలను ప్రభువర్గీయ ఉదరమే పోషిస్తున్నదని చెప్పాడు. ఒక మనిషి పొట్టను నింపడం ద్వారా మరొక మనిషి అంగాలను మనమెలా పోషించగలమో చెప్పడంలో అగ్రిప్పా విఫలుడయ్యాడు. అలాగే సిటిజెన్ వెస్టన్, కార్మికులు ఏ గిన్నెనుంచైతే తాగుతారో ఆ గిన్నె, జాతీయ శ్రమ సృష్టించిన యావత్తు ఉత్పాదితంతోనూ నింపబడివుందనీ, మరి వారు దానిలోనుండి ఎక్కువగా తీసుకోలేకపోవడానికి గిన్నె చిన్నది కావడంగాని, దానిలోని పదార్థం తక్కువగా వుండటంగాని కారణంగాక, కేవలం వారి చెమ్చాలు చిన్నవికావడం మాత్రమే కారణమన్న సంగతిని విస్మరించాడు.

ఏ యుక్తి ద్వారా పెట్టుబడిదారు అయిదు షిల్లింగులకు బదులుగా నాలుగు షిల్లింగుల విలువగల వస్తువులను యివ్వగలుగుతున్నాడు? అతను అమ్మే సరుకు ధరను పెంచడం ద్వారా. సరేమరి, సరుకుల ధరలలో పెరుగుదల, అంతకన్న సాధారణంగా వాటిలో మార్పు, ఆ మాటకు వస్తే సరుకుల ధరలే కేవలం పెట్టుబడిదారు అభీష్టంపైననే ఆధారపడి వుంటాయా? లేక అందుకు విరుద్ధంగా, ఆ అభీష్టాన్ని అమల్లోకి తేవడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులు అవసరమా? అలా కానినాడు, మార్కెట్ ధరల్లోని ఎగుడుదిగుళ్లూ, నిరంతరాయమైన వృద్ధిక్షయాలూ పరిష్కార సాధ్యంకాని చిక్కుప్రశ్నే అవుతాయి.

శ్రమయొక్క ఉత్పాదక శక్తుల్లో గాని, వినియోగింపబడిన పెట్టుబడి, శ్రమ మొత్తాలలోగాని, లేక ఉత్పాదితాలయొక్క విలువలు ఏ డబ్బులోనైతే అంచనావెయ్యబడుతాయో ఆ డబ్బు విలువలోగాని ఎటువంటి మార్పూ సంభవించలేదనీ, కాని వేతనాల రేటులో మాత్రమే మార్పు వచ్చిందని మనం అనుకున్నప్పుడు, మరి ఆ వేతనాల పెరుగుదల సరుకుల ధరను

ఏవిధంగా ప్రభావితం చెయ్యగలదు? ఈ సరుకులయొక్క గిరాకీకీ సరఫరాకీ మధ్య వాస్తవ నిష్పత్తిని ప్రభావితం చెయ్యడం ద్వారా మాత్రమే అది అలా చెయ్యగలదు.

మొత్తంమీద కార్మికవర్గం, తన రాబడిని జీవితావసర వస్తువులపైన ఖర్చుపెడుతుందనీ, ఖర్చుపెట్టి తీరాలనీ అనడం పూర్తిగా నిజం. అందుకని, వేతనాల రేటులో సాధారణమైన పెరుగుదల, జీవితావసర వస్తువులయొక్క గిరాకీనీ, తత్పర్యవసానంగా వాటి మార్కెట్ ధరలనూ పెంచుతుంది. ఈ జీవితావసర వస్తువులను ఉత్పత్తిచేసే పెట్టుబడిదారులు పెరిగిన వేతనాలకు మింజువలె తమ సరుకుల మార్కెట్ ధరల పెరుగుదల ద్వారా పరిహారం పొందుతారు. మరి, జీవితావసర వస్తువులను ఉత్పత్తి చెయ్యని యితర పెట్టుబడిదారుల మాట ఏమిటి? మరి వీరైనా తక్కువమంది అని మీరనుకోరాదు. జాతీయ ఉత్పాదితంలో మూడింట రెండు వంతులు, జనాభాలో అయిదో వంతుమంది చేత అనుభవింపబడుతున్నాయని మీరు అనుకున్నట్లయితే – కామన్సు సభా సభ్యుడొకాయన యిటీవల పేర్కొన్నట్టు కేవలం ఏడో వంతుమంది మాత్రమే దీన్ని అనుభవిస్తున్నారు – జాతీయోత్పాదితంలో ఎంత పెద్ద భాగం విలాస వస్తురూపంలో ఉత్పత్తిచెయ్యబడాలో, లేక విలాస వస్తువులకు మార్పిడి చేసుకోబడాలో, ఎంత బ్రహ్మాండమైన మొత్తంలో జీవితావసర వస్తువులే నౌకర్లు, గుర్రాలు, పిల్లులు వగైరాలపై వృథాచెయ్యబడాలో మీరు గ్రహిస్తారు. జీవితావసర వస్తువుల ధరలు పెరగడంతో యీ వృథా యెప్పుడూ చాలా పరిమితమవుతుందన్న సంగతి మనకి అనుభవం చెబుతోంది.

సరే, జీవితావసర వస్తువులు ఉత్పత్తి చెయ్యని ఆ పెట్టుబడిదారుల పరిస్థితి ఎలా వుంటుంది? వేతనాల సాధారణ పెరుగుదల పర్యవసానంగా, లాభాల రేటు పడిపోవడంతో, వారు తమ సరుకుల ధర పెంచడం ద్వారా తమ నష్టాన్ని భర్తీచేసుకోలేరు, ఆ సరుకుల గిరాకీ పెరగకపోవడమే దీనికి కారణం. వారి ఆదాయం తగ్గుతుంది, మరి, తగ్గిన యీ ఆదాయంనుంచి అవే అధికధర కలిగిన జీవితావసర వస్తువులకు గాను వారు ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి వుంటుంది. అంతే కాదు. వారి ఆదాయం తగ్గింది కనుక వారి వద్ద విలాస వస్తువులకోసం ఖర్చుపెట్టే సొమ్ము తగ్గుతుంది. అందుకని తమతమ సరుకులకు వారి పరస్పర గిరాకీ తగ్గిపోతుంది. తగ్గిపోయిన యీ గిరాకీ పర్యవసానంగా వారి సరుకుల ధర పడిపోతుంది. అందుకని యీ పారిశ్రామిక శాఖల్లో, వేతనాల రేటులో వచ్చిన సాధారణ పెరుగుదలకు సరళ అనుపాతంలోనే కాకుండా, వేతనాలయొక్క సాధారణ పెరుగుదలకు, అవసర వస్తువుల ధరల్లో పెరుగుదలకు, విలాస వస్తువుల ధరల్లో తరుగుదలకు సంబంధించిన మిశ్ర అనుపాతంలో కూడా లాభం రేటు పడిపోతుంది.

పరిశ్రమకు సంబంధించిన వివిధ శాఖల్లో వినియోగింపబడిన పెట్టుబడులకు లభించే లాభం రేట్లలో యీ తేడా పర్యవసానం ఏమిటి? ఎక్కడైనా, ఏ కారణంగానైనా ఉత్పత్తికి సంబంధించిన భిన్న రంగాలలో లాభపు సగటు రేట్లలో తేడా వస్తే పర్యవసానం ఒకటే.

పెట్టుబడీ, శ్రమా తక్కువ గిట్టుబాటు శాఖలనుంచి ఎక్కువ గిట్టుబాటు శాఖలకు బదిలీ చెయ్యబడతాయి. ఈ బదిలీక్రమం ఎంతవరకు సాగుతుందంటే, ఒక పారిశ్రామిక శాఖలో పెరిగిన గిరాకీకి అనుపాతంలో సరఫరా పెరిగేదాకా, యితర శాఖల్లో తరిగిన గిరాకీయొక్క అనుపాతంలో సరఫరా పడిపోయే దాకా సాగుతుంది. ఈ మార్పు జరిగేసరికి, విభిన్న శాఖల్లో సాధారణ లాభపు రేటు మరల సమానం చెయ్యబడుతుంది. ఈ క్రమభంగమంతా ఆదిలో వివిధ సరుకుల గిరాకీ – సరఫరాలయొక్క అనుపాతంలో కేవలం మార్పు మూలంగానే సంభవించింది కనుక, యిప్పుడా కారణం అంతరించిపోవడంతో కార్యం కూడా అంతరించి పోతుంది, ధరలు కూడా తమ పూర్వ స్థాయికి, నిశ్చలతకు తిరిగి చేరుకుంటాయి. వేతనాల పెరుగుదల పర్యవసానంగా సంభవించిన లాభాల రేటు తరుగుదల పరిశ్రమకు సంబంధించిన కొన్ని శాఖలకు పరిమితం చెయ్యబడేందుకు బదులు సార్వత్రికమై యుంటుంది. మా ఊహ మేరకు, ఆ నిర్దిష్ట ఉత్పత్తి మొత్తం తన రూపాన్ని మార్చుకొని వుంటుంది. అంతేగాని, శ్రమయొక్క ఉత్పాదక శక్తుల్లో గాని, మొత్తం ఉత్పత్తి రాశిలో గాని ఏ మార్పూ వచ్చి యుండదు. ఉత్పాదితంలోని అధికతర భాగం జీవితావసర వస్తువుల రూపంలో ఉంటుంది, అల్పతర భాగం విలాస వస్తువుల రూపంలో ఉంటుంది, లేక యిలా చెప్పుకున్నా చెప్పుకోవచ్చు, అల్పతర భాగం విదేశీ విలాస వస్తువులకు మార్పిడిచేసుకోబడుతుంది, తన మొదటి రూపంలో అనుభుక్తమవుతుంది, లేక దాన్నే యిలా చెప్పుకున్నా చెప్పుకోవచ్చు, జాతీయోత్పత్తిలోని అధికతర భాగం విలాస వస్తువులకు బదులు విదేశీ జీవితావసర వస్తువులకు మార్పిడి చేసుకోబడుతుంది. అందుకని వేతనాల సార్వత్రిక పెరుగుదల, మార్కెట్ ధరల్లో తాత్కాలిక మైన క్రమభంగం తర్వాత, సరుకుల ధరల్లో ఎలాంటి దీర్ఘకాల మార్పూ లేకుండా లాభపు రేటులో సార్వత్రిక తరుగుదలగా మాత్రమే పర్యవసిస్తుంది.

ఇంతకు ముందరి వాదంలో యావత్తు అదనపు వేతనాలూ జీవితావసర వస్తువులపైనే ఖర్చుపెట్టబడ్డాయని నేనూహించానని అనేమాటైతే, నేనా ఊహను సిటిజెన్ వెస్టన్ అభిప్రాయానికి మిక్కిలి అనుకూలంగా చేశానని జవాబు చెప్తాను. అదనపు వేతనాలు యింతకు ముందు కార్మికులు వాడివుండని వస్తువులపై ఖర్చుచెయ్యబడినట్లయితే, వారి కొనుగోలు శక్తిలో నిజమైన పెరుగుదలకు వేరే రుజువు అక్కర్లేదు. కానైతే, వేతనాల పెరుగుదలనుండి మాత్రమే ఉత్పన్నమైనది కనుక, వారి కొనుగోలుశక్తిలో ఆ పెరుగుదల పెట్టుబడిదారుల కొనుగోలుశక్తిలో తరుగుదలకు కచ్చితంగా అనుగుణంగా ఉండితీరాలి. అందుచేత సరుకుల మొత్తం గిరాకీ పెరగదు, ఆ గిరాకీకి సంబంధించిన అంతర్భాగాలు మారుతాయి అంత మాత్రమే. ఒక వంక పెరిగే గిరాకీ మరో వంక తరిగే గిరాకీతో సమతులితం చెయ్యబడుతుంది. ఈ విధంగా మొత్తం గిరాకీ నిలకడగా ఉండిపోతుంది కనుక, సరుకుల మార్కెట్ ధరల్లో ఎటువంటి మార్పూ కూడా సంభవించజాలదు.

అందుచేత, మనమొక సందిగ్ధ స్థితిలో పడుతున్నాం. అదనపు వేతనాలు అన్ని వినిమయ వస్తువులపైనా సమానంగానైనా ఖర్చుచెయ్యబడుతాయి – అప్పుడు కార్మికవర్గంలో పెరిగిన గిరాకీకి సరిసమానంగా పెట్టుబడిదారీ వర్గపు గిరాకీ తగ్గాల్సి వుంటుంది – లేదా అదనపు వేతనాలు కొన్ని వస్తువులపైన మాత్రమే వెచ్చింపబడుతాయి, అప్పుడు ఆ వస్తువుల మార్కెట్ ధరలు తాత్కాలికంగా పెరుగుతాయి. తత్పర్యవసానంగా అప్పుడు కొన్ని పారిశ్రామిక శాఖల్లో లాభాల రేటులో పెరుగుదలా, తత్పర్యవసానంగా మరి కొన్ని శాఖల్లో లాభాల రేటులో తరుగుదలా పెట్టుబడి, శ్రమల పంపిణీలో మార్పును కలిగిస్తాయి. ఒక పారిశ్రామిక శాఖలో సరఫరా పెరిగిన గిరాకీ స్థాయికీ, యితర పారిశ్రామిక శాఖల్లో తరిగిన గిరాకీ స్థాయికీ సమానంగా తీసుకురాబడేదాకా యీ మార్పు సాగుతుంది. మొదటి ఊహ మేరకు సరుకుల ధరల్లో ఏ మార్పూ సంభవించదు. రెండవ ఊహ మేరకు, మార్కెట్ ధరల్లో కొన్ని హెచ్చు తగ్గుల తర్వాత, సరుకుల మారకపు విలువలు తొలి స్థాయికి పడిపోతాయి. ఈ రెండు ఊహల మేరకూ కూడా వేతనాల రేటులో సాధారణ పెరుగుదల చిట్టచివరకు లాభాల రేటులో సాధారణ తరుగుదలకే తప్ప మరిదేనికీ దారితియ్యదు.

మీ మనస్సును ప్రభావితం చేసేందుకుగాను సిటిజెన్ వెస్టన్, ఇంగ్లండులో వ్యవసాయ కార్మికుల వేతనాలలో 9 షిల్లింగులనుండి 18 షిల్లింగులకు సార్వత్రిక పెరుగుదల సంభవించినట్లయితే రాగల కష్టాలను గురించి ఆలోచించాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాడు. జీవితావసర వస్తువుల గిరాకీ ఎంత విపరీతంగా పెరుగుతుందో, తత్పర్యవసానంగా వాటి ధరలు ఎంత దారుణంగా పెరుగుతాయో ఆలోచించుకోండి అని అతడంటున్నాడు. అమెరికన్ వ్యవసాయ కార్మికుని సగటు వేతనం ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుని సగటు వేతనానికి రెట్టింపు కన్న ఎక్కువన్న సంగతి మరి మీ అందరికీ తెలిసినదే. కాని, వ్యవసాయోత్పత్తుల ధరలు ఇంగ్లండులోకన్న అమెరికాలో తక్కువే, పెట్టుబడి – శ్రమల మధ్య సాధారణ సంబంధాలు ఇంగ్లండులోనూ అమెరికాలోనూ ఒకే మాదిరిగా వున్నాయి, సాలుసరి ఉత్పత్తి మొత్తం ఇంగ్లండులో కన్న అమెరికాలో బాగా తక్కువ. మరైతే, మన మిత్రుడు యీ ప్రమాద హెచ్చరికను ఎందుకు చేస్తున్నట్టు? మన ముందున్న సమస్యను కేవలం పక్కదారి పట్టించడానికి మాత్రమే. 9 షిల్లింగులనుండి 18 షిల్లింగులకు వేతనపు ఆకస్మిక పెరుగుదల అంటే 100 శాతం పెరుగుదల అన్నమాట. మన మిక్కడ, ఇంగ్లండులో సాధారణ వేతనాల రేటు ఆకస్మికంగా 100 శాతం పెంచడం సాధ్యమేనా అన్న విషయాన్ని ఎంతమాత్రం చర్చించడం లేదు. పెరుగుదలయొక్క పరిమాణంతో మనకి బొత్తిగా సంబంధం లేదు, ఆ పరిమాణం ప్రతి ఒక సందర్భంలో, నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి, వాటికి అనువుగా ఉండాల్సివుంటుంది. వేతనాల రేటుయొక్క సాధారణ పెరుగుదల, అది ఒక్క శాతానికే పరిమితమైనా కూడా, ఎలా పనిచేస్తుందన్నదాన్ని మాత్రమే మనం కనుక్కోవాల్సి వుంటుంది.

మన మిత్రుడు వెస్టన్‌యొక్క ఊహాత్మకమైన 100 శాతం పెరుగుదలను అటుంచి గ్రేట్ బ్రిటన్‌లో 1849–1859 మధ్య వాస్తవంగా సంభవించిన వేతనాల పెరుగుదల పైకి మీ దృష్టిని మళ్లించదలచుకున్నాను.

1848లో ప్రవేశపెట్టబడిన పది గంటల బిల్లు, లేక పదిన్నర గంటల బిల్లు[12] సంగతి మీ అందరికీ గుర్తుండే వుంటుంది. మనం చూసిన మిక్కిలి గొప్ప ఆర్థిక మార్పుల్లో అదొకటి. వేతనాలలో అది ఆకస్మికమూ, అనివార్యమూ అయిన ఒక పెరుగుదల, ఏ కొన్ని స్థానిక వృత్తుల్లోనో కాక, ఏ ముఖ్యమైన పారిశ్రామిక శాఖల ద్వారానైతే ఇంగ్లండు ప్రపంచపు మార్కెట్లను పాలించిందో వాటన్నింటిలోనూ సంభవించిన పెరుగుదల. ప్రత్యేకించి అననుకూలమైన పరిస్థితుల్లో సంభవించిన వేతనాల పెరుగుదల అది. డాక్టర్ యూర్, ప్రొఫెసర్ సీనియరూ బూర్జువావర్గ ప్రయోజనాలను అధికారికంగా వ్యక్తంచేసే తదితర అర్థశాస్త్రజ్ఞులందరూ ఆ బిల్లు ఇంగ్లీషు పరిశ్రమకు చరమగీతం పాడుతుందని రుజావు చేశారు — మన మిత్రుడు వెస్టన్ కన్న చాలా బలమైన ఆధారాలతో వారీ పని చేశారని నేను చెప్పాల్సివుంది. అది కేవలం వేతనాల పెరుగుదల విషయమే కాకుండా, వినియోగింపబడిన శ్రమ మొత్తపు తగ్గింపు కారణంగా ఉత్పన్నమైన, శ్రమ మొత్తపు తగ్గింపుపై ఆధారపడిన వేతనాల పెరుగుదల అని వారు రుజావుచేశారు. పెట్టుబడిదారునుండి మనం తీసుకోదలచిన సరిగా ఆ పన్నెండవ గంటనుండి మాత్రమే అతను తన లాభం పొందుతాడని వారు ఉద్ఘాటించారు. సంచయనం తగ్గిపోతుందనీ, ధరలు పెరుగుతాయనీ, మార్కెట్లు పోతాయనీ, ఉత్పత్తి కుంటుపడుతుందనీ, పర్యవసానంగా వేతనం తగ్గుతుందనీ, చిట్టచివరకు సర్వ నాశనమేననీ వారు బెదిరించారు. ఈ బిల్లుతో సరిపోలిస్తే మాక్సిమీలియన్ రోబెస్పియేర్ గరిష్ఠ చట్టాలు[13] స్వల్ప వ్యవహారమని వారు కూడా ప్రకటించారు, ఒక విధంగా వారు చెప్పినది సరైనదే కూడా. సరే, ఫలితం ఏమిటి? పనిదిన ప్రమాణం తగ్గింపబడినా కూడా, ఫ్యాక్టరీ కార్మికుల డబ్బు వేతనాల పెరుగుదల, పనిలో పెట్టుకున్న ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్యలో విశేషమైన పెరుగుదల, వారి ఉత్పాదితాల ధరలలో నిరంతరాయమైన తగ్గుదల, వారి శ్రమయొక్క ఉత్పాదక శక్తులలో బ్రహ్మాండమైన అభివృద్ధి, వారి ఉత్పాదితాలకు ముందెన్నడూ కనివిని యెరుగనంత అధికంగా మార్కెట్ల విస్తరణ. 1860లో మాంచెస్టరులో జరిగిన విజ్ఞానశాస్త్ర పురోగతి సాధక సంఘం సమావేశంలో, ప్రజలయొక్క సహజ జ్ఞానం సరైనది కాగా, తనూ, డాక్టర్ యూర్, సీనియరూ, తదితర అధికారిక అర్థశాస్త్ర సిద్ధాంతకారులందరూ పప్పులో కాలువేశామని న్యూమన్‌గారు స్వయంగా అంగీకరించడం నేను విన్నాను. ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ న్యూమన్‌ని గూర్చి కాక డబ్లియు. న్యూమన్‌ని[14] గురించి నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. థామస్ టూక్‌యొక్క "ధరల చరిత్ర"కు — సహరచయితా, సంపాదకుడూ అయిన డబ్లియు. న్యూమన్ ఆర్థికశాస్త్రంలో ప్రముఖ స్థానం వహిస్తాడు.

"ధరల చరిత్ర" 1793 నుండి 1856 వరకు ధరల చరిత్రను పరిశీలించిన మహత్తర రచన. వేతనాల స్థిర మొత్తానికి, స్థిరమైన ఒక ఉత్పత్తి మొత్తానికి, శ్రమయొక్క ఉత్పాదక శక్తికి సంబంధించిన స్థిరమైన ఒక స్థాయికి, పెట్టుబడిదారులయొక్క సుస్థిర శాశ్వత అభీష్టానికీ సంబంధించిన మన మిత్రుడు వెస్టన్ స్థిరాభిప్రాయమూ, అతని యితర అన్ని స్థిరత్వ అంతిమత్వాలూ సరైనవే అయినట్లయితే, ప్రొఫెసర్ సీనియర్ దారుణ విపత్సూచనలు సరైనవే అయ్యుండేవి. 1815లోనే, కార్మికవర్గ విమోచనకు తొలి సన్నాహక చర్యగా, పని దినానికి సాధారణ పరిమితిని ప్రకటించి, అందరి ప్రాతికూల్యానికీ వ్యతిరేకంగా దాన్ని సొంత చొరవపై న్యూలానార్కులోని తన జౌళి ఫ్యాక్టరీలో మొదలుపెట్టిన రాబర్ట్ ఓవెన్[15] పొరపాటు చేసినవాడయ్యుండేవాడు.

ఏ కాలంలోనైతే పది గంటల బిల్లు ప్రవేశపెట్టబడి, తత్పర్యవసానంగా వేతనాల పెరుగుదల సంభవించిందో, సరిగా అదే కాలంలో గ్రేట్ బ్రిటన్‌లో, యిక్కడ ఏకరవు పెట్టడం అసందర్భంగావుండే కారణాల మూలంగా, వ్యవసాయ కార్మికుల వేతనాల్లో సార్వత్రిక పెరుగుదల సంభవించింది.

ఈ సందర్భంలో అవసరం లేకపోయినా కూడా, మీరు అపార్థం చేసుకోకుండా ఉండేందుకు గాను, నేను కొన్ని ప్రాథమిక అంశాలను పేర్కొంటాను.

ఒక వ్యక్తి వారానికి 2 షిల్లింగుల వేతనం పొందుతూ వుండి, అతని వేతనం నాలుగు షిల్లింగులకు పెరిగినట్లయితే, వేతనాల రేటు 100 శాతం పెరుగుతుంది. వాస్తవ వేతన మొత్తం వారానికి నాలుగు షిల్లింగులయినప్పటికీ నికృష్టమైన పస్తుల వేతనమే అయినప్పటికీ, వేతనాల రేటు దృష్ట్యా యిదొక బ్రహ్మాండమైన విషయంగా కనిపిస్తుంది. అందుచేత మీరు వేతనాల రేటులోని డాబుసరి శాతాలతో భ్రమలకు గురికారాదు. మీరెప్పుడూ ఒక ప్రశ్న అడగాలి: మొదటి వేతన మొత్తం ఎంత?

అంతేకాకుండా, వారానికి 2 షిల్లింగుల చొప్పున పొందే వ్యక్తులు పదిమందీ, 5 షిల్లింగుల చొప్పున పొందే వారు అయిదుగురూ, వారానికి 11 షిల్లింగుల చొప్పున పొందేవారు అయిదుగురూ వుంటే ఆ యిరవైమందీ కలిసి వారానికి మొత్తం 100 షిల్లింగులు, లేక 5 పౌనులు పొందుతారన్నది స్పష్టం. అప్పుడిక వారానికి వారి మొత్తం వేతనాల్లో, మాట వరుసకు 20 శాతం పెరుగుదల తటస్థించిందంటే, అప్పుడు వేతనాల మొత్తం 5 పౌనుల నుండి 6 పౌనులకు పెరుగుతుంది. సగటున చూస్తే వేతనాల సాధారణ రేటు 20 శాతం పెరిగిందని మనం చెప్పవచ్చు. నిజానికి, పదిమంది వేతనం యథాతథంగానే వుండి, ఒక ఐదుగురి వేతనం 5 షిల్లింగులనుండి 6 షిల్లింగులకు మాత్రమే పెరిగి, రెండవ ఐదుగురి వేతనం 55 షిల్లింగులనుండి 70 షిల్లింగులకు పెరిగింది. సగానికి సగం మంది పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడలేదు, నాలుగో వంతు మంది పరిస్థితి అపరిగణనీయమైన

స్థాయికి మాత్రమే పెరిగింది, కేవలం మరో నాలుగో వంతు మంది పరిస్థితి మాత్రమే నిజంగా మెరుగైంది. కాని, సగటున లెక్కవేస్తే, ఆ యిరవై మంది మొత్తం వేతనాలూ 20 శాతం పెరుగుతాయి. వారిని పనిలో పెట్టుకొనే మొత్తం పెట్టుబడికీ, వారు ఉత్పత్తి చేసే సరుకుల ధరలకూ సంబంధించినంతవరకు, సగటు వేతనాల పెరుగుదలలో వారం దరూ సమానంగా పాలుపంచుకొంటే ఎలా వుంటాయో అవి సరిగా అలాగే వుంటాయి. వ్యవసాయ కార్మికులకు సంబంధించినంతవరకు, ఇంగ్లండు, స్కాట్లండుల వివిధ కౌంటీలలో ప్రామాణిక వేతనాలు చాలా భిన్నంగా ఉన్నాయి. కనుక, పెరుగుదల వాటిని మిక్కిలి అసమా నంగా ప్రభావితం చేసింది.

చిట్టచివరి సంగతి, ఆ వేతన పెరుగుదల సంభవించిన దశలో పరస్పర నిరోధక ప్రభా వంగల ఘటనలు — రష్యన్ యుద్ధ[16] పర్యవసానంగా వచ్చిన కొత్త పన్నులు, భారీ ఎత్తున వ్యవసాయ కార్మికుల నివాస గృహాలను కూల్చివేయడం[17] వగైరాలు — జరిగాయి.

తొలిపలుకులు పూర్తయాయి కనుక, యిప్పుడిక 1849 నుండి 1859 వరకు గ్రేట్ బ్రిటన్‌లో వ్యవసాయ కార్మికుల వేతనాల సగటు రేటు సుమారు 40 శాతం పెరి గిందని చెప్పగోరుతున్నాను. నా యీ ఉద్ఘాటనను రుజువుపరచేందుకు గాను నేను కొల్ల లుగా వివరాలను సమకూర్చగలను, కాని మన ప్రస్తుతావసరానికి, "వ్యవసాయంలో వినియుక్త మైన శక్తులు" అన్న అంశంపై లండన్ కళా కేంద్రం[18]లో కీ॥శే॥ జాన్ సి. మోర్టన్ 1860లో పఠించిన చిత్తశుద్ధిపూర్వక సవిమర్శక పత్రాన్ని చదవాల్సిందిగా కోరితే సరి పోతుందని భావిస్తున్నాను. మోర్టన్ పన్నెండు స్కాచ్ కౌంటీలలోనూ, ముప్పై అయిదు ఇంగ్లీషు కౌంటీలలోనూ నివసిస్తున్న సుమారు నూరుమంది వ్యవసాయదారులనుండి సేకరించిన బిల్లులనుండీ, తదితర అధికారిక పత్రాలనుండీ వివరాల నిచ్చాడు.

మన మిత్రుడు వెస్టన్ అభిప్రాయం మేరకు, మరి అదే కాలంలో ఫ్యాక్టరీ పనివారి వేతనాల్లో వచ్చిన పెరుగుదలతోబాటు పరిశీలించినప్పుడు, 1849–1859 దశలో వ్యావసాయిక ఉత్పాదితాల ధరల్లో బృహత్తరమైన పెరుగుదల సంభవించియుండాల్సింది. కాని యథార్థంగా జరిగిన దేమిటి? రష్యన్ యుద్ధం వచ్చి, ఆ దరిమిలా 1854 నుండి 1856 దాకా నాసి పంటలు పండినా, ఇంగ్లండులో ముఖ్యమైన వ్యావసాయిక ఉత్పాదిత మైన గోధుమ సగటుధర 1838–1848 దశలో క్వార్టరు (28 పౌనులు)కు 3 పౌనులున్నదల్లా, 1849–1859 దశలో 2 పౌనుల 10 షిల్లింగులకు పడిపోయింది. అదే కాలంలో వ్యవసాయ కార్మికుల వేతనాలు 40 శాతం పెరగగా, గోధుమ ధరలో యీ తరుగుదల 16 శాతానికి పైగా వుంది. అదే దశలో, దాని అంతాన్ని ఆరంభంతో, 1859ని 1849తో మనం సరిపోలిస్తే, అధికారిక లెక్కల మేరకు పరమ దారిద్ర్యం 9,34,419 మందినుండి 8,60,470 మందికి — తేడా 73,949 మంది — తగ్గింది. చాలా

తక్కువ తగ్గుదలేనన్న సంగతిని నేనంగీకరిస్తాను, మరి తదుపరి సంవత్సరాల్లో యీ తగ్గుదల తరిగింది కూడా, అయినప్పటికీ అది తగ్గుదలే.

ధాన్య చట్టాల[19] రద్దు పర్యవసానంగా, 1838–1848 దశతో పోల్చినప్పుడు, 1849–1859 దశలో విదేశీ ఆహార ధాన్యాల దిగుమతి రెట్టింపుకి పైగా పెరిగిందని చెప్పవచ్చు. మరి దీని అర్థమేమిటి? సిటిజెన్ వెస్టన్ దృక్కోణంలో విదేశీ మార్కెట్లపై ఆకస్మికమైన, బ్రహ్మాండమైన, నిరంతరాయంగా పెరుగుతున్న యీ గిరాకీ — అది బయటనుండి వచ్చినా, లోనుండే వచ్చినా, పెరిగిన గిరాకీయొక్క ఫలితం ఒకలాగే వుంటుంది కనుక — వ్యవసాయిక ఉత్పాదితాల ధరలను అక్కడ ఆకాశమంత ఎత్తు దాకా పెంచేసివుండాల్సింది. కాని వాస్తవంలో జరిగిందేమిటి? పంటలు దెబ్బతిన్న కొన్ని సంవత్సరాల మాట అటుంచి, ఆ దశ అంతట్లోనూ కూడా ఆహార ధాన్యాల ధరలో వినాశకరమైన ఆ తరుగుదల ఫ్రాన్సులో ఆవేశపూరిత ప్రసంగాలకు యితివృత్తంగా ఉంటూవచ్చింది; అమెరికన్లు మరలమరల తమ అదనపు నిల్వలను తప్పనిసరిగా తగలబెట్టాల్సిన పరిస్థితిలో పడ్డారు; ఉర్కుహార్ట్ మాటలను మనం విశ్వసించవలసివస్తే, రష్యా, యాంకీ* పోటీ మూలంగా యూరప్ మార్కెట్‌లో తన వ్యవసాయక సరుకుల ఎగుమతులు తగ్గిపోయినందువల్ల అమెరికాలో అంతర్యుద్ధాన్ని[20] రెచ్చగొట్టిందన్నమాట.

సిటిజెన్ వెస్టన్ వాదం, దాని అనిర్దిష్ట రూపానికి కుదింపబడినప్పుడు యిలా వుంటుంది: గిరాకీలో వచ్చే ప్రతి పెరుగుదలా సదా ఒకానొక నిర్దిష్టమైన ఉత్పత్తి మొత్తం ప్రాతిపదికపై సంభవిస్తుంది. అందుకని అది, గిరాకీ ఉన్న వస్తువుల సరఫరాను ఎన్నడూ పెంచలేదు, కాని, వాటి డబ్బు ధరలను మాత్రమే పెంచగలదు. పెరిగిన గిరాకీ, కొన్ని సందర్భాల్లో, సరుకుల మార్కెట్ ధరలను బొత్తిగా ఎటువంటి మార్పూ లేకుండా అలాగే వుంచుతుంది, మరికొన్ని సందర్భాల్లో మార్కెట్ ధరల్లో తాత్కాలిక పెరుగుదలను, దానితో బాటు సరఫరాలో పెరుగుదలను, దానితోబాటు వాటి మొదటి స్థాయికి, చాల సందర్భాల్లో వాటి మొదటి స్థాయికన్న తక్కువకు ధరల తగ్గుదలను కలిగిస్తుంది — ఈ విషయాన్ని అత్యంత సామాన్యమైన పరిశీలన సైతం స్పష్టంచేస్తుంది. గిరాకీలో యీ పెరుగుదల అదనపు వేతనాలనుండి ఉత్పన్నమవుతుందా, లేక మరే యితర కారణంనుండైనా ఉత్పన్నమవుతుందా అన్నది, యీ సమస్యకు సంబంధించిన పరిస్థితులను ఎంతమాత్రమూ మార్చదు. సిటిజెన్ వెస్టన్ దృక్పథం మేరకు, వేతనాల పెరుగుదలకు సంబంధించిన అసాధారణ పరిస్థితులలో సంభవించే విషయాన్ని వివరించడం ఎంత కష్టమో సాధారణ విషయాన్ని వివరించడం కూడా అంతే కష్టం. అందుచేత, అతని వాదానికి మనం పరిశీలిస్తున్న అంశంతో

---

* అమెరికన్లు. — సం.

ఎటువంటి విశిష్టమైన సందర్భోచిత్యమూ లేదు. ఏ నియమాలచేతనైతే గిరాకీలో పెరుగుదల చివరకు మార్కెట్ ధరల్లో పెరుగుదలకు దారితీసేందుకు బదులు సరఫరా పెరుగుదలకు దారితీస్తుందో ఆ నియమాలను అతను అర్థంచేసుకోలేకపోవడాన్ని అతని వాదం స్పష్టంచేసింది.

## 3. వేతనాలు, డబ్బు

చర్చ రెండవ రోజున మన మిత్రుడు వెస్టన్ తన పాత ఉద్ఘాటనలనే కొత్త రూపాలలో పునశ్చరణచేశాడు. ఆయన యిలా అన్నాడు: డబ్బు వేతనాలలో సార్వత్రిక పెరుగుదల పర్యవసానంగా, అంతే వేతనాలను చెల్లించడానికి ఎక్కువ డబ్బు అవసరమవుతుంది. డబ్బు స్థిర పరిమాణంలో ఉంటే కనుక, స్థిరమైన యీ డబ్బు మొత్తంతో పెరిగిన వేతనాలను మీరెలా చెల్లించగలరు? కార్మికునికి డబ్బు వేతనం పెరిగినప్పటికీ, అతనికి లభించే సరుకుల మొత్తం స్థిరం కావడంవల్ల మొదట ఈ యిబ్బంది వచ్చింది; మరి యిప్పుడు, సరుకుల మొత్తం స్థిరమైనప్పటికీ పెరిగిన డబ్బు వేతనాల కారణంగా యిబ్బంది కలుగుతోంది. అయితే, ఆయన మొదటి పిడివాద సూత్రాన్ని మీరు తిరస్కరించినట్లయితే, రెండవ యిబ్బంది తొలగిపోతుంది.

కానైతే, యీ డబ్బు సమస్యకు మన ముందున్న విషయంతో బొత్తిగా ఎలాంటి సంబంధమూ లేనేలేదని నేను నిరూపిస్తాను.

యూరపులో ఏ యితర దేశంలోకన్న మీ దేశంలో చెల్లింపుల పద్ధతి మరింత బాగా నిర్దుష్టంచెయ్యబడింది. బ్యాంకింగు వ్యవస్థ విస్తృతి కేంద్రీకరణల ధర్మమా అని అదే మొత్తం డబ్బు విలువలను చలామణీ చెయ్యడానికీ, అదే మొత్తం, లేక అధికతర మొత్తపు వ్యాపారాన్ని నిర్వహించడానికీ చాలా తక్కువ డబ్బు అవసరమవుతుంది. ఉదాహరణకు, వేతనాలకు సంబంధించినంతవరకు, ఇంగ్లీషు ఫ్యాక్టరీ కార్మికుడు తన వేతనాన్ని వారంవారం అంగడి యజమానికి చెల్లిస్తాడు, అంగడి యజమాని దానిని వారంవారం బ్యాంకరుకి పంపుతాడు, అతను వారంవారం దానిని ఫ్యాక్టరీ యజమానికి తిరిగి యిస్తాడు. అతను తిరిగి దానిని తన కార్మికులకు బట్వాడా చేసేస్తాడు, యిలా సాగుతుంది యీ క్రమం. ఈ సౌలభ్యం ద్వారా ఒకానొక కార్మికునియొక్క సాలుసరి వేతనం, మాటవరుసకు 52 పౌనులు చెల్లించడానికి ఒకేఒక్క సవరన్ను* ప్రతి వారమూ పైన పేర్కొన్న చక్రక్రమంలో తిప్పితే సరిపోతుంది.

---

* సవరన్ – ఒక పౌనుకు సమానమైన ఇంగ్లీషు బంగారు నాణెం. – సం.

ఈ పద్ధతి స్కాట్లండులో వున్నంత నిర్దుష్టంగా ఇంగ్లండులోనే లేదు, మరి, ఇంగ్లండు లోనైనా అన్ని చోట్లా ఒకే మాదిరిగా నిర్దుష్టంగా లేదు. అందుకని, ఉదాహరణకు, కేవలం పారిశ్రామిక జిల్లాలతో సరిపోల్చినప్పుడు, కొన్ని వ్యావసాయిక జిల్లాలలో సాపేక్షంగా చాల తక్కువ మొత్తపు విలువలను చలామణీ చెయ్యడానికి చాల ఎక్కువ డబ్బు అవసరమవుతోంది.

ఇంగ్లీషు ఛానల్ దాటి యూరప్ ఖండంలో పరిశీలించినట్లయితే, ఇంగ్లండులోకన్న అక్కడ డబ్బు వేతనాలు చాల తక్కువ అన్న సంగతిని మీరు చూస్తారు; కాని జర్మనీ, ఇటలీ, స్విట్జర్లండ్, ఫ్రాన్సు దేశాలలో డబ్బు వేతనాలు చాలా ఎక్కువ డబ్బులో చలామణీ అవుతున్న సంగతిని కూడ మీరు చూస్తారు. అక్కడ అదే సవరన్ అంత త్వరగా బ్యాంకుకీ తిరిగి రాదు; అంత త్వరగా పారిశ్రామిక పెట్టుబడిదారు దగ్గరకూ తిరిగి రాదు. అందుచేత, ప్రతి ఏడూ 52 పౌనులను చలామణీ చెయ్యడానికి ఒక్క సవరన్ సరిపోయేందుకు బదులు 25 పౌనుల సాలుసరి వేతనాలను చలామణీ చెయ్యడానికే మూడు సవరన్లు అవసరమవుతాయి. ఈ విధంగా, యూరప్ ఖండ దేశాలను ఇంగ్లండుతో సరిపోల్చడం ద్వారా, ఎక్కువ డబ్బు వేతనాల చలామణీకి కన్న తక్కువ వేతనాల చలామణీకి ఎక్కువ డబ్బు అవసరం కావచ్చునన్న సంగతి వెంటనే స్పష్టపడుతుంది. నిజానికిది, మన ప్రస్తుతాంశంతో ఎటువంటి సంబంధమూ లేని ఒక సాంకేతిక విషయం.

నాకు తెలిసిన అత్యంత నిర్దుష్టమైన అంచనాల మేరకు, ఇంగ్లండు కార్మికవర్గపు సాలుసరి ఆదాయాన్ని 25 కోట్ల పౌనులుగా అంచనా వెయ్యవచ్చు. బృహత్తరమైన యీ మొత్తం సుమారు 30 లక్షల పౌనులతో చలామణీ అవుతోంది. వేతనాలు 50 శాతం పెరిగాయని అనుకోండి. అప్పుడు 30 లక్షల పౌన్ల డబ్బుకి బదులు 45 లక్షల పౌన్ల డబ్బు అవసరమవుతుంది. కార్మికుని దినసరి ఖర్చువెచ్చాలు అత్యధిక భాగం వెండి, రాగి నాణేలలో — అంటే, బంగారానికి వేటి సాపేక్ష విలువ అయితే, అపరివర్తనీయమైన కాగితపు కరెన్సీ నోట్ల మాదిరిగానే, చట్టంచే చిత్తంవచ్చిన రీతిలో నిశ్చయింపబడుతుందో కేవలం అటువంటి టోకెన్లలో — జరుగుతాయి. కనుక, డబ్బు వేతనంలో 50 శాతం పెరుగుదల సంభవించినట్లయితే, మహా అయితే, అదనంగా మరో 10 లక్షల సవరన్ల చలామణీ అవసరమవుతుంది. ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండుయొక్క, లేక ప్రైవేటు బ్యాంకుల యొక్క బొక్కసాలలో బంగారు, వెండి కడ్డీల రూపంలోను, నాణేల రూపంలోను పడి వున్న 10 లక్షలూ బయటకు చలామణీలోకి వస్తాయి. కాని, అదనపు డబ్బు అవసరం నుండి ఏమైనా యిబ్బంది ఉత్పన్నమయ్యేట్లయితే, యీ 10 లక్షల అదనపు నాణేల పోతకూ, అరుగుతరుగులు మొదలైనవాటికీ అయ్యే అల్ప వ్యయాన్ని సైతం మిగుల్చుకోవచ్చు. ఈ దేశపు డబ్బు రెండు పెద్ద విభాగాలుగా విభజింపబడిందన్న సంగతి మీ అందరికీ తెలుసు.

ఒక రకపు డబ్బు రకరకాల బ్యాంకు నోట్లతో కూడినది, ఇది వ్యాపారస్తులకూ వ్యాపారస్తులకూ మధ్య బేరాల్లోనూ, వినిమయదార్లు వ్యాపారస్తులకు చేసే పెద్ద పెద్ద చెల్లింపుల లోనూ వినియుక్తమవుతుంది. కాగా, రెండవ రకపు డబ్బు అయిన లోహపు నాణేలు చిల్లర వర్తకంలో వినియుక్తమవుతాయి. భిన్నమైనవే అయినప్పటికీ, యీ రెండు డబ్బు రకాలూ ఒకటి మరొకదానితో కలిసి మెలిసి పనిచేస్తాయి. ఈ విధంగా బంగారు నాణెం, చాలా ఎక్కువ మేరకు, 5 పౌనుల కన్న తక్కువ చిల్లరమల్లర మొత్తాలన్నింటికీ పెద్ద పెద్ద చెల్లింపుల్లో సైతం చలామణీ చెయ్యబడుతుంది. ఒకవేళ రేపు 4, 3, లేక 2 పౌనుల నోట్లు జారీచెయ్యబడినట్లయితే, యీ చలామణీ వాహికలలో ప్రవహించే బంగారం వెన్వెంటనే వాటిలోంచి బయటకు గెంటివెయ్యబడి, డబ్బు వేతనాల పెరుగుదల కారణంగా ఏ వాహికలలోనైతే దాని అవసరముంటుందో వాటిలోకి అది ప్రవహిస్తుంది. ఈ విధంగా, వేతనాలలో 50 శాతం పెరుగుదల కారణంగా ఏ అదనపు 10 లక్షల డబ్బు అయితే అవసరమైందో అది, ఒక్క గానొక్క అదనపు సవరనునైనా తీసుకురాకుండా సరఫరా అవుతుంది. ఒక్కగానొక్క అదనపు బ్యాంకు నోటునైనా ముద్రించకుండా, అదనంగా ఒక హుండీని చలామణీ చెయ్యడంద్వారా, లాంకషైరులో చాల కాలంగా జరుగుతున్నట్లు, యిదే ఫలితాన్ని సాధించవచ్చు.

వేతనాల రేటులో సాధారణ పెరుగుదల సంభవించినప్పుడు, ఉదాహరణకు, సిటిజెన్ వెస్టన్ ఊహించినట్లు, వ్యవసాయ కార్మికుల వేతనాలు 100 శాతం పెరిగినప్పుడు, ఆ పెరుగుదల జీవితావసర వస్తువుల ధరలో విశేషమైన పెరుగుదలకు దారితీసి, సిటిజెన్ వెస్టన్ చెప్పేదాన్నిబట్టి, అలభ్యమయ్యేటంత మొత్తంలో అదనపు డబ్బు అవసరమయ్యేమాటైతే వేతనాలలో సాధారణ పతనం అదే ఫలితాన్ని, అదే స్థాయిలో, కానైతే ఎదురు దిశలో, కలిగించి తీరాలి. అంతే కదా! 1858–1860 సంవత్సరాలు నూలు పరిశ్రమకు అత్యంత సౌభాగ్యవంతమైనవని మీ అందరికీ తెలిసినదే, విశేషించి 1860వ సంవత్సరం నూలు పరిశ్రమకు సంబంధించినంతవరకు వాణిజ్య చరిత్రలోనే సాటిలేనిది; అదే సమయంలో యితర పారిశ్రామిక శాఖలన్నీ కూడా బాగా వర్ధిల్లాయి. నూలు పరిశ్రమలో పనిచేసేవారి వేతనాలూ, దానికి సంబంధించిన యితర అన్ని శాఖలలోని కార్మికుల వేతనాలూ 1860లో చేరుకున్నంత అధికతమ స్థాయికి అంతకు ముందెన్నడూ చేరుకోలేదు. అంతలో అమెరికాలో ఆర్థిక సంక్షోభం సంభవించడంతో ఈ వేతనాల మొత్తం ఆకస్మికంగా అంతకుముందరి మొత్తంలో నాలుగవ వంతుకు తగ్గింపబడింది. అందుకు భిన్నంగా అవి పెరిగియుంటే, ఆ పెరుగుదల 300 శాతం అయ్యుండేది. వేతనాలు 5 నుండి 20కి పెరిగితే, అవి 300 శాతం పెరిగాయంటాం; అవి 20 నుంచి 5కి పడిపోతే అవి 75 శాతం పడిపోయాయంటాం; కాని మొదటి దానిలో పెరుగుదల మొత్తమూ, రెండవ దానిలో తగ్గుదల మొత్తమూ ఒకటిగానే వుంటుంది, అక్షరాలా 15 షిల్లింగులే వుంటుంది. వేతనాల రేటులో

యిది ఆకస్మికము, అనిదంపూర్వము, పెద్ద సంఖ్యలో కార్మికులపై ప్రభావం బరపే మార్పు, మరి, నూలు పరిశ్రమలో ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులనే కాకుండా పరోక్షంగా దానిపై ఆధారపడే కార్మికులను సైతం మనం లెక్కించినట్లయితే, వారు వ్యవసాయ కార్మికులకు ఒకటిన్నర రెట్లు అధికంగా వుంటారు, మరి గోధుమ ధర పడిపోయిందా? లేదు, సరికదా అది, 1858–1860 మధ్య మూడేళ్ల కాలంలో క్వార్టరు గోధుమలకు సాలుసరి సగటు ధర 47 షిల్లింగుల 8 పెన్నీలున్నదల్లా, 1861–1863 మధ్య మూడేళ్ల కాలంలో క్వార్టరుకు సగటు ధర 55 షిల్లింగుల 10 పెన్నీలకు పెరిగింది. నాణేలకు సంబంధించినంతవరకు 1860లో టంకసాలలో 33,78,102 పౌనుల నాణేలు పోత పొయ్యబడగా, 1861లో 86,73,232 పౌనుల నాణేలు పోతపొయ్యబడ్డాయి. అంటే, 1860లో కన్న 1861లో 52,95,130 పౌనుల నాణేలు అధికంగా పోతపొయ్యబడ్డాయన్నమాట. 1860లో కన్న 1861లో బ్యాంకు నోట్ల చలామణీ 13,19,000 పౌనులు తక్కువ వున్న మాట నిజమేననుకోండి. దీన్ని తీసెయ్యండి. అప్పటికీ సమృద్ధ సంవత్సరమైన 1860తో సరిపోల్చినప్పుడు 1861వ సంవత్సరంలో 39,76,130 పౌనుల మొత్తం, లేక సుమారు 40 లక్షల పౌనుల డబ్బు అధికంగా మిగులుతుంది; కాని అదే సమయంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లోని మూసబంగారు నిల్వ తగ్గిపోయింది, కచ్చితంగా అదే నిష్పత్తిలో కాకపోయినా, సుమారు అదే నిష్పత్తిలో తగ్గిపోయింది.

1862వ సంవత్సరాన్ని 1842తో సరిపోల్చి చూడండి. చలామణీలోకి వచ్చిన సరుకుల విలువలలోనూ, పరిమాణంలోనూ బ్రహ్మాండమైన పెరుగుదలే కాకుండా, 1862లో ఇంగ్లండు, వేల్సులలో రైళ్లకోసం షేర్లు, రుణాలు, మొదలైన వాటి నియతమైన లావాదేవీలలో చెల్లింపబడిన పెట్టుబడే 32 కోట్ల పౌనుల దాకా వుంది; ఇంత పెద్ద మొత్తం 1842లో ఊహాతీతంగా కనిపించియుండేది. అయినాకూడా, 1862లోను, 1842లోను ఉన్న కరెన్సీ మొత్తాలు దాదాపు సమానంగా వున్నాయి. మరి, సరుకుల విలువే కాకుండా దరహంమీద అన్ని డబ్బు లావాదేవీల విలువా విశేషంగా పెరగడంతోబాటే, చలామణీలో వున్న డబ్బులో అంతకంతకు తగ్గుదల ధోరణి మీకు కనిపిస్తుంది. మన మిత్రుడు వెస్టన్ దృక్కోణంనుంచి యిదొక పరిష్కార సాధ్యంకాని చిక్కుసమస్య.

ఈ విషయాన్ని మరింత లోతుగా పరిశీలించి ఉన్నట్లయితే, మిత్రుడు వెస్టన్ వేతనాల సమస్యను అటుంచి, వేతనాలు స్థిరంగా ఉంటాయనుకొని, చలామణీలోకి వచ్చే సరుకుల విలువా, వాటి పరిమాణమూ, దరహంమీద పరిష్కరింపబడాల్సిన డబ్బు లావాదేవీల మొత్తమూ నిత్యం మారుతూవుంటాయని గ్రహించియుండేవాడు; జారీచెయ్యబడిన బ్యాంకునోట్ల పరిమితి సైతం నిత్యం మారుతూవుంటుందని గ్రహించియుండేవాడు; నగదు ద్వారా కాకుండా హుండీలు, చెక్కులు, జమాఖర్చుల మార్పిళ్లు, క్లియరింగ్ హౌసుల ద్వారా వసూలుచెయ్యబడే

మొత్తాలు కూడా ఏరోజుకారోజు మారుతాయని గ్రహించియుండేవాడు; వాస్తవంలో లోహపు డబ్బు ఆవశ్యకతకు సంబంధించినంతవరకు, చలామణీలో వున్న నాణేలకూ బ్యాంకుల ఖజానాల్లో నిలవవున్న లేక మూలుగుతూ పడివున్న నాణేలకూ, వెండిబంగారాలకూ మధ్య నిష్పత్తి ఏరోజుకారోజు మారుతూ వుంటుందని గ్రహించివుండేవాడు; దేశంలో చలామణీలో వుంచబడిన అంతర్జాతీయ చలామణీ కోసం బయటకు పంపబడిన వెండిబంగారాల పరిమాణం నిత్యం మారుతూవుంటుందని గ్రహించియుండేవాడు. మిత్రుడు వెసన్ స్థిరమైన డబ్బుకి సంబంధించిన తన పిడివాద సూత్రం, అనుదిన చలనంతో ఎంతమాత్రమూ పొసగని జడసూత్రం, ఘోరమైన పొరపాటని గ్రహించియుండేవాడు. డబ్బు చలామణీ నియమాలకు సంబంధించిన దురవగాహనను వేతనాల పెరుగుదలకు ఒక ప్రతికూలవాదంగా తిప్పేందుకు బదులు, డబ్బు చలామణీ తనను తాను నిరంతరాయంగా మారుతూ వుండే పరిస్థితులకు సమన్వితం చేసుకోడాన్ని సాధ్యంచేసే ఆ నియమాలను అతడు అధ్యయనం చేసియుండాల్సింది.

## 4. సరఫరా, గిరాకీ

మన మిత్రుడు వెస్టన్ "repetitio est mater studiorum" అన్న లాటిన్ సామెతను (అంటే అధ్యయనానికి పునశ్చరణ మూలం అన్నదాన్ని) అనుసరిస్తున్నాడు. మరి అందుకని, తన మూల పిడివాద సూత్రాన్ని కొత్త రూపంలో వల్లించి, వేతనాల పెరుగుదల ఫలితంగా డబ్బు చలామణీ తగ్గిపోతుందనీ, తత్పర్యవసానంగా పెట్టుబడి తరిగిపోతుందనీ, వగైరాలు ఉద్ఘాటిస్తున్నాడు. డబ్బుకి సంబంధించిన అతని పిచ్చి ఆలోచనపై నా అభిప్రాయాన్ని యింతకు ముందే వ్యక్తంచేశాను కనుక, మిత్రుడు వెస్టన్ ఊహలో డబ్బుకు సంబంధించిన కాల్పనిక దుర్ఘటననుండి ఉత్పన్నమయ్యే ఆ కాల్పనిక పర్యవసానాలను గురించి చర్చించడం పూర్తిగా నిరర్థకమని నేను భావిస్తున్నాను. అందుకని, అతడు పదేపదే భిన్నభిన్న రూపాలలో ఏ పాత పిడివాద సూత్రాన్నైతే పునశ్చరణ చేస్తున్నాడో, అదే పిడివాద సూత్రాన్ని దాని సరళతమ సైద్ధాంతిక రూపంలో క్లుప్తంగా నేనిప్పుడు చెప్తాను.

అతడు తన విషయాంశాన్ని విచక్షణా ఆలోచనా రహితమైన పద్ధతిలో పరిశీలిస్తున్నాడన్న విషయానికి ఒక్క ఉదాహరణ సరిపోతుంది. వేతనాల పెరుగుదలకు వ్యతిరేకంగా, లేక అటువంటి పెరుగుదల ఫలితంగా సంభవించే అధిక వేతనాలకు వ్యతిరేకంగా అతడు వాదిస్తున్నాడు. నేనిప్పుడు అతన్ని ఒక ప్రశ్న అడుగుతాను, అధికవేతనాలంటే ఏమిటి, అల్పవేతనాలంటే ఏమిటి? ఉదాహరణకు, వారానికి 5 షిల్లింగులు అల్పవేతనమూ, వారానికి

20 షిల్లింగులు అధికవేతనమూ అని మీ రెందుకంటున్నారు? 20తో పోలిస్తే 5 తక్కువయే మాటైతే, 200తో సరిపోల్చినప్పుడు 20 మరింత తక్కువ కదా? ఎవరైనా థర్మామీటరును గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడు, అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలను గురించి ఉపన్యాసం దంచనారంభిస్తే దానివలన ఎవరికీ ఎటువంటి జ్ఞానమూ ఒనగూడదు. అతను ముమ్ముందుగా మనకు నీటి ఘనీభవన ఉష్ణోగ్రతని, మరిగే ఉష్ణోగ్రతనీ కనుగొనడమెలాగో చెప్పాలి, మరి యీ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణాంకాలు థర్మామీటరును అమ్మేవాళ్లయొక్క, లేక తయారుచేసేవాళ్లయొక్క యిచ్ఛానుసారంగా కాక ప్రకృతి నియమాలచేత ఎలా నిర్ధరింపబడతాయో చెప్పాలి ప్రస్తుతాంశానికి వస్తే, వేతనాలకూ, లాభాలకూ సంబంధించి, ఆర్థిక నియమాల దృష్ట్యా అటువంటి ప్రామాణికాంశాలను నిర్ధారణచెయ్యడంలో సిటిజెన్ వెస్టన్ విఫలుడవడమే కాకుండా, వాటిని కనుగొనాల్సిన ఆవశ్యకతను సైతం అతడు గుర్తించలేదు. వేతనాల పరిమితులను కొలిచేందుకు ప్రమాణమంటూ ఒకటి ఉండాలనీ, అటువంటి ఆ ప్రమాణంతో సరిపోల్చినప్పుడు మాత్రమే వేతనం "అధికమో," "అల్పమో" చెప్పడం సాధ్యమన్న విషయం స్వయం విదితమే అయినప్పటికీ "అధిక," "అల్ప" అన్న పదాలను సామాన్య ప్రజల భాషలో రూఢియైన అర్థంలో స్వీకరించడంతో అతడు తృప్తి చెందాడు.

ఒకానొక నిశ్చిత పరిమాణపు శ్రమకు ఒకానొక నిశ్చిత పరిమాణపు డబ్బు ఎందుకివ్వబడుతుందో అతడు చెప్పలేడు. ఒకవేళ అతడు "యిది సరఫరా గిరాకీల నియమంచేత నిర్ధరింపబడుతుంది" అని కనుక చెప్పేమాటైతే, వెన్వెంటనే అతన్ని, మరైతే, ఆ సరఫరా గిరాకీలు ఏ నియమంద్వారా నిర్ధారితమవుతాయని నేను ప్రశ్నించాల్సివుంటుంది. నా యీ జవాబు అతన్ని పూర్తిగా చిత్తుచేస్తుంది. శ్రమయొక్క సరఫరా గిరాకీల మధ్య సంబంధం నిరంతరాయంగా మారుతూవుంటుంది, దానితోబాటే శ్రమయొక్క మార్కెట్ ధర కూడా నిరంతరాయంగా మారుతూవుంటుంది. గిరాకీ కనక సరఫరాను మించిపోయినట్లయితే, అప్పుడు వేతనాలు పెరుగుతాయి; సరఫరా కనక గిరాకీని మించుతే వేతనాలు పడిపోతాయి; అయితే అటువంటి పరిస్థితుల్లో ఉదాహరణకు సమ్మె ద్వారానో, లేక మరే యితర పద్ధతి ద్వారానో గిరాకీ సరఫరాల మధ్య వాస్తవంగా వున్న పరిస్థితి ఏమిటో పరీక్షించడం అవసరం కావచ్చు. కాని, సరఫరా గిరాకీలనే వేతనాలను నిర్ధారణ చేసే నియమంగా మీరు పాటించే మాటయితే, వేతనాల పెరుగుదలకు వ్యతిరేకంగా ఘోషించడం ఎంత ప్రయోజనరహితమో అంత కుత్సితమైనది కూడాను. ఎందుకంటే, ఏ సర్వోన్నత సూత్రాన్నైతే మీరు పదేపదే వల్లిస్తున్నారో దాన్ని అనుసరించే, అప్పుడు వేతనాలు పడిపోతూ వుండటం ఎలా ఆవశ్యకమూ, సబబూ అవుతుందో అలాగే వేతనాలు అప్పుడప్పుడు పెరుగుతూవుండటం కూడా అంతే ఆవశ్యకమూ, సబబూ అవుతుంది. ఒకవేళ మీరు, సరఫరా గిరాకీలను వేతనాలను నిర్ధారణ

చేసే నియమంగా గుర్తించకపోయినట్లయితే, నా వెనకటి ప్రశ్నను – ఒక నిశ్చిత పరిమాణపు శ్రమకు ఒక నిశ్చిత పరిమాణపు డబ్బు ఎందుకు చెల్లింపబడుతోందన్న ప్రశ్నను – మళ్లీ అడగాల్సివస్తుంది.

కాని యీ విషయాన్ని మరింత విస్తృత రూపంలో పరిశీలించండి: శ్రమయొక్క విలువ గాని, మరే యితర సరుకుయొక్క విలువగాని చిట్టచివరకు సరఫరా గిరాకీలచేత నిర్ణయింపబడుతుందని ఊహించినట్లయితే మీరు బొత్తిగా పొరపడినవారవుతారు. సరఫరా గిరాకీలు మార్కెట్ ధరల్లో తాత్కాలికమైన ఎగుడుదిగుళ్లనే తప్ప మరి దేన్నీ నిర్ణయించలేవు. ఒకానొక సరుకుయొక్క మార్కెట్ ధర దాని విలువ కన్న ఎందుకు పెరుగుతుంది, లేక ఎందుకు తగ్గుతుంది అన్న విషయాన్ని మాత్రమే సరఫరా గిరాకీల ద్వారా తెలుసుకోగలం గాని, అసలు విలువ అంటే ఏమిటన్న విషయాన్ని సరఫరా గిరాకీల ద్వారా తెలుసుకోడం సాధ్యం కాదు. సరఫరా గిరాకీలు సమతులితమయ్యాయనుకోండి, లేక అర్థశాస్త్రజ్ఞుల పరిభాషలో, ఒకటి మరొకదానికి సరిపుచ్చుకున్నాయనుకోండి. ఇంకేముంది, యీ పరస్పర విరుద్ధ శక్తులు ఒకదానితో మరొకటి సమతులితమైన వెన్వెంటనే అవి ఒక దాన్ని మరొకటి స్తంభింపచేసుకుంటాయి, అప్పుడవి యిటునుండి అటుగాని, అటునుండి యిటుగాని కదలడం మానుకుంటాయి. ఏ క్షణంలోనైతే సరఫరా గిరాకీలు సమతులితమూ, తత్కారణంగా క్రియారహితమూ అవుతాయో ఆ క్షణాన, ఒకానొక సరుకుయొక్క మార్కెట్ ధర దాని అసలు విలువతో, ప్రామాణికమైన ఏ ధర చుట్టూ అయితే మార్కెట్ ధరలు ఆటుపోట్లు పొందుతూ వుంటాయో దానితో సరిసమానమవుతుంది. అందుచేత, యీ విలువ స్వభావాన్వేషణలో, మార్కెట్ ధరలపై సరఫరా గిరాకీల తాత్కాలిక ప్రభావాలతో మనకు ఎటువంటి ప్రసక్తి ఉండదు. వేతనాల విషయంలోనూ, తదితర సరుకులన్నింటియొక్క ధరల విషయంలోనూ కూడా యిదే వర్తిస్తుంది.

## 5. వేతనాలు, ధరలు

మన మిత్రుని వాదనలన్నింటినీ అత్యంత సరళమైన సైద్ధాంతిక రూపంలో వ్యక్తీకరిస్తే, కేవలం ఒకేఒక పిడివాద సూత్రంగా తేలుతుంది: "సరుకుల ధరలు వేతనాలచేత నిర్ణయింపబడుతాయి, లేక నియంత్రింపబడుతాయి."

పాతగిలిపోయి, పొరపాటని రుజువైన యీ అభిప్రాయం భ్రమాజనితమని వాస్తవ విషయాలను చూపి నేను నిరూపించగలను. ఇంగ్లండులోని ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు, గనికార్మికులు, ఓడలు నిర్మించే కార్మికులు, తదితర కార్మికులు తమ శ్రమకు సాపేక్షంగా అధిక

వేతనాలు పొందుతున్నారు, కాని వారు తయారుచేసిన సరుకులు యితర అన్ని దేశాలయొక్క అటువంటి సరుకుల కన్న చౌకగా అమ్ముడుపోతున్నాయి. కాగా మరోవంక, ఇంగ్లీషు వ్యవసాయ కార్మికులు తమ శ్రమకు సాపేక్షంగా తక్కువ వేతనాలు పొందుతున్నప్పటికీ, వారు ఉత్పత్తి చేసిన సరుకులు, అన్ని యితర దేశాలలో తయారైన అటువంటి సరుకులతో పోల్చినప్పుడు ప్రియంగా అమ్ముడుపోతున్నాయి. ఒకే దేశంలో ఒక సరుకును మరొక సరుకుతో పోల్చడం ద్వారా, లేక విభిన్న దేశాల సరుకులను సరిపోల్చడంద్వారా నేను మీకొక విషయం చెప్పగలను. అదేమిటంటే, కొన్ని మినహాయింపులను వదిలేసి — అవైనా పైకి మినహాయింపులుగా కని పించేవే గాని నిజానికి మినహాయింపులు కావు — సగటును చూచినట్లయితే అధిక ధర కలిగిన శ్రమ తక్కువ ధర కలిగిన సరుకులనూ, తక్కువ ధర కలిగిన శ్రమ అధిక ధర కలిగిన సరుకు లనూ ఉత్పత్తిచేస్తాయి. అయితే దీన్నిబట్టి, ఒక సందర్భంలో శ్రమ అధిక ధర, మరో సంద ర్భంలో శ్రమ తక్కువ ధరా పరస్పర విరుద్ధమైన క్రమానుసార పరిణామాలకు కారణమని రుజువు కాదు, కాని దీన్నిబట్టి, సరుకు ధర శ్రమ ధరద్వారా నిర్ధారణ కాదన్న విషయం మాత్రం నిస్సందేహంగా రుజువవుతోంది. కాని, మనకిక్కడ యీ అనుభవవాద పద్ధతిని వినియోగించడం బొత్తిగా అనవసరం.

సిటిజెన్ వెస్టన్ "సరుకుల ధరలు వేతనాల చేత నిర్ణయింపబడుతాయి, లేక నియంత్రింప బడుతాయి" అనే పిడివాద సూత్రాన్ని ఎన్నడూ ప్రతిపాదించలేదని బహుశా ఎవరైనా అనవచ్చు. నిజానికి, ఆయన దీన్ని యీ విధంగా ఎన్నడూ సూత్రీకరించలేదు. అందుకు భిన్నంగా ఆయన, లాభమూ, కౌలుసొమ్మూ సరుకుల ధరల్లో భాగాలని చెప్పాడు, ఎందుకంటే, సరు కుల ధరలనుండే కార్మికుని వేతనాలే కాకుండా, పెట్టుబడిదారు లాభాలూ, భూస్వామి కౌలు మొత్తాలూ చెల్లింపబడాల్సివుంది కనుక అన్నాడు. కాని అతని ఉద్దేశాన్ని అనుసరించి ధర ఏ విధంగా నిర్ధరింపబడుతుంది? అన్నిటికన్న ముందుగా వేతనాలచేత నిర్ధరింపబడుతుంది. అటుతర్వాత అదనపు శాతమొకటి పెట్టుబడిదారు తరఫున ధరకు చేర్చబడుతుంది; ఆ తర్వాత మరో అదనపు శాతం భూస్వామి తరఫున ధరకు చేర్చబడుతుంది. ఒకానొక సరుకు ఉత్పత్తిలో వినియోగింపబడిన శ్రమయొక్క వేతనం 10 అనుకోండి. లాభపు రేటు 100 శాతమైతే, అప్పుడు యివ్వబడిన వేతనానికి పెట్టుబడిదారు తన 10ని కలుపుతాడు; మరి కౌలురేటు కూడా 100 శాతమైతే వేతనానికి మరో 10 జోడింపబడుతుంది, కాగా సరుకు మొత్తం ధర 30 అవుతుంది. కాని యీ పద్ధతిలో ధరను నిర్ణయించడమంటే అర్థం, వేతనంపైన ఆధారపడి మాత్రమే ధరను నిర్ణయించడమవుతుంది. ఒకవేళ యింతకు ముందు చెప్పిన ఉదాహరణలో వేతనం 20కి పెరిగినట్లయితే, సరుకు ధర 60కి పెరుగుతుంది, వగైరా. కాగా, వేతనాలే ధరలను నియంత్రితంచేస్తాయన్న పిడివాద సూత్రాన్ని ప్రతిపాదించిన పాతకాలపు అర్థశాస్త్రజ్ఞులందరూ లాభాన్నీ, కౌలునూ వేతనాలకు అదనంగా కలిపే శాతాలుగా మాత్రమే

పరిగణించడం ద్వారా తమ పిడివాద సూత్రాన్ని రుజువుచేసేందుకు ప్రయత్నించారు. అయితే వారిలో ఏ ఒక్కరూ కూడా ఆ శాతాల పరిమితులకు ఏ ఆర్థిక నియమ రూపాన్నీ యివ్వ లేకపోయారు. ఇందుకు భిన్నంగా వారు లాభాలు సంప్రదాయాచారాలచేతనో, పెట్టుబడి దారుని యిచ్ఛచేతనో, లేక అటువంటి నియమాతీతమూ, నిర్వచనాతీతమూ అయిన మరే యితర పద్ధతిచేతనో నిర్ణయింపబడేవిగా తలుస్తున్నట్లుంది. ఒకవేళ లాభాలు పెట్టుబడి దారుల మధ్య పోటీచేత నిర్ణయింపబడుతాయని వారు చెప్పేమాటయితే, వారు చెప్పినది అర్థ రహితమే అవుతుంది. ఈ పోటీ భిన్న భిన్న వృత్తుల్లో భిన్న భిన్న లాభాల రేట్లను సమాన మొనర్చే మాటా, లేక వాటిని ఒక సగటు స్థాయికి తగ్గించే మాటా నిజమే, కాని, ఆ స్థాయిని గాని, లేక లాభపు సాధారణ రేటును గాని అదెన్నడూ నిర్ణయించజాలదు.

సరుకుల ధరలు వేతనాలచేత నిర్ణయింపబడుతాయనడంలో మన ఉద్దేశం ఏమిటి? వేతనమన్నది కేవలం శ్రమయొక్క ధరకు ఒక పేరు మాత్రమే కనుక, సరుకుల ధరలు శ్రమ ధరచేత నియంత్రితమవుతాయని మన ఉద్దేశం ''ధర'' అనేది మారకపు విలువ కనుక, — మరి విలువను గురించి నేను మాట్లాడేటప్పుడెప్పుడూ మారకపు విలువను గురించే చెప్తాను — అది డబ్బులో వ్యక్తీకరింపబడే మారకపు విలువ కనుక, ఈ సూత్రీకరణకు అర్థం యిదీ: ''సరుకుల విలువ, శ్రమ విలువచే నిర్ణయింపబడుతుంది,'' లేక ''శ్రమ విలువే విలువయొక్క సాధారణ కొలమానం.''

కాని అప్పుడు, అసలు ''శ్రమ విలువ'' ఏవిధంగా నిర్ణయింపబడుతుంది? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఇక్కడికొచ్చేసరికి మన మార్గానికి అవరోధం ఏర్పడుతుంది. మనం హేతు బద్ధంగా యీ సమస్యను గురించి ఆలోచించ ప్రయత్నించినప్పుడే ననుకోండి, మనకు అవ రోధం ఏర్పడుతుంది. అయితే ఆ సిద్ధాంత ప్రతిపాదకులు హేతుబద్ధతను అంతగా పట్టించు కోరు. ఉదాహరణకు మన మిత్రుడు వెస్టన్‌నే తీసుకోండి. మొట్టమొదట ఆయన మనకి సరుకుల ధరలను వేతనాలు నిర్ణయిస్తాయనీ, తత్పర్యవసానంగా వేతనాలు పెరిగినప్పుడు ధరలు తప్పనిసరిగా పెరుగుతాయనీ చెప్పాడు. దాని తర్వాత, తద్భిన్నంగా, వేతనాల పెరు గుదలవల్ల ప్రయోజనమేమీ ఉండదనీ, ఎందుకంటే యీ పెరుగుదలతోబాటుగా సరుకుల ధరలు కూడా పెరుగుతాయనీ, వేతనాలు ఏ సరుకుల కోసమైతే ఖర్చు పెట్టబడుతాయో ఆ సరుకుల ధర ద్వారా కొలవబడతాయనీ మనకు అతడు చూపనారంభించాడు. ఈవిధంగా మనం శ్రమ విలువ సరుకు విలువను నిర్ణయిస్తుందన్న చోట ప్రారంభించి, చివరకు సరుకు విలువ శ్రమ విలువను నిర్ణయిస్తుందనే దగ్గరకు చేరుకున్నాం. ఈవిధంగా మనమొక విషవలయంలో యిరుక్కొని ఏ నిర్ధారణకూ చేరుకోలేకపోతున్నాం.

మొత్తంమీద ఒక విషయం స్పష్టపడుతోంది. ఒక సరుకు విలువను — అది శ్రమ విలువే కావచ్చు. ధాన్యపు విలువే కావచ్చు, లేక మరే యితర వస్తువు విలువైనా కావచ్చు —

విలువయొక్క సాధారణ కొలమానంగానూ, నియంత్రణ కర్తగానూ చెయ్యడం ద్వారా, మనం చిక్కును కేవలం పక్కకు నెట్టేస్తున్నామంతే, ఎందుకంటే మనం ఒక విలువను మరో విలువ ద్వారా నిర్ణయిస్తున్నాం, కానైతే అసలు విలువనే నిర్ణయించాల్సిన అవసరం మనకి మిగిలే వుంటోంది.

"సరుకుల ధరలను వేతనాలు నిర్ణయిస్తాయి" అన్న పిడివాద సూత్రాన్ని దాని అత్యంత అనిర్దిష్ట పరిభాషలో వ్యక్తీకరించినప్పుడు, "విలువ విలువచేత నిర్ణయింపబడుతుంది" అని తేలుతుంది. మరి యీ పునరుక్తివల్ల నిజానికి తేలేదేమిటంటే విలువను గురించి మనకేమీ తెలియదని మాత్రమే. ఈ పూర్వవాదనను ఆమోదించినప్పుడు, అర్థశాస్త్ర సాధారణ నియమాలను గూర్చిన సకల వాదనలూ కేవలం అర్థరహితమే అవుతాయి. అందుకనే, 1817లో ప్రచురితమైన "అర్థశాస్త్ర మూల సూత్రాలు"* అనే తన పుస్తకంలో, "వేతనాలు ధరలను నిర్ణయిస్తాయి" అంటూ బహుళ ప్రచారంలో వున్న, బూజుపట్టిపోయిన, పాత భ్రమాత్మక హేతువిరుద్ధ భావాలను సమూలంగా నిర్మూలించిన రికార్డో అర్థశాస్త్రానికి మహత్తరమైన సేవ చేసినవాడయ్యాడు. ఇది ఎటువంటి భ్రమాత్మక హేతువిరుద్ధ భావమంటే, ఆడం స్మితూ, అంతకుకన్న పూర్వపు ఫ్రెంచి అర్థశాస్త్రజ్ఞులూ యీ భ్రమాత్మక భావాన్ని తమ పరిశోధనలలో నిజంగా శాస్త్రీయమైన భాగాల్లో తిరస్కరించినా కూడా, మరింత స్థూలమూ, అశాస్త్రీయమూ అయిన తమ ప్రకరణాల్లో ఆ భావానికి తిరిగి వారు స్థానం కల్పించారు.

## 6. విలువ, శ్రమ

సిటిజెన్స్, నేనిప్పుడు యీ సమస్యకు అసలైన వివరణను యివ్వవలసిన ఘట్టానికి వచ్చాను. నేనీ పనిని అత్యంత సంతృప్తికరంగా చెయ్యగలనని హామీ యివ్వలేను, ఎందుకంటే, అలా చెయ్యాలంటే అర్థశాస్త్ర రంగమంతటినీ పరామర్శించాల్సివుంటుంది. అందుకని, ఫ్రెంచివారు అనేట్లు కేవలం "effleurer la question," అంటే, ప్రధాన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తాను.

మనం అడగాల్సిన మొట్టమొదటి ప్రశ్న: సరుకు విలువ అంటే ఏమిటి? అదెలా నిర్ణయింపబడుతుంది?

ప్రథమ వీక్షణంలో సరుకు విలువ అన్నదొక సాపేక్ష విషయమనీ, ఆ సరుకును తదితర సరుకులన్నింటితోనూ దానికి గల సంబంధాల దృష్ట్యా పరిశీలిస్తే తప్ప అది నిర్ణయింప

* "Principles of Political Economy." — సం.

బడదనీ తోస్తుంది. నిజానికి విలువను గురించి, ఒక సరుకుయొక్క మారకపు విలువను గురించి చెప్పేటప్పుడు, తదితర సరుకులన్నింటితోనూ అది ఏయే నిష్పత్తి పరిమాణాలలో మారకమవుతుందన్నదే మన ఉద్దేశం. కాని అప్పుడు యీ ప్రశ్న ఉత్పన్నమవుతుంది: సరుకులు పరస్పరం ఏ నిష్పత్తులలో మారకంచెందుతాయో ఆ నిష్పత్తులు ఏ విధంగా నియమితం చెయ్యబడతాయి?

ఈ నిష్పత్తులలో అనంతమైన మార్పులు ఉన్నాయన్న సంగతి అనుభవంద్వారా మనకు తెలుసు. ఉదాహరణకు, గోధుమవంటి ఏదో ఒక సరుకును తీసుకోండి. ఒక క్వార్టరు గోధుమలు వేర్వేరు సరుకులతో దాదాపు అసంఖ్యాకమైన నిష్పత్తులలో మార్పిడిచెందుతాయి. అయినా కూడా, సిల్కు, బంగారం, లేక ఏ యితర సరుకు రూపంలో వ్యక్తమైనా కూడా, వాటి విలువ సదా ఒకే విధంగా ఉంటుంది, అందుకని యీ విలువ వేర్వేరు సరుకులతో యీ వేరువేరు మారకపు రేట్లకు అనివార్యంగా భిన్నమైనది గాను, స్వతంత్రమైనదిగాను ఉండాల్సి వుంటుంది. వేర్వేరు సరుకులతోడి యీ వేర్వేరు సమీకరణాలను, పూర్తిగా భిన్నమైన పద్ధతిలో వ్యక్తంచెయ్యడం సాధ్యమై తీరాల్సివుంది.

అంతేకాకుండా, ఒక క్వార్టరు గోధుమ ఒకానొక నిశ్చిత నిష్పత్తిలో కొంత మొత్తం ఇనుముతో మార్చుకొనవచ్చునని లేక ఒక క్వార్టరు గోధుమ విలువ ఒకానొక ప్రత్యేక పరిమాణపు ఇనుములో వ్యక్తంచెయ్యబడిందని నేను చెప్పినప్పుడు, గోధుమ విలువా, ఇనుపముక్కలో దాని సమాన విలువా—యీ రెండూ మరో మూడో వస్తువుకు—గోధుమగాని, ఇనుముగాని కాని వస్తువుకు—సమానమని నేను చెప్తున్నానన్నమాట; అవి రెండూ ఒకే పరిమాణాన్ని రెండు భిన్న రూపాల్లో వ్యక్తంచేస్తున్నాయని నేను అనుకోవడమే యిందుకు కారణం. అందుకని, గోధుమా, ఇనుమూ—యీ రెండూ, ఒకటి మరొకదానితో పూర్తి స్వతంత్ర రూపంలో, ఏదైతే ఆ రెండింటికీ ఉమ్మడి కొలమానమో, ఆ మూడోవస్తువుకు సమానమయ్యేందుకు యోగ్యం కావలసివుంది.

ఈ అంశాన్ని మరింత స్పష్టంగా విశదీకరించేందుకుగాను రేఖాగణితానికి సంబంధించిన సరళమైన ఒక ఉదాహరణను యిస్తాను. సాధ్యమైన అన్ని ఆకారప్రమాణాల్లోనూ గల త్రిభుజాల వైశాల్యాలను సరిపోల్చేటప్పుడు, లేదా త్రిభుజాలను దీర్ఘచతురస్రాలతో గాని మరేయితర సరళ రేఖావృత్త క్షేత్రాలతో గాని సరిపోల్చేటప్పుడు మనమేం చేస్తాం? ఏ త్రిభుజపు వైశాల్యాన్నైనా, పైకి కనిపించే దానికి పూర్తిగా భిన్నమైన రూపంలోకి మనం దాన్ని కుదిస్తాం. త్రిభుజంయొక్క ఆధార పీఠాన్ని దాని ఎత్తుతో హెచ్చువెయ్యగా వచ్చిన మొత్తాన్ని సగం చేస్తే త్రిభుజవైశాల్యం వస్తుందన్న సంగతి తెలుసుకున్న మనం, అన్నిరకాల త్రిభుజాల, సరళ రేఖావృత క్షేత్రాలవైశాల్యాలనూ సరిపోల్చగలం—వాటన్నింటినీ కొన్ని త్రిభుజాలుగా విభజించగలగడం వల్లనే యిది సాధ్యమైంది.

సరుకుల విలువల విషయంలో కూడా మనం యిటువంటి పరిశీలనా పద్ధతినే అనుసరించాల్సివుంటుంది. మనం వాటన్నింటినీ, వాటన్నింటికీ ఉమ్మడిదైన ఆకారంలోకి కుదించగలగాలి — ఆ సమరూప ఉమ్మడి ఆకారాన్ని అవి ఏ నిష్పత్తులలో తమలో కలిగియున్నాయన్నదాన్నిబట్టి మాత్రమే అప్పుడు వాటిలో తేడాను మనం చూడగలుగుతాం.

సరుకుల మారకపు విలువలు ఆ వస్తువులయొక్క సామాజిక క్రియలు మాత్రమే కనుకనూ, సరుకుల సహజ గుణాలతో వాటికి ఎటువంటి సంబంధమూ లేదు గనుకనూ, మనం మొట్టమొదట వేసుకోవలసిన ప్రశ్న యిదీ: అన్ని సరుకులలోనూ ఉన్న ఉమ్మడి సామాజిక సారాంశం ఏమిటి? అది శ్రమ. ఏ సరుకును ఉత్పత్తిచెయ్యాలన్నా దానిపైన ఒక నిశ్చిత పరిమాణంలో శ్రమను వినియోగించాలి, లేక వ్యయమొనర్చాలి. నేను చెప్పేది వట్టి శ్రమ అనే కాదు, సామాజిక శ్రమ అని. ఒక మనిషి ఎవరైనా నేరుగా తన ఉపయోగార్థం, స్వయంగా తను అనుభవించేందుకోసం ఏ వస్తువునైనా తయారుచేసుకుంటే, అప్పుడది కేవలం ఉత్పాదిత వస్తువు మాత్రమే అవుతుంది కాని, సరుకు **కాదు**. స్వయం పోషక ఉత్పాదకుడుగా సమాజంతో అతనికెలాంటి సంబంధమూ వుండదు. కాని ఒక సరుకును తయారుచెయ్యాలన్నప్పుడు, ఒక మనిషి ఏదో ఒక సామాజిక అవసరాన్ని తీర్చే ఒక వస్తువును తయారుచేస్తేనే **చాలదు** సరికదా, స్వతహాగా అతని శ్రమ సమాజంచేత వ్యయమొనర్చబడే శ్రమమొత్తంలో ఒక అంతర్భాగం అయివుండాలి. అది తప్పనిసరిగా సమాజంలోని శ్రమ విభజనకు లోబడివుండాలి. తదితర శ్రమ విభజనలు లేనినాడు దానికి అస్తిత్వం లేదు, మరి దానిమటుకు అది వాటిని సమైక్యం చెయ్యాలి.

సరుకులను విలువలుగా పరిగణించినట్లయితే, మనం వాటిని కేవలం ఫలదీకృతమైన, స్థిరీకృతమైన, లేక వేరేమాటల్లో చెప్పాలంటే మూర్తీభవించిన సామాజిక శ్రమ అనే ఒకేఒక పార్శ్వంలో చూడగలుగుతాం. ఈ దృష్టికోణంనుంచి వాటి మధ్య తేడా కేవలం శ్రమయొక్క ఎక్కువ తక్కువ ప్రమాణాలపైన మాత్రమే ఆధారపడివుంటుంది. ఉదాహరణకు, ఒక ఇటుకలోకన్న ఒక సిల్కు జేబురుమాలులో శ్రమపరిమాణం అధికంగా వినియోగింపబడవచ్చు. కాని ఎవరైనా శ్రమ పరిమాణాలను ఎలా కొలుస్తారు? కాలాన్ని అనుసరించి, శ్రమ ఎంతకాలం సాగింది అన్నదాన్నిబట్టి — అంటే ఎన్ని గంటలు, రోజులు మొదలైనవాటి లెక్కను బట్టి. ఈ కొలమానాన్ని ఉపయోగించడానికిగాను అన్నిరకాల శ్రమనూ నాటి కొలమానంగా, సగటు, లేక సరళ శ్రమగా కుదించాల్సివుంటుంది.

అందుకని, మనం యీకింది నిర్ణయానికి వస్తాము: ప్రతి ఒక సరుకూ, మూర్తీభవించిన సామాజిక శ్రమ కనుక, దానికి ఒక విలువ వుంటుంది. దాని విలువయొక్క, దాని సాపేక్ష విలువయొక్క పరిమాణం దానిలో యిమిడివున్న సామాజిక సారాంశపు ఎక్కువ,

లేక తక్కువ పరిమాణంపైన, అంటే, దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమయొక్క సాపేక్ష రాశిపైన ఆధారపడివుంటుంది. అందుచేత, సరుకులయొక్క సాపేక్ష విలువలు ఆ సరుకులలో వినియుక్తమైన, ఫలదీకృతమైన, స్థిరీకృతమైన శ్రమ పరిమాణాన్నిబట్టి, లేక శ్రమయొక్క ఆయా పరిమాణాలనుబట్టి నిర్ణయించబడతాయి. ఒకే శ్రమకాలంలో ఉత్పత్తిచేయబడే సరుకుల పరస్పర సంబంధిత పరిమాణాలు సమానం అవుతాయి. లేక వేరేమాటల్లో చెప్పాలంటే, ఒక సరుకులో యిమిడివున్న శ్రమకు మరో సరుకులో యిమిడివున్న శ్రమ ఏ నిష్పత్తిలో వుంటుందో, ఒక సరుకు విలువ మరో సరుకు విలువతో సరిగా అదే నిష్పత్తిలో వుంటుంది.

మీలో చాలమంది యీకింది ప్రశ్న అడుగుతారని నేననుకుంటున్నాను: మరి అప్పుడు, సరుకుల విలువలను వేతనాలనుబట్టి నిర్ణయించడానికీ, వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమయొక్క సాపేక్ష పరిమాణాలనుబట్టి నిర్ణయించడానికీ మధ్య నిజంగా విస్తారమైన తేడా, లేదా అసలు తేడా అంటూ ఏమైనా ఉందా? కాని శ్రమకు ముట్టే ప్రతిఫలమూ, శ్రమయొక్క పరిమాణమూ—యీ రెండూ పూర్తిగా భిన్నమైనవని మీకు తప్పక తెలిసి వుంటుంది. ఉదాహరణకు, ఒక క్వార్టరు గోధుమలోనూ, ఒక ఔన్సు బంగారంలోనూ సమాన శ్రమ పరిమాణాలు యిమిడి వున్నాయని అనుకోండి. నేను ఈ ఉదాహరణనే ఎందుకు తీసుకున్నానంటే, బెంజమిన్ ఫ్రాంక్లిన్ "కాగితం డబ్బు స్వభావావశ్యకతలను గురించిన సామాన్య పరిశీలన" పేర 1729లో వెలువడిన తన తొలి రచనలో యీ ఉదాహరణను యిచ్చాడు. ఈ సమస్యను పరిశీలించిన ప్రథములలో ఒకడైన ఫ్రాంక్లిన్, ఆ రచనలో విలువయొక్క వాస్తవ స్వభావాన్ని కనుగొన్నాడు. సరే, మనం ఒక క్వార్టరు గోధుమా, ఒక ఔన్సు బంగారమూ సమానమైన విలువలనీ, లేక సమతుల్యాలనీ ఎందుకనుకుంటున్నాం, అవి కొన్ని దినాలలో, లేక కొన్ని వారాలలో నిక్షిప్తంచెయ్యబడిన, మూర్తీభవించిన సమాన పరిమాణాల సగటు శ్రమ కనుక. బంగారంయొక్క, ధాన్యంయొక్క సాపేక్ష విలువలను నిర్ణయించేటప్పుడు, వ్యవసాయ కార్మికునికీ, గనికార్మికునికీ యిచ్చే వేతనాలను గురించి ఏ విధంగానైనా, ఏమాత్రమైనా మనం ఆలోచిస్తున్నామా? లేశమాత్రం కూడా ఆలోచించడంలేదు. వ్యవసాయ కార్మికునికీ, గనికార్మికునికీ రోజువారీ లేక వారంవారీ శ్రమకుగాను ఎంత వేతనం ముడుతోంది, లేక వేతన శ్రమ అసలు వినియోగింపబడుతున్నదా అన్న విషయాన్ని పూర్తిగా నిర్ణయం చేయకుండా వదిలేస్తున్నాం. ఒకవేళ వేతన శ్రమ వినియోగింపబడివుంటే, వేతనాలు బొత్తిగా అసమానంగా ఉండియుండాలి. ఏ కార్మికుని శ్రమ అయితే క్వార్టరు గోధుమలో నిక్షిప్తంచెయ్యబడిందో అతను కేవలం రెండు బుషెల్సు గోధుమ మాత్రమే వేతనంగా పొందవచ్చు; గనిలో పనిచేసిన కార్మికునికి అర్ధ ఔన్సు బంగారం వేతనంగా ముట్టియుండవచ్చు. లేక, ఒకవేళ వాళ్ల వేతనాలు సమానమనే మనం అనుకుంటే, వాళ్ల వేతనాలు

వారిచేత తయారుచెయ్యబడిన సరుకులయొక్క విలువనుండి భిన్నానేక అనుపాతాలలో ఎక్కువ తక్కువలు కావచ్చు. అవి ఆ క్వార్టరు ధాన్యంయొక్క, లేక ఒక ఔన్సు బంగారంయొక్క సగం, మూడోవంతు, నాలుగోవంతు, అయిదోవంతు, లేక మరే యితర నిష్పత్తిభాగమైనా కావచ్చు. కార్మికుల వేతనాలు, వారు ఉత్పత్తిచేసిన సరుకుల విలువలకన్న సాధ్యమైన అన్ని అనుపాతాలలోనూ తక్కువగా ఉండగలవేగాని, వాటికన్న ఎన్నడూ ఎక్కువగా ఉండజాలవనడం స్పష్టం. వారి వేతనాలు ఉత్పాదితాల విలువలచేత పరిమితంచెయ్యబడతాయే గాని, వారి ఉత్పాదితాల విలువలు వేతనాలచేత పరిమితంచెయ్యబడవు. అన్నిటికన్న ముఖ్య విషయమేమిటంటే, విలువలు – ఉదాహరణకు, ధాన్యంయొక్క, బంగారంయొక్క సాపేక్ష విలువలు – వినియుక్త శ్రమయొక్క విలువతో, అక్షరాలా వేతనంతో ఎంతమాత్రం ప్రసక్తిలేకుండా నిర్ణయింపబడుతున్నాయి. అందుకని, ఆయా సరుకులలో నిక్షిప్తమైవున్న సాపేక్షశ్రమ పరిమాణాలచే నిర్ణయింపబడటమనే పునరుక్తి దోషపూరిత పద్ధతికి పూర్తిగా భిన్నమైనది. మన పరిశీలనలో ఈ అంశం ముందుముందు మరింతగా స్పష్టీకరింపబడుతుంది.

ఏ సరుకుయొక్క మారకపు విలువనైనా లెక్కగట్టేటప్పుడు దాని ఉత్పత్తియొక్క ఆఖరి దశలో వినియుక్తమైన శ్రమపరిమాణానికి, ఆ సరుకును తయారుచెయ్యడానికి ఉపయోగింపబడే ముడివస్తువులో అంతకుముందు వెచ్చింపబడిన శ్రమపరిమాణాన్నీ, అటువంటి శ్రమకు ఏ పరికరాలు, పనిముట్లు, యంత్రాలు, భవనాలద్వారా తోడ్పాటు లభించిందో వాటిపైన వెచ్చింపబడిన శ్రమనూ జోడించాల్సివుంటుంది. ఉదాహరణకు, ఒక నిశ్చిత పరిమాణపు నూలుదారపు విలువలో పత్తిని వడికే క్రమంలో దానికి జోడించబడిన శ్రమపరిమాణం, అంతక్రితమే పత్తిలో యిమిడివున్న శ్రమపరిమాణం, ఉపయోగింపబడిన బొగ్గులో, నూనెలో, తదితర సహాయక పదార్థాలలో యిమిడివున్న శ్రమపరిమాణం, ఆవిరి ఇంజను, కదుళ్ళు, ఫ్యాక్టరీ భవనం, వగైరాలలో యిమిడివున్న శ్రమపరిమాణమూ మూర్తీభావం పొందివున్నాయి. సహేతుకంగానే ఉత్పత్తిసాధనాలని పిలువబడే పనిముట్లు, యంత్రాలు, భవనాలవంటివి ఉత్పత్తి క్రమాలలో ఎక్కువకాలమో, తక్కువకాలమో, మరలమరల ఉపయోగపడతాయి. ముడి పదార్థంలాగే అవి కూడా ఒక్కసారే పూర్తిగా ఉపయోగపడిపోతే, వాటి మొత్తం విలువ అవి ఏ సరుకులను తయారుచెయ్యడానికి తోడ్పడుతాయో ఆ సరుకులకు బదలాయింపబడుతుంది. కాని, ఉదాహరణకు, ఒక కదురు వాడుకక్రమంలో కొంతకాలానికిగాని పూర్తిగా అరిగిపోదు కనుక, అది సగటున ఎంతకాలం మన్నుతుంది, ఒక నిశ్చిత దశలో, మాటవరుసకు ఒకరోజులో దాని సగటు అరుగుదల ఎంత వుంటుందన్నదానిపై ఆధారపడి ఒక సగటు అంచనావెయ్యబడుతుంది. ఈ విధంగా మనం కదురు విలువలో ఎంత రోజుకు వడుకబడే నూలుకు బదలాయింపబడిందో, కాగా, ఉదాహరణకు, ఒక పౌను దారంలో నిక్షిప్తమొనర్చబడిన మొత్తం శ్రమలో అంతకుముందు కదురులో యిమిడివున్న శ్రమపరిమాణం వంతు

ఎంతో లెక్కగడతాం. మన ప్రస్తుత ప్రయోజనానికి సంబంధించినంతవరకు యీ అంశంపై యింతకన్న ఎక్కువ వివరణ అనవసరం.

ఒకానొక సరుకు విలువ దాని ఉత్పత్తి కోసం వ్యయమొనర్చబడిన శ్రమ పరిమాణాన్నిబట్టి నిర్ణయించబడుతుందని చెప్పినప్పుడు మనకు ఒకలా తోస్తుంది: సరుకును తయారుచేసేవాడు ఎంత ఎక్కువ సోమరైతే, ఎంత ఎక్కువ అసమర్థుడైతే అతను తయారుచేసే సరుకు అంత ఎక్కువ విలువైనది కావలసివుంటుంది. ఎందుచేతంటే దాన్ని తయారుచెయ్యడానికి అంత ఎక్కువ శ్రమకాలం పడుతుంది. కాని, యిది చాలా పొరపాటు. "సామాజిక శ్రమ" అని నేను వాడిన పదబంధం మీకు గుర్తుండివుంటుంది, "సామాజిక" అన్న యీ విశేషణంలో అనేక అంశాలు యిమిడివున్నాయి. ఒకానొక సరుకు విలువ దానిపై వ్యయమొనర్చబడిన, లేక దానిలో మూర్తీభావంచెందిన శ్రమ పరిమాణంచేత నిర్ణయించబడుతుందని మనం అంటున్నప్పుడు, సమాజపు ఒక ప్రత్యేక దశలో, ఉత్పత్తికి సంబంధించిన కొన్ని నిర్దిష్ట సామాజిక సగటు పరిస్థితులలో, వినియుక్త శ్రమయొక్క సామాజిక సగటు తీవ్రతతో, సగటు నైపుణ్యంతో ఆ వస్తూత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం అని మన ఉద్దేశం. ఇంగ్లండులో మరమగ్గం చేతిమగ్గంతో పోటీపడినప్పుడు, ఒక నిర్ణీత మొత్తపు దారాన్ని ఒక గజం గుడ్డగా నెయ్యడానికి అంతకుముందు పట్టిన శ్రమకాలంలో సగం మాత్రమే అవసరమైంది. ఇంతకు ముందు రోజుకు తొమ్మిది పది గంటలు మాత్రమే పనిచేస్తూవుండిన చేనేత కార్మికుడు పాపం యిప్పుడు, రోజుకు పదిహేడు పద్దెనిమిది గంటలు పనిచెయ్యాల్సివచ్చింది. అయినా కూడా అతని 20 గంటల శ్రమయొక్క ఉత్పాదితం యిప్పుడు, కేవలం 10 సామాజిక శ్రమ గంటలను, లేక ఒక నిర్దిష్ట ప్రమాణపు దారాన్ని జౌళివస్తువులుగా మార్చడానికి సామాజికంగా అవసరమైన పదిగంటల శ్రమకు మాత్రమే ప్రాతినిధ్యంవహిస్తుంది. అందుచేత, అతనిప్పుడు 20 గంటల్లో చేసిన ఉత్పాదితానికి అంతకుముందు 10 గంటల్లో చేసిన ఉత్పాదితానికి వున్న విలువకన్న ఎక్కువ వుండదు.

అందుకని, సరుకులలో నిక్షిప్తంచెయ్యబడిన సామాజికంగా అవసరమైన శ్రమ పరిమాణం వాటి మారకపు విలువలను నియంత్రితం చేసేమాటయితే, ఒక సరుకును ఉత్పత్తిచెయ్యడానికి అవసరమైన శ్రమపరిమాణంలో ప్రతి తరుగుదలా దాని విలువను తగ్గించినట్లే, ప్రతి పెరుగుదలా దాని విలువను పెంచాల్సివుంటుంది.

ఆయా సరుకుల ఉత్పత్తికోసం అవసరమైన ఆయా శ్రమపరిమాణాలు స్థిరంగా ఉన్నట్లయితే, వాటి సాపేక్ష విలువలు కూడా స్థిరంగానే ఉంటాయి. కాని అలా జరగడం లేదు. ఒకానొక సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమపరిమాణం, వినియోగింపబడిన శ్రమయొక్క ఉత్పాదక శక్తులలో మార్పులతోబాటే నిరంతరాయంగా మారుతూవుంటుంది. శ్రమయొక్క ఉత్పాదక శక్తులు ఎంతగా ఎక్కువైతే ఒక నిర్దిష్ట శ్రమకాలంలో ఉత్పా

దితం అంత ఎక్కువగా తయారవుతుంది: శ్రమయొక్క ఉత్పాదక శక్తులు తగ్గినకొద్దీ, అదే కాలంలో తయారయ్యే ఉత్పాదితం తగ్గుతుంది. ఉదాహరణకు, జనాభా పెరుగుదల కారణంగా తక్కువ సారవంతమైన భూములను సాగుచెయ్యడం అవసరమైనట్లయితే, అదే మొత్తపు పంట అధికతర శ్రమను వినియోగించినప్పుడు మాత్రమే లభ్యమవుతుంది, తత్ఫ ర్యవసానంగా వ్యావసాయిక పంటల విలువ పెరుగుతుంది. మరోవంక, ఒక నేత కార్మికుడు ఒక పనిదినంలో పూర్వం రాట్నంతో వడకగలిగిన పత్తికి, ఆధునిక ఉత్పత్తి సాధనాలతో, యిప్పుడు కొన్ని వేల రెట్లు ఎక్కువ పత్తిని అదే ఒక్క పనిదినంలో నూలుగా మార్చ గలుగుతున్నాడంటే, దీన్నిబట్టి ఒక విషయం స్పష్టపడుతుంది: ప్రతి ఒక్క పౌను పత్తి యిప్పుడు యింతకుముందుకన్న అనేక వేల రెట్లు తక్కువ వడికే శ్రమను గ్రహిస్తోందన్న మాట, మరి తత్ఫర్యవసానంగా వడకడంద్వారా ప్రతి ఒక్క పౌను పత్తికీ జోడించబడుతున్న విలువ యింతకుముందుకన్న అనేక వేల రెట్లు తగ్గుతుందన్నమాట. నూలు విలువ తదనుగుణంగా పడిపోతుంది.

విభిన్న జాతుల ప్రజల సహజసిద్ధమైన శక్తులలోను, ఆర్జిత శ్రమ సామర్థ్యాలలోను వుండే తేడా సంగతిని వదిలేసినట్లయితే, శ్రమయొక్క ఉత్పాదక శక్తులు ప్రధానంగా యీకింది వాటిపై ఆధారపడివుంటాయి:

ఒకటి, భూసారం, గనుల, వగైరాలవంటి శ్రమకు సంబంధించిన సహజ పరిస్థితులపైన;

రెండు, భారీస్థాయి ఉత్పత్తి, పెట్టుబడి కేంద్రీకరణ, శ్రమ సంయోగం, శ్రమ విభజన, యంత్రాలు, ఆధునిక పద్ధతులు, రాసాయనిక, తదితర ప్రాకృతిక సాధనాల వినియోగం, ప్రయాణ రవాణా సౌకర్యాలద్వారా కాల దూరాల కుదింపు, వేటిద్వారానైతే విజ్ఞానశాస్త్రం ప్రకృతిశక్తులను శ్రమకు సేవచేసేటట్లు చేస్తున్నదో, వేటి ద్వారానైతే శ్రమయొక్క సామాజిక, లేక సహకార స్వభావం అభివృద్ధిచెందుతోందో అటువంటి ఆ సకలావిష్కరణలవంటి వాటి మూలంగా శ్రమయొక్క సామాజిక శక్తులలో వచ్చే క్రమా భివృద్ధిపైన. శ్రమయొక్క ఉత్పాదక శక్తులు ఎంత ఎక్కువైతే, ఒక నిర్ణీత పరిమాణపు ఉత్పాదితంలో అంత తక్కువ శ్రమ వెచ్చింపబడుతుంది; కాగా యీ ఉత్పాదితపు విలువ అంతగా తగ్గుతుంది. శ్రమయొక్క ఉత్పాదక శక్తులు ఎంతగా తగ్గితే, అదే మొత్తం ఉత్పా దితంలో అంత ఎక్కువగా శ్రమ వెచ్చింపబడుతుంది; కాగా ఆ ఉత్పాదితపు విలువ అంతగా పెరుగుతుంది. అందుచేత, ఒక సాధారణ నియమంగా మనం దాన్నిలా చెప్పవచ్చు:

సరుకుల విలువలు వాటి ఉత్పత్తిలో వినియుక్తమైన శ్రమ కాలానికి అనులోమ నిష్పత్తిలోనూ, వినియుక్త శ్రమయొక్క ఉత్పాదక శక్తులకు విలోమ నిష్పత్తిలోనూ వుంటాయి.

ఇంతదాకా నేను విలువను గురించి మాత్రమే చెప్పాను, యిప్పుడిక నేను, ధరను గురించి నాలుగుమాటలు చెప్తాను. ధర అనేది విలువయొక్క ఒక విశిష్ట రూపం.

ధర దానికదిగా, డబ్బు రూపంలో విలువయొక్క వ్యక్తీకరణ తప్ప మరేమీ కాదు. ఉదాహరణకు, తదితర యూరపియన్ దేశాలలో అన్ని సరుకుల విలువలూ ప్రధానంగా వెండి ధరల్లో వ్యక్తంచెయ్యబడుతూండగా, ఇంగ్లండులో వాటి విలువలు బంగారపు ధరల్లో వ్యక్తం చెయ్యబడుతున్నాయి. బంగారం, లేక వెండి విలువ కూడా, తదితర అన్ని సరుకుల విలువ మాదిరిగానే వాటిని పొందడానికి అవసరమైన శ్రమపరిమాణాన్నిబట్టి నియంత్రితమవుతుంది. మీరు ఒక నిర్ణీత మొత్తంలో మీ జాతీయ శ్రమ మూర్తీభవించి వున్న మీ జాతీయ ఉత్పాదితాలలో కొంత మొత్తాన్ని, ఒక నిర్ణీత మొత్తంలో వాటి శ్రమ మూర్తీభవించి వున్న బంగారాన్నీ, వెండినీ ఉత్పత్తిచేసే దేశాల ఉత్పాదితంతో మారకంచేసుకుంటారు. ఈ విధంగా, అంటే నిజానికి వస్తుమార్పిడిద్వారానే, జనం అన్ని సరుకుల విలువలనూ, అంటే, వాటిలో నిక్షిప్తమైన శ్రమ పరిమాణాలను, వెండి బంగారాల్లో వ్యక్తంచెయ్యడం నేర్చుకుంటారు. డబ్బు రూపంలో విలువయొక్క వ్యక్తీకరణను, లేక విలువ ధరలోకి మారడాన్ని — రెండూ ఒకటే — మరింత సన్నిహితంగా పరిశీలించినట్లయితే, యిది అన్ని సరుకులయొక్క విలువలకూ స్వతంత్రమైన, ఒకేరకమైన రూపాన్ని యిచ్చే ప్రక్రియ అనీ, లేక వాటిని సమానమైన సామాజిక శ్రమ పరిమాణాల్లో వ్యక్తీకరించే ప్రక్రియ అనీ మీరు గ్రహిస్తారు. ధర కేవలం డబ్బు రూపంలో విలువయొక్క వ్యక్తీకరణ మాత్రమే కనుక, ధరను ఆడం స్మిత్ సహజ ధర అనీ, ఫ్రెంచి ఫిజియోక్రాట్లు[21] "అవసర ధర" అనీ పిలిచారు.

మరైతే, విలువకూ — మార్కెట్ ధరలకూ, లేక సహజ ధరలకూ — మార్కెట్ ధరలకూ మధ్యగల సంబంధం ఏమిటి? ఒకే రకమైన అన్ని సరుకుల మార్కెట్ ధరా — వేర్వేరు ఉత్పత్తిదారుల ఉత్పత్తి పరిస్థితులలో వైవిధ్యం వున్నా కూడా — ఒకటిగానే వుంటుందన్న సంగతి మీ అందరికీ తెలిసిందే. సగటు ఉత్పత్తి పరిస్థితులలో, ఒకానొక నిర్దిష్ట వస్తువును ఒకానొక నిర్దిష్ట మొత్తంలో మార్కెట్టుకి సరఫరా చేసేందుకు అవసరమైన సామాజిక శ్రమయొక్క సగటు మొత్తాన్ని మాత్రమే మార్కెట్ ధర వ్యక్తంచేస్తుంది. దాన్ని ఒకే రకమైన సరుకు మొత్తమంతటిపైనా లెక్కగడతారు. ఈ హద్దువరకు ఒకానొక సరుకుయొక్క మార్కెట్ ధర దాని విలువతో సమమౌతుంది. మరోవంక మార్కెట్ ధరల ఎగుడుదిగుళ్ళు, విలువకూ, లేక సహజ ధరకూ ఒకమారు పైకి పెరగడం, మరొకమారు కిందకి పడిపోవడం అన్నది సరఫరా గిరాకీల హెచ్చుతగ్గులపై ఆధారపడివుంటుంది. విలువల నుండి మార్కెట్ ధరలు బెసుకుతూ వుండటమన్నది నిరంతరాయంగా జరుగుతూనే వుంటుంది, కాని ఆడం స్మిత్ అన్నట్టు:

"సహజ ధర దేని దిశగానైతే సమస్త సరుకుల ధరలూ సదా మొగ్గుతూ వుంటాయో, ఆ కేంద్రీయ ధర. రకరకాల ఆకస్మిక సంఘటనలు దానినుండి వాటిని ఒక్కొక్కప్పుడు చాల ఎక్కువ స్థాయిలోనూ, ఒక్కొక్కప్పుడు దాని కన్న కొంచెం తక్కువ స్థాయిలోనూ కూడా నిలిపివుంచడం సంభవం. కాని, ధరలు స్థాయిత్వ నిరంతరాయత్వాలయొక్క యీ కేంద్రంలో కుదురుగా ఉండకుండా చేసే ఆటంకాలు ఏవైనప్పటికీ, అవి కేంద్రం దిశగానే సదా మొగ్గుతూవుంటాయి."[22]

నేనిప్పుడీ అంశాన్ని యింతకన్న లోతుగా పరిశీలించలేను. సరఫరా గిరాకీలు ఒకదాన్ని మరొకటి సమతులితం చేసుకున్నట్లయితే, సరుకుల మార్కెట్ ధరలు వాటి సహజ ధరలతో, అంటే, వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణాలచేత నిర్ణయింపబడిన రీతిలో వాటి విలువలతో పొందిక కలిగివుంటాయి. కాని సరఫరా గిరాకీలు అనివార్యంగా ఒకటి మరొకదాన్ని నిరంతరాయంగా సమతులితం చేసుకుంటూ సాగాల్సిందే. అయితే ఒక పరివర్తన ప్రభావంతో మరొక పరివర్తనను, పెరుగుదలను తరుగుదలచేత, తరుగుదలను పెరుగుదలచేతా సరిపుచ్చుకోవడం ద్వారా మాత్రమే యిది జరుగుతుంది. మార్కెట్ ధరలయొక్క రోజువారీ ఎగుడుదిగుళ్లను పరిగణనలోకి తీసుకునేందుకు బదులు, ఉదాహరణకు మిస్టర్ టూక్ తన "ధరల చరిత్ర"లో చేసినట్లు, దీర్ఘకాల దశల్లో మార్కెట్ ధరల ఆటుపోట్లూ, విలువలనుండి వాటి చలనాలూ, వాటి ఎగుడుదిగుళ్లూ ఒకదాన్ని మరొకటి పరిహరించి, సమతులితం చేస్తూవుండటాన్ని మీరు చూస్తారు. అందుకని, గుత్తసంస్థలయొక్క, వాటి రూపభేదాలు మరికొన్నింటియొక్క ప్రభావంతో నిమిత్తం లేకుండా దాన్నిగూర్చిన చర్చ యిక్కడ సాధ్యంకాదు కనుక ప్రస్తుతానికి దాన్ని వదలిపెట్టితే — అన్నిరకాల సరుకులూ, సగటున, తమతమ విలువలకు, లేక సహజ ధరలకు అమ్మబడుతాయి. మార్కెట్ ధరల యొక్క ఆటుపోట్లు ఒకటి మరొకదాన్ని సమతులితం చేసుకొనే సగటు కాలవ్యవధులు వేర్వేరు రకాల సరుకుల విషయంలో వేర్వేరు విధంగా వుంటాయి, ఒకరకం సరుకు విషయంలో సరఫరా గిరాకీలు సరిపుచ్చుకోవడం తేలికైనంతగా మరొక సరుకు విషయంలో తేలిక కాక పోవడమే యిందుకు కారణం.

అప్పుడు, స్థూలంగా చెప్పుకుంటే, కొంత దీర్ఘకాల వ్యవధులలో అన్ని రకాల సరుకులూ తమతమ విలువలకు అమ్ముడయ్యేమాటైతే, లాభం, విడివిడి వ్యక్తుల లాభంకాక, విభిన్న పరిశ్రమలయొక్క స్థిర, సామాన్య లాభాలు సరుకుల ధరలను పెంచినందువల్ల, లేక వాటిని వాటి విలువకన్న అధిక ధరకు అమ్మినందువల్ల వస్తుందనుకోవడం అర్థరహితమే అవుతుంది. ఈ అభిప్రాయాన్ని సాధారణీకరించి చూసినట్లయితే దీనిలోని అసంగతత్వం స్పష్ట

మవుతుంది. అమ్మకందారుగా ఒక మనిషి నికరంగా ఏ లాభాన్నయితే పొందుతాడో, కొను గోలుదారుగా అతను అంతే నికరంగా నష్టాన్ని పొందుతాడు. చాలమంది అమ్మకందారులు కాకుండానే కొనుగోలుదారులుగా ఉంటారనీ, లేక ఉత్పత్తిదారులు కాకుండానే వినిమయ దారులుగా ఉంటారనీ చెప్పినందువల్ల ప్రయోజనం లేదు. అటువంటివారు ఉత్పత్తిదారులకు ఏ ధర అయితే చెల్లిస్తారో, దాన్ని ఉత్పత్తిదారులనుండి వారు ముందే ఉచితంగా పొందాల్సి వుంటుంది. ఎవరైనా ఒక మనిషి ముందుగా మీ దగ్గర్నుంచి డబ్బు తీసుకొని, తర్వాత మీనుండి సరుకులను కొని అదే డబ్బును మీకు తిరిగి యిచ్చినట్లయితే, అదే మనిషికి అధిక ధరకు మీ సరుకులను అమ్మి మీరెన్నడూ ధనవంతులు కాజాలరు. ఇటువంటి బేరం నష్టాన్ని తగ్గించవచ్చునేగాని, లాభాన్ని ఆర్జించడానికి మటుకు ఎన్నడూ తోడ్పడదు.

అందుచేత, లాభాల సాధారణ స్వభావాన్ని వివరించడానికి, సగటున, సరుకులు తమ అసలు విలువకు అమ్ముడవుతాయనీ, వాటిని వాటి విలువకు అంటే, వాటిలో నిక్షిప్తమైన ర్చబడిన శ్రమపరిమాణపు అనుపాతంలో అమ్మడం ద్వారా లాభం వస్తుంది అన్న సిద్ధాంతం నుండి బయల్దేరాల్సివుంటుంది. మీరీ ప్రాతిపదికపై లాభ సమస్యను వివరించలేకపోయి నట్లయితే, మీరు దాన్ని అసలు వివరించనేలేరు. నిత్యజీవితానుభవాన్ని బట్టి యిది విరోధా భాసమైన అసంగత విషయంగా కనిపిస్తుంది. కాని భూమి సూర్యుని చుట్టూ తిరగడం, భగ్గునమండే రెండు వాయువుల కలయికద్వారా నీరు ఏర్పడటం కూడా విరోధాభాసమైన విషయాలే. నిత్య జీవితానుభవరీత్యా విజ్ఞానశాస్త్రీయ సత్యాలను పరిశీలిస్తే — నిత్య జీవితానుభవమెప్పుడూ వస్తువులయొక్క భ్రమాత్మక బాహ్యాకృతులనే చూస్తుంది కనుక — అవి ఎల్లప్పుడూ విరోధాభాసగానే కానవస్తాయి.

## 7. శ్రమశక్తి

విలువయొక్క, ఏదైనా సరుకుల విలువయొక్క స్వభావాన్ని గురించి — అలా విహంగ దృష్టితో చేసే విశ్లేషణ పద్ధతిలో సాధ్యమైనమేరకు — విశ్లేషించిన మీదట, మనమిప్పుడు శ్రమయొక్క నిర్దిష్ట విలువపైకి మన దృష్టిని మళ్లించడం అవసరం. ఈ విషయంలో కూడా నేను చెప్పే విషయం మీకు విరోధాభాసగా కనిపించి, మిమ్మల్ని విస్మితులనుచేస్తుంది. కార్మికులు ప్రతిరోజూ దేన్నైతే అమ్ముతున్నారో అది వారి 'శ్రమ' అనీ; అందుకని 'శ్రమ'కు 'ధర' వుందనీ, ఒకానొక సరుకు ధర డబ్బురూపంలో దాని విలువయొక్క వ్యక్తీకరణ మాత్రమే గనుక, శ్రమయొక్క విలువ వంటిదొకటి విధిగా ఉండితీరాలనీ మీరందరూ

నిస్సంశయంగా విశ్వసిస్తారు. కానైతే, ఆమాటకున్న సామాన్య అర్థంలో శ్రమయొక్క విలువ అనేదంటూ ఏమీ వుండదు. ప్రతి ఒక సరుకులోనూ మూర్తీభవించిన అవసర శ్రమపరిమాణమే దాని విలువను నిర్ధరిస్తుందన్న సంగతిని మనం యింతకుముందే చూశాం. విలువకు సంబంధించిన యీ భావాన్ని అన్వయించి ఏ విషయాన్నైనా, ఉదాహరణకు, పదిగంటల పనిదినపు విలువను, నిర్ధారణచెయ్యడం ఎలాగ? ఆ రోజులో ఎంత శ్రమ వుంది? పదిగంటల శ్రమ. మరి అలాంటప్పుడు, పదిగంటల పనిదినంయొక్క విలువ పదిగంటల శ్రమకు, లేక, దానిలో యిమిడివున్న శ్రమ పరిమాణానికి సమానమని చెప్పడం, పునరుక్తి దోషంతో కూడినదే కాకుండా, అర్థరహితమైన మాట కూడా అవుతుంది. అయితే, "శ్రమయొక్క విలువ" అన్న పదబంధంయొక్క వాస్తవమైనదే కాని నిగూఢమైన అర్థాన్ని ఎప్పుడైతే ఒకసారి కనుక్కుంటామో అప్పుడు, ఆకాశంలోని నక్షత్రాల వాస్తవగతిని ఒకసారి రూఢిగా అర్థంచేసుకుంటే, పైకి కనిపించే, లేక కేవలం మన జ్ఞానేంద్రియాలకు మాత్రమే అనుభూతమయ్యే వాటి చలనాన్ని ఏవిధంగా మనం వివరించగలుగుతామో అదేమాదిరిగా విలువకు సంబంధించిన అన్వయాన్ని, తర్కవిరుద్ధంగాను, పైకి అసాధ్యంగాను కనిపించే యీ అన్వయాన్ని మనం స్పష్టీకరించగలుగుతాం.

కార్మికుడు అమ్మేది అతని ప్రత్యక్ష శ్రమ కాక, అతని శ్రమశక్తి మాత్రమే, దాన్ని అతను పెట్టుబడిదారుకి తాత్కాలికంగా ఉపయోగించుకొనేందుకోసం సమర్పిస్తున్నాడు. ఇదెంత యదార్థమైన విషయమంటే, ఇంగ్లీషు చట్టాల సంగతైతే నేను చెప్పలేనుగాని, యూరప్‌లోని కొన్ని దేశాలకు చెందిన చట్టాల మేరకు, మనిషి తన శ్రమశక్తిని ఏ కాల వ్యవధిలోగా అమ్ముకోవచ్చునో ఆ గరిష్ఠ కాలవ్యవధి నిర్దిష్టంగా నిర్ణయింపబడింది. అలా కాకుండా కార్మికుడు అనిశ్చితంగా ఎంతకాలమైనా తన శ్రమను అమ్ముకోడానికి అనుమతింపబడితే బానిసత్వం వెన్వెంటనే పునరుద్ధరింపబడినట్లే అవుతుంది. ఉదాహరణకు ఏ కార్మికుడైనా తన యావజ్జీవితకాలానికీ తన శ్రమశక్తిని ఆవిధంగా అమ్ముకున్నట్లయితే, అప్పుడతను తన యజమానికి తక్షణమే యావజ్జీవితకాల బానిస అవుతాడు.

ఇంగ్లండుకి చెందిన తొట్టతొలి అర్థశాస్త్రజ్ఞుల్లో ఒకడూ, అత్యంత అసాధారణ తత్వశాస్త్రజ్ఞుడూ అయిన థామస్ హాబ్స్ తన సహజ ప్రేరణద్వారా "లెవియథాన్" అనే తన గ్రంథంలోనే యీ అంశాన్ని ఆవిష్కరించాడు. అయితే ఆయన తర్వాతివారు దీన్ని గమనించలేదు. హాబ్స్ యిలా అంటాడు:

> "మనిషి విలువ, లేక మూల్యం అంటే, అన్ని యితర వస్తువుల విషయంలో మాదిరిగానే, అతని ధర: అంటే, అతని శక్తిని ఉపయోగించుకొనేందుకు ఎంత అయితే యివ్వబడుతుందో అదన్నమాట."

ఈ ప్రాతిపదికనుంచి బయల్దేరితే, యితర సరుకులన్నింటి విలువను నిర్ణయించగలిగేట్లుగానే, మనం శ్రమయొక్క విలువను నిర్ణయించగలుగుతాం.

కాని అలా చేసేందుకుముందు, మనమొక ప్రశ్నను వేసుకోవలసివుంది: మార్కెట్లో మనమొకవంక, ఎవరివద్దనైతే భూమి, యంత్రాలు, ముడిపదార్థాలు, జీవితావసర వస్తువులు — బీడుగావున్న ఒక్క భూమితప్ప, వీటిలో మిగిలినవన్నీ శ్రమయొక్క ఉత్పాదితాలే — ఉన్నాయో ఆ కొనుగోలుదార్ల బృందాన్నీ, మరోవంక తమవద్ద అమ్ముకోడానికి తమ శ్రమశక్తీ, పనిచేసే చేతులూ, మెదడూ తప్ప మరేమీలేని అమ్మకందార్ల బృందాన్నీ చూస్తున్నాంకదా, యీ విలక్షణ పరిస్థితి ఎలా ఉత్పన్నమైంది? మొదటి బృందానికి రెండవ బృందం తమ జీవనోపాధికోసం అవిరామంగా అమ్ముకొంటూవుండగా, మొదటి బృందం లాభాన్ని ఆర్జించి, తమ సంచులు నింపుకొనేందుకుగాను అవిరామంగా కొనుక్కొంటూ వుండే విచిత్ర పరిస్థితి ఎలా సంభవించింది? ఈ సమస్యను పరిశీలించడమంటే, అర్థశాస్త్రజ్ఞుల పరిభాషలో "ప్రాథమిక లేక ఆదిమ సంచయనం" అన్నదాన్ని, — నిజానికి దీన్ని ఆదిమ అస్తిహరణం అని పిలవడం సముచితంగా వుంటుంది — పరిశీలించడమే అవుతుంది. ఈ ఆదిమ సంచయనం అనబడే దాని అర్థం, శ్రమచేసే మనిషికీ అతని శ్రమసాధనాలకూ మధ్య ఉంటూవుండిన ఆదిమ ఐక్యతా భంగానికి దారితీసిన చారిత్రక క్రమాలే తప్ప మరేమీకాదు. కానైతే, అటువంటి పరిశీలన నా ప్రస్తుతాంశపు పరిధిలో లేదు. శ్రమచేసే మనిషికీ అతని శ్రమసాధనాలకూ మధ్య అటువంటి వేర్పాటు ఎప్పుడైతే ఒకమారు స్థిరపడుతుందో అప్పుడిక, అటువంటి పరిస్థితి నిలదొక్కుకుని, ఉత్పత్తి విధానంలో ఒక నూతన, మౌలిక విప్లవం వచ్చి మరల దాన్ని కూల్చివేసి, ఆదిమ ఐక్యతను ఒక నూతన చారిత్రక రూపంలో పునరుద్ధరించేదాకా, నిరంతరం అధికమవుతూ వుండే స్థాయిలో మరలమరల ఉత్పన్నమవుతూనే వుంటుంది.

అప్పుడు మరి, శ్రమశక్తి విలువ అంటే ఏమిటి?

ఇతర సరుకులన్నిటి విలువ మాదిరిగానే, దాని విలువ, దాని ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ పరిమాణాన్నిబట్టి నిర్ధారితమవుతుంది. ప్రతి మనిషియొక్క శ్రమశక్తీ అతని జీవిత వ్యక్తిత్వంలోనే వుంటుంది. ప్రతి మనిషీ పెరిగేందుకూ, తన జీవితాన్ని నిలబెట్టుకునేందుకూ కొంత నిశ్చితమొత్తంలో జీవితావసరవస్తువులను అనుభవించితీరాలి. కాని, యంత్రం మాదిరిగానే మనిషి కూడా శిథిలమవుతూవుంటాడు, అతని స్థానంలో మరో మనిషిని భర్తీచెయ్యాల్సి వుంటుంది. అతని సొంత పోషణకు అవసరమైన జీవితావసరవస్తురాశితోబాటు, అతని తర్వాత శ్రమమార్కెట్‌లో ఎవరైతే అతని స్థానాన్ని భర్తీచెయ్యగలరో, కార్మికజాతిని కొనసాగించగలరో అటువంటి వారైన అతని సంతానపు — ఒక నిశ్చితమైన పరిమాణంలో — పోషణకు అవసరమైన జీవితావసరవస్తురాశి కూడా అవసరమౌతుంది. అంతేకాకుండా, కార్మికుడు

తన శ్రమశక్తిని వృద్ధిపరచుకొనేందుకూ, ఒక నిర్దిష్ట వృత్తిలో నైపుణ్యాన్ని అలవరచుకొనేందుకూ, విలువల మరో మొత్తాన్ని అతను వెచ్చించాల్సివుంటుంది. ఇక్కడ మనం సగటు శ్రమను — దేని శిక్షణాభివృద్ధులకయ్యే ఖర్చు లెక్కలోకి రాదో దానిని — పరిగణనలోకి తీసుకుంటే మన ప్రయోజనానికి సరిపోతుంది. అయినా కూడా, నేనీ సందర్భంలో, భిన్న గుణాలు కలిగిన శ్రమశక్తులను తయారుచేసేందుకు అయ్యే ఖర్చులు భిన్నంగా ఉంటాయనీ, అదేవిధంగా భిన్నవృత్తుల్లో వినియుక్తమయ్యే శ్రమశక్తులు సైతం భిన్నంగా ఉండి తీరుతాయనీ చెప్పాల్సివుంటుంది. అందుకని, వేతనాల సమానత్వ నినాదం పూర్తిగా పొరపాటు అవగాహనపై ఆధారపడినది, అది ఎన్నడూ సఫలంకాని అవివేకమైన కోర్కె. తర్కాధారాలను ఆమోదించి, పరిణామాలను దాటవెయ్యజూచే కుహనా, తాటాబూటాపు అతివాద జన్యమైనదే యీ నినాదం. శ్రమశక్తియొక్క విలువ, అన్ని యితర సరుకుల విలువ మాదిరిగానే వేతన వ్యవస్థ ప్రాతిపదికపైన నిర్ణయింపబడుతుంది, పోతే, వేర్వేరు రకాల శ్రమశక్తికి వేర్వేరు విలువలున్నాయిగనుక, లేక వాటిని ఉత్పత్తిచెయ్యడంలో వేర్వేరు శ్రమపరిమాణాలు అవసరం గనుక, శ్రమమార్కెట్‌లో వాటికి వేర్వేరు ధరలు విధిగా ఉండితీరాలి. కాగా, వేతన వ్యవస్థ ప్రాతిపదికపైన, సమానమైన, అంతేకాదు, న్యాయోచితమైన ప్రతిఫలం కావాలని గలభాచెయ్యడం సరిగా ఎలాంటిదంటే, బానిసత్వ వ్యవస్థ ప్రాతిపదికపై స్వాతంత్ర్యం కోసం హంగామాచెయ్యడంవంటిది. దేన్నైతే మీరు న్యాయమైనదనీ, లేక నిష్పక్షపాతమైనదనీ అనుకుంటున్నారో, ఆ ప్రశ్నే ఉత్పన్నంకాదు. అసలు ప్రశ్న ఏమిటంటే: ఒకానొక నిర్దిష్ట ఉత్పత్తి విధానంలో అవసరమైనదీ, అనివార్యమైనదీ ఏమిటి?

పైనచెప్పినదాన్నిబట్టి, శ్రమశక్తియొక్క విలువ శ్రమశక్తిని సృష్టించడానికీ, అభివృద్ధి చెయ్యడానికీ, పోషించడానికీ, కొనసాగించడానికీ కావలసిన జీవితావసరాల విలువచేత నిర్ణయించబడుతుందన్న సంగతి స్పష్టపడుతుంది.

## 8. అదనపు విలువ ఉత్పత్తి

ఇప్పుడిక, ఒక శ్రమజీవియొక్క దినసరి జీవితావసర వస్తువుల సగటు మొత్తాన్ని ఉత్పత్తిచేసేందుకు ఆరుగంటల సగటు శ్రమ అవసరమనుకోండి. అంతేకాకుండా, ఆరుగంటల సగటు శ్రమ 3 షిల్లింగులకు సమానమైన బంగారపు పరిమాణంలో ఉందని కూడా అనుకోండి. అప్పుడు 3 షిల్లింగులు ఆ మనిషి శ్రమశక్తియొక్క దినసరి విలువ ధర, లేక డబ్బు రూపంలో దాని వ్యక్తీకరణ అవుతుంది. అతను ప్రతిరోజూ 6 గంటలు పనిచేస్తే, తన దినసరి

జీవితావసరాల సగటు మొత్తాన్ని కొనడానికి సరిపడే విలువను అతను రోజూ ఉత్పత్తిచేస్తాడు, వేరేమాటల్లో, తనను తానొక శ్రమజీవిగా సజీవంగా నిలుపుకోగలుగుతాడు.

కాని మన యీ మనిషి ఒక వేతన కార్మికుడు. అందుకని అతను తన శ్రమశక్తిని ఏదోఒక పెట్టుబడిదారుకు అమ్మకొనితీరాల్సివుంటుంది. అతడు దాన్ని రోజుకి 3 షిల్లింగులకు, లేక వారానికి 18 షిల్లింగులకు అమ్ముకుంటే, అతడు దాన్ని దాని విలువకు అమ్ముకున్నాడన్నమాట. అతనొక నూలువడికే కార్మికుడు అనుకోండి. అతను ప్రతిరోజూ 6 గంటల చొప్పున పనిచేస్తే, అతను 3 షిల్లింగుల విలువను పత్తికి ప్రతిరోజూ కలుపుతాడు. ప్రతి రోజూ అతనిచేత కలుపబడే యీ విలువ, సరిగా అతని వేతనానికి, లేక, అతని శ్రమశక్తియొక్క దినసరి ధరకి సమానంగా వుంటుంది. కాని అలా జరిగే మాటైతే, ఏ రకమైన అదనపు విలువా లేక అదనపు ఉత్పాదితమూ పెట్టుబడిదారు ముల్లెలో పడదు. మరి, ఇక్కడే వస్తుంది అసలు పేచీ.

కార్మికుని శ్రమశక్తిని కొన్నమీదట, దాని విలువను చెల్లించిన మీదట, పెట్టుబడిదారు, ప్రతి యితర కొనుగోలుదారు మాదిరిగానే, కొన్న సరుకును అనుభవించడానికీ, లేక ఉపయోగించుకోవడానికీ హక్కును పొందుతున్నాడు. ఒక యంత్రంచేత పనిచేయించి దాన్ని ఎలాగైతే ఉపయోగించుకొంటున్నాడో, అనుభవిస్తున్నాడో, అదేమాదిరిగా పెట్టుబడిదారు కార్మికునిచేత పనిచేయించుకొని, అతని శ్రమశక్తిని ఉపయోగించుకుంటాడు, లేక అనుభవిస్తాడు. కార్మికుని శ్రమశక్తికి రోజువారీ లేక వారంవారీ విలువను చెల్లించడం ద్వారా, ఆ శ్రమశక్తిని రోజంతా లేక వారమంతా ఉపయోగించుకొనే, లేక దానిచేత పనిచేయించుకొనే హక్కును పెట్టుబడిదారు పొందుతున్నాడు. పనిదినం, లేక పనివారం అన్నదానికి కొన్ని పరిమితులున్నమాట నిజమేననుకోండి, అయితే వాటిని మనం తర్వాత మరింత సూక్ష్మంగా పరిశీలిద్దాం.

ప్రస్తుతానికి మీ దృష్టిని ఒక కీలకాంశంపైకి మరల్చదలుచుకున్నాను.

శ్రమశక్తియొక్క విలువ, దానిని పోషించడానికీ, పునరుత్పత్తిచెయ్యడానికీ అవసరమైన శ్రమపరిమాణంచేత నిర్ణయింపబడుతుంది, కాని, ఆ శ్రమశక్తి ఉపయోగం మాత్రం, కార్మికునియొక్క క్రియాశక్తిచేతా, శారీరకబలంచేతా పరిమితంచెయ్యబడుతుంది. గుర్రానికి అవసరమైన దాణా, అది రౌతును మొయ్యగల కాలమూ ఏ విధంగానైతే భిన్నమైనవో, అదేవిధంగా శ్రమశక్తియొక్క రోజువారీ, లేక వారంవారీ విలువ, ఆ శక్తియొక్క రోజువారీ, లేక వారంవారీ వ్యయంనుండి పూర్తిగా భిన్నమైనది. కార్మికుని శ్రమశక్తియొక్క విలువకు మితిని కల్పించే శ్రమపరిమాణం, అతని శ్రమశక్తి నిర్వహించదగిన శ్రమపరిమాణానికి మితి ఎంతమాత్రమూ కాదు. నూలువడికే మన కార్మికుణ్ణే ఉదాహరణగా తీసుకోండి. తన శ్రమశక్తిని రోజూ పునరుత్పత్తిచేసేందుకుగాను అతను రోజూ మూడు షిల్లింగుల విలువను పునరు

త్పత్తిచెయ్యడం అవసరమనీ, దాన్ని అతను రోజూ ఆరుగంటలు పనిచెయ్యడంద్వారా చేస్తాడనీ మనం యింతకుముందే చూశాం. అయితే, యిది, రోజుకు 10, 12 లేక అంతకన్న ఎక్కువ గంటలు పనిచెయ్యకుండా అతనికి అవరోధం కల్పించదు. కాని నూలువడికే కార్మికుని శ్రమశక్తికి రోజువారీ, లేక వారంవారీ విలువను చెల్లించడంద్వారా ఆ శ్రమశక్తిని మొత్తం రోజుకు, లేక మొత్తం వారానికి వాడుకొనే హక్కును పెట్టుబడిదారు పొందాడు. అందుకని, పెట్టుబడిదారు నూలుకార్మికునిచేత మాటవరుసకు, రోజుకు 12 గంటలు పనిచేయించుకున్నాడనుకోండి. తన వేతనాన్ని, లేక తన శ్రమశక్తి విలువను భర్తీచేసేందుకు అవసరమైన ఆరు గంటలకు మించి అదనంగా నూలుకార్మికుడు మరో 6 గంటలు పనిచెయ్యాల్సివుంటుంది. నేను వాటిని అదనపు శ్రమ గంటలు అంటాను. మరి యీ అదనపు శ్రమే అదనపు విలువలోను, అదనపు ఉత్పాదితంలోను ఫలీభూతమవుతుంది. ఉదాహరణకు మన నూలుకార్మికుడు తన రోజువారీ ఆరుగంటల శ్రమద్వారా పత్తికి 3 షిల్లింగుల విలువను — అతని వేతనానికి సరిగా సరిపడ విలువను కలిపినట్లయితే — అతను 12 గంటలలో 6 షిల్లింగుల విలువను పత్తికి కలుపుతాడు, సరిగా అదే అనుపాతంలో అదనపు నూలును ఉత్పత్తిచేస్తాడు. కార్మికుడు తన శ్రమశక్తిని పెట్టుబడిదారుకు అమ్ముకున్నాడు కనుక, అతనిచేత తయారుచేయబడిన పూర్తి విలువ, లేక ఉత్పాదితం పెట్టుబడిదారుకి — pro tempore* కార్మికుని శ్రమశక్తియొక్క సొంతదారైన పెట్టుబడిదారుకి — చెందుతుంది. అందుచేత 3 షిల్లింగుల బయానా యివ్వడంద్వారా, పెట్టుబడిదారు 6 షిల్లింగుల విలువను పొందుతాడు, 6 గంటల శ్రమ మూర్తీభవించిన విలువను బయానాగా యిచ్చి, దానికి బదులుగా పెట్టుబడిదారు 12 గంటల శ్రమ మూర్తీభవించిన విలువను పొందడమే యిందుకు కారణం. ఇదే క్రియాక్రమాన్ని ప్రతిరోజూ మరలమరల సాగించడం ద్వారా, పెట్టుబడిదారు ప్రతిరోజూ 3 షిల్లింగులు బయానా యిచ్చి 6 షిల్లింగులు తన జేబులో వేసుకుంటాడు. ఆ 6 షిల్లింగుల్లో సగం మళ్ళీ కొత్తగా వేతనం చెల్లించడానికి పోతుంది, మిగిలిన సగమూ అదనపు విలువ రూపంలో మిగిలిపోతుంది, పెట్టుబడిదారు దీనికి సమానమైన విలువనేమీ ఇందుకు బదులుగా చెల్లించడు. పెట్టుబడికీ శ్రమకూ మధ్య యీ రకమైన మార్పిడి పైననే పెట్టుబడిదారీ ఉత్పత్తి, లేక వేతన వ్యవస్థ ఆధారపడివుంది; కార్మికుణ్ణి కార్మికునిగాను, పెట్టుబడిదారుని పెట్టుబడిదారుగాను నిరంతరాయంగా కొనసాగేలా చూడటమే దీని ఫలస్వరూపం.

ఇతర పరిస్థితులన్నీ యథాతథంగా ఉన్నప్పుడు, అదనపు విలువ రేటు — శ్రమశక్తి విలువను పునరుత్పత్తిచేసేందుకోసం అవసరమైన పనిదినంలోని భాగానికీ, పెట్టుబడిదారు ప్రయోజనంకోసం వినియుక్తమైన అదనపు కాలం లేక అదనపు శ్రమకూ మధ్యగల

* తాత్కాలికంగా. — సం.

నిష్పత్తిపైన ఆధారపడివుంటుంది. అందుకని, కార్మికుడు కేవలం తన శ్రమశక్తి విలువను పునరుత్పత్తి చెయ్యడానికి, లేక తన వేతనాన్ని భర్తీచేయడానికి పనిదినంలో ఎన్నిగంటలు పని చేస్తాడో, ఆ కాలవ్యవధికీ దాన్నిమించి అదనంగా పనిదినం ఏ మేరకు పొడిగించబడుతుందో ఆ కాలవ్యవధికీ మధ్యగల నిష్పత్తిపైన అది ఆధారపడివుంటుంది.

# 9. శ్రమ విలువ

మనమిప్పుడు "శ్రమ విలువ, లేక ధర" అనే సమస్యకు తిరిగివెళ్దాం.

వాస్తవానికి అది దేని పోషణకు అవసరమైన జీవితావసర సరుకుల విలువల చేతనైతే కొలవబడుతుందో ఆ శ్రమశక్తి విలువ మాత్రమే అని మనం పైన చూశాం. కాని, కార్మికుడు తన పని పూర్తి అయిన తర్వాతనే వేతనాన్ని పొందుతున్నాడు కనుకను, పైగా, వాస్తవానికి తను పెట్టుబడిదారుకు యిస్తున్నది తన శ్రమనే అన్న సంగతి అతను ఎరుగును కనుకను, అతని శ్రమశక్తి విలువ, లేక ధర అనివార్యంగా అతనికి తన శ్రమ ధరగానే, లేక విలువగానే కనిపిస్తుంది. అతని శ్రమశక్తి ధర ఆరుగంటల శ్రమ యిమిడివున్న 3 షిల్లింగులైతే, అతను 12 గంటలు పనిచేసినా కూడా, యీ 3 షిల్లింగులనే తన 12 గంటల శ్రమయొక్క విలువగా, లేక ధరగా – నిజానికి యీ 12 గంటల శ్రమలో 6 షిల్లింగుల విలువ యిమిడివున్నా కూడా – అనివార్యంగా అతను పరిగణిస్తాడు. దీనివలన రెండు పర్యవసానాలు ఉత్పన్నమవుతున్నాయి.

ఒకటి: కచ్చితంగా చెప్పాలంటే, శ్రమయొక్క విలువ, లేక ధర అన్నవి అర్థరహితమైన మాటలే అయినప్పటికీ, శ్రమశక్తి విలువ, లేక ధర అన్నది శ్రమ ధర, లేక విలువ గానే పైకి కనిపిస్తుంది.

రెండు: కార్మికుని రోజువారీ శ్రమలో ఒక భాగానికి మాత్రమే చెల్లింపు జరిగి, మిగిలిన భాగానికి చెల్లింపు జరగకపోయినప్పటికీ, మరి చెల్లింపబడని, లేక ఆ అదనపు శ్రమనుండే అదనపు విలువ లేక లాభం ఉత్పన్నమవుతున్నప్పటికీ, కార్మికుని శ్రమ అంతా ప్రతిఫలం చెల్లింపబడిన శ్రమగానే కనిపిస్తుంది.

వేతనశ్రమను తదితర చారిత్రక శ్రమరూపాలనుంచి వేరుచేసేది ఈ మిథ్యారూపమే. వేతన వ్యవస్థ ప్రాతిపదికపైన ప్రతిఫలం చెల్లింపబడని శ్రమపైతం ప్రతిఫలం చెల్లింపబడిన శ్రమలాగ కనిపిస్తుంది. బానిస విషయంలో, యిందుకు భిన్నంగా, అతని శ్రమలోని ప్రతిఫలం చెల్లింపబడిన భాగంపైతం ప్రతిఫలం చెల్లింపబడనట్లు కనిపిస్తుంది. పనిచేసేందుకుగాను బానిస బ్రతికి ఉండాలనేమాట, అతని పనిదినంలో ఒక భాగం అతని జీవితపోషణకు అవసర

మైన విలువను సృష్టించడానికి వినియుక్తమవుతుందన్నమాట నిజమే కాని, బానిసకూ, బానిస యజమానికీ మధ్య బేరమేమీ జరగదు గనుక, రెండు పక్షాల మధ్యా క్రయవిక్రయా లంటూ ఏవీ జరగవు గనుక, అతని శ్రమ అంతా పూర్తి ఉచితంగా యిచ్చివేస్తున్నట్లే కనిపిస్తుంది.

మరోవంక, మాటవరుసకు, నిన్నమొన్నటిదాకా తూర్పు యూరప్ అంతట్లోనూ ఉంటూవచ్చిన మాదిరి — భూదాసుని తీసుకోండి. ఈ రైతు ఉదాహరణకు తన పొలం పైన, లేక భూస్వామి తనకు కేటాయించిన పొలంపైన వారంలో మూడు రోజులు తనకోసం పనిచేస్తాడు, దాని తర్వాత మూడు రోజులూ తన యజమాని పొలంపైన తప్పనిసరిగా వెట్టి చాకిరీ చెయ్యాల్సివుంటుంది. ఈవిధంగా యిక్కడ, శ్రమయొక్క ప్రతిఫలం చెల్లింపబడిన, చెల్లింపబడని భాగాలు అర్థవంతంగా విభజింపబడ్డాయి, స్థల కాలాలలో విభజింపబడ్డాయి. మరి అందుకనే ఉదారవాదులైన రాజనీతిజ్ఞులు మనిషిచేత యీవిధంగా వెట్టిచాకిరీ చేయించుకొనే పద్ధతిపట్ల నైతిక ఆక్రోశంతో మండిపడేవారు.

కాని నిజానికి, ఒక మనిషి వారంలో మూడు రోజులు తన సొంత పొలంలో తనం కోసం పనిచేసి, మూడు రోజులు తన భూస్వామి పొలంలో ఉచితంగా పనిచేసినా ఒకటే, లేక కార్ఖానాలో రోజా 6 గంటలు తన కోసమూ, మరో 6 గంటలు తన యజమాని కోసమూ పనిచేసినా ఒక్కటే; అయితే తేడా ఏమిటంటే, కార్ఖానా శ్రమ విషయంలో శ్రమయొక్క ప్రతిఫలం చెల్లింపబడిన, చెల్లింపబడని భాగాలు అవిభాజ్యంగా సమ్మిళితమైపోయాయి, ఈ మొత్తం వ్యవహారపు స్వభావం, ఒప్పందమనేది ఒకటుండటం, వారాంతంలో వేతనం ముట్టడం అన్నవాటిచేత పూర్తిగా మరుగునపడిపోతుంది. ఒక సందర్భంలో ఉచితశ్రమ ఐచ్ఛికంగా చెయ్యబడినట్లు కనిపించగా, రెండవ సందర్భంలో అది అనివార్యంగా చెయ్యబడి నట్లు కనిపిస్తుంది. తేడా అంతా యిదే.

ఇకముందు నేను "శ్రమ విలువ" అనే పదబంధాన్ని వాడినప్పుడల్లా, "శ్రమశక్తి విలువ" అనే దానికి ప్రజల్లో విశేష ప్రాచుర్యంలోవున్న అర్థంలోనే వాడుతాను.

## 10. సరుకును దాని విలువకు అమ్మడంద్వారా లాభం సమకూరుతోంది

6 పెన్నీలకు సమానమైన విలువను సృష్టించడానికి సగటున ఒకగంట శ్రమ, లేక, 6 షిల్లింగుల విలువను సృష్టించడానికి 12 గంటల సగటు శ్రమ పడుతుందనుకోండి. శ్రమ విలువ 3 షిల్లింగులనీ, లేక 6 గంటల శ్రమయొక్క ఉత్పాదితమనీ కూడా అనుకోండి.

మరి అలాంటప్పుడు, ఒక సరుకు ఉత్పత్తిలో వినియుక్తమైన ముడిపదార్థాలు, యంత్రాలు వగైరాలలో 24 గంటల సగటు శ్రమ యిమిడివుంటే, దాని విలువ 12 షిల్లింగులవుతుంది. దీనికితోడు, పెట్టుబడిదారుచేత నియుక్తుడైన కార్మికుడు ఆ ఉత్పత్తి సాధనాలకు 12 గంటల శ్రమను జతచేస్తే, అతని యీ 12 గంటల శ్రమ 6 షిల్లింగుల అదనపు విలువను ఉత్పన్నంచేస్తుంది. అందుచేత, ఆ ఉత్పాదితంయొక్క మొత్తం విలువ 36 గంటల శ్రమ ఫలితమై, 18 షిల్లింగులతో సమానమవుతుంది. కాని ఆ శ్రమయొక్క విలువ, లేక కార్మికునికి చెల్లింపబడే వేతనం, 3 షిల్లింగులు మాత్రమే ఉంటుంది కనుక, కార్మికుడు చేసిన 6 గంటల అదనపు శ్రమకు, దాని ద్వారా సరుకుకు చేరిన విలువకు ప్రతిఫలంగా పెట్టుబడిదారు ఏమీ యివ్వవలసివుండదు. అందుకని ఈ సరుకును పెట్టుబడిదారు దాని విలువ అయిన 18 షిల్లింగులకు అమ్మినట్లయితే, దేనికోసమైతే అతను ఏమీ చెల్లించలేదో, ఆ 3 షిల్లింగుల విలువను కూడా అతను పొందుతాడు. ఈ 3 షిల్లింగులే అదనపు విలువ, లేక లాభం రూపంలో నేరుగా అతని జేబులోకి పోయే మొత్తం. ఈవిధంగా తన సరుకును దాని విలువకు మించి అధిక ధరకు అమ్మడంద్వారా కాక, దాని అసలు విలువకే అమ్మడంద్వారా పెట్టుబడిదారు ఆ 3 షిల్లింగుల లాభాన్ని సంపాదిస్తాడు.

సరుకు విలువ దానిలో యిమిడివున్న మొత్తం శ్రమ పరిమాణంచేత నిర్ణయింపబడుతుంది. కాని ఆ శ్రమ పరిమాణంలో ఒక భాగానికి మాత్రమే వేతనం రూపంలో సమానమైన విలువ చెల్లింపబడింది; మిగిలిన భాగానికి సమానమైన విలువ చెల్లింపబడకుండానే గ్రహింపబడింది. కాగా సరుకులో యిమిడివున్న శ్రమలో కొంతభాగం ప్రతిఫలం చెల్లింపబడిన శ్రమ, మిగిలిన భాగం చెల్లింపబడని శ్రమ. అందుచేత, సరుకును దాని విలువకు, అంటే, సరుకుపై వినియుక్తమైన మొత్తం శ్రమ పరిమాణం రూపంలో దాని విలువకు అమ్మినప్పుడు, పెట్టుబడిదారు దాన్ని తప్పనిసరిగా లాభానికి అమ్మితీరుతాడు. దేనికోసమైతే తను సమానమైన ధరను చెల్లించాడో దాన్నే కాకుండా, తను అసలు ఏ ధరనూ చెల్లించనిదాన్ని కూడా — దేనికోసం కార్మికుడు తన శ్రమను వెచ్చించాడో దాన్ని కూడా — అతను అమ్ముతాడు. సరుకు తయారీకి పెట్టుబడిదారుకి అయ్యే ఖరీదు వేరు, దాని అసలు ఖరీదు వేరు. అందుకనే నేను మరోసారి చెప్తున్నాను, సరుకులను వాటి అసలు విలువలకు మించి అధికంగా అమ్మడంద్వారా కాక, వాటి అసలు విలువలకు అమ్మడంద్వారానే సామాన్యమైన, సగటు లాభాలు సమకూరుతున్నాయి.

# 11. అదనపు విలువలోని వేర్వేరు భాగాలు

అదనపు విలువను, లేక సరుకుయొక్క మొత్తం విలువలోని ఏ భాగంలోనైతే కార్మికుని అదనపు శ్రమ, లేక ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ యిమిడివుందో ఆ భాగాన్ని, నేను లాభం అంటాను. ఈ లాభపు మొత్తమంతా పెట్టుబడిదారు జేబులోకే పోదు. భూమిపై తనకు గల గుత్తాధికారం కారణంగా భూస్వామి కౌలు పేర, ఆ అదనపు విలువలో కొంత భాగాన్ని తీసుకుంటాడు. ఆ భూమి వ్యవసాయంకోసం, భవనాలకోసం, లేక రైల్వేలకోసం ఉపయోగింపబడిందా, లేక ఏ యితర ఉత్పాదక ప్రయోజనార్థమైనా వినియోగింపబడిందా అన్నది అసలు విషయం కాదు. మరోవంక, ఏ శ్రమ సాధనాలను కలిగియుండటం ద్వారానైతే కార్మికులను పనిలో పెట్టుకొనే పెట్టుబడిదారు అదనపు విలువను ఉత్పత్తి చెయ్యగలుగుతున్నాడో, లేక దాన్నే వేరే మాటల్లో చెప్పకుంటే, ప్రతిఫలం చెల్లింపబడని కొంత మొత్తం శ్రమను తన సొంతం చేసుకొనగలుగుతున్నాడో, ఆ శ్రమ సాధనాలను మొత్తంగానో, పాక్షికంగానో పారిశ్రామిక పెట్టుబడిదారుకు అద్దెకిచ్చే యజమాని, ఒక్క మాటలో రుణ దాతయైన పెట్టుబడిదారు వడ్డీరూపంలో ఆ అదనపు విలువలో మరో భాగం తనకు చెందుతుందని చెప్పగలుగుతున్నాడు. పర్యవసానంగా కార్మికులను పనిలో పెట్టుకొనే పెట్టుబడిదారుగా పెట్టుబడిదారుకు మిగిలేదల్లా పారిశ్రామిక లేదా వ్యాపార లాభం మాత్రమే.

ఏ నియమాల ప్రకారం ఆ మూడు రకాల వారి మధ్య యీ అదనపు విలువ పూర్తి మొత్తపు పంపిణీ నియంత్రితమవుతుందన్నది మన పరిశీలనాంశానికి అప్రస్తుతమైనది. కాని, యింతవరకు చెప్పినదాన్నిబట్టి తేలేది యిదీ:

కౌలు, వడ్డీ, పారిశ్రామిక లాభం — యివన్నీ కూడా సరుకుయొక్క అదనపు విలువ, లేక, దానిలో యిమిడివున్న ప్రతిఫలం చెల్లింపబడని శ్రమయొక్క వేర్వేరు భాగాలకు వేర్వేరు పేర్లు మాత్రమే, మరి అవి అన్నీ కూడా యీ మూలాధారంనుంచి, యీ మూలాధారంనుంచి మాత్రమే ఉత్పన్నమవుతున్నాయి. అవి దానికదిగా భూమినుండిగాని, దానికదిగా పెట్టుబడినుండిగాని ఉత్పన్నం కావు. కాని, భూమీ, పెట్టుబడీ తమ యజమానులు పారిశ్రామిక పెట్టుబడిదారుచేత కార్మికునినుండి పిండుకోబడే అదనపు విలువనుండి, తమతమ వాటాలను పొందగలిగేట్టుచేస్తాయి. ఆ కార్మికునికి సంబంధించినంతవరకు, ఆ అదనపు విలువ, తన అదనపు శ్రమయొక్క లేక ప్రతిఫలం చెల్లింపబడని శ్రమయొక్క ఫలితమైన ఆ అదనపు విలువ, తనను పనిలో పెట్టుకున్న పెట్టుబడిదారు జేబులోకే పూర్తిగా పోతుందా, లేక అతను కౌలురూపంలో, లేక వడ్డీరూపంలో దానిలో కొన్ని భాగాలను యితరులకు కూడా యివ్వాల్సివుంటుందా అన్నది అముఖ్య విషయం. పారిశ్రామిక పెట్టుబడిదారు తన

సొంత పెట్టుబడినే ఉపయోగిస్తూ, ఆ భూమికి తానే యజమానై వున్నాడనుకోండి, అప్పుడు అదనపు విలువ అంతా అతని జేబులోకే చేరుతుంది.

అదనపు విలువలో చివరకు ఎంత భాగాన్ని తన సొంతానికి మిగుల్చుకోగలిగినప్పటికీ, కార్మికునినుండి యీ అదనపు విలువను ప్రత్యక్షంగా గుంజేది పారిశ్రామిక పెట్టుబడిదారే. అందుకని, పారిశ్రామిక పెట్టుబడిదారుకీ, వేతన కార్మికునికీ మధ్యగల యీ సంబంధంపైననే మొత్తం వేతన వ్యవస్థ అంతా, మొత్తం ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ అంతా ఆధారపడివుంది. కాబట్టి మన యీ చర్చల్లో పాల్గొన్న కొందరు మిత్రులు, విషయాలను దాటవెయ్యడానికి ప్రయత్నించడం, పారిశ్రామిక పెట్టుబడిదారుకీ, కార్మికునికీ మధ్యగల యీ మౌలిక సంబంధాన్ని ప్రధాన సమస్యగా పరిగణించకపోవడం పొరపాటు. అయితే, కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో, ధరల పెరుగుదల పారిశ్రామిక పెట్టుబడిదారునూ, భూస్వామినీ, రుణదాతయైన పెట్టుబడిదారునూ, — ఒకవేళ మీరు కలపాలని కోరుకుంటే — పన్నుల వసూలుదారునూ తరతమ స్థాయిలలో దెబ్బతియ్యవచ్చు.

ఇప్పుడు చెప్పినదాన్నుంచి మరో పర్యవసానం ఉత్పన్నమవుతుంది.

సరుకు విలువలోని ఏ భాగమైతే ముడిపదార్థాల, యంత్రాల, ఒక్కమాటలో వినియుక్తమైన ఉత్పత్తి సాధనాల విలువకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందో ఆ భాగం ఏ రకమైన ఆదాయాన్నీ ఉత్పన్నంచెయ్యదు, అది కేవలం పెట్టుబడి ధనాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది. అంతేగాని, ఆదాయాన్ని ఉత్పన్నంచేసే సరుకు విలువలోని రెండవ భాగం, లేక వేతనాలు, లాభాలు, కౌలు, వడ్డీల రూపంలో వెచ్చింపబడగల భాగం, వేతనాల విలువ, కౌలు విలువ, లాభాల విలువ, వగైరా విలువలతో ఏర్పడుతుందని అనుకోవడం పొరపాటు. మనం మొదట, వేతనాల విషయం వదిలిపెట్టి, కేవలం పారిశ్రామిక లాభాలు, వడ్డీ, కౌళ్ల విషయాన్ని పరిశీలిద్దాం. సరుకులో యిమిడివున్న అదనపు విలువ, లేక సరుకు విలువలోని ఏ భాగంలోనైతే ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ యిమిడివుందో ఆ భాగం, మూడు వేర్వేరు పేర్లుగల, మూడు వేర్వేరు భాగాలుగా విడివడుతుందని మనం యిప్పుడే చూశాం. కాని, సరుకు యొక్క యీ భాగపు విలువ యీ మూడు సంఘటక భాగాలయొక్క స్వతంత్ర విలువలతో కూడివుందనిగాని, లేక వాటిని కలపడం ద్వారా రూపొందుతుందనిగాని చెప్పడం పూర్తిగా పొరపాటవుతుంది.

ఒక గంట శ్రమ 6 పెన్నీల విలువను సృష్టించినట్లయితే, కార్మికుని పనిదినం 12 గంటలై, యిందులో సగం కాలం ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ అయినప్పుడు, ఆ అదనపు శ్రమ సరుకుకు 3 షిల్లింగుల అదనపు విలువను అంటే, దేనికైతే సమతుల్యమైన ప్రతిఫలం చెల్లింపబడలేదో, ఆ అదనపు విలువను జతచేస్తుంది. ఈ 3 షిల్లింగుల అదనపు విలువే పారిశ్రామిక పెట్టుబడిదారు ఏ అనుపాతాలలోనైతేనేమి భూస్వామితోను, రుణదాత పెట్టు

బడిదారులోను పంచుకొనగలిగే మొత్తం నిధి. వారు తమలో తాము పంచుకోవలసిన విలువ యొక్క మితి, యీ 3 షిల్లింగుల విలువే. కాని సరుకు విలువకు తన లాభం రూపంలో తన చిత్తంవచ్చిన విలువను జతచేసేది, కార్మికులను పనిలోపెట్టుకొనే పెట్టుబడిదారు కాదు, దానికి భూస్వామికోసం మరికొంత విలువ చేరడం, యిత్యాది జరగదు; కాగా, చిత్తం వచ్చిన రీతిలో నిర్ణయింపబడిన యీ విలువల కలయికతో మొత్తం విలువ ఏర్పడదు. అందుకని, ఒక నిర్ణీతమైన విలువ మూడు భాగాలుగా విడివడుతుందనే భావానికి బదులుగా, మూడు స్వతంత్ర విలువలను కలపడంద్వారా ఆ విలువ ఏర్పడుతుందనీ, ఏ మొత్తం విలువనుంచి అయితే కౌలు, లాభం, వడ్డీ ఉత్పన్నమవుతాయో ఆ మొత్తాన్ని చిత్తంవచ్చిన పరిమాణంలో నిర్ణయించే మొత్తంగా గజిబిజిచేసే సామాన్య జనాభిప్రాయం ఎంత పొరపాటో మీరు చూడగలరు.

ఒక పెట్టుబడిదారు పొందిన మొత్తం లాభం 100 పౌనులకు సమానమైతే, మనమీ మొత్తాన్ని నిరపేక్ష పరిమాణ రూపంలో లాభం మొత్తం అంటాం. కాని మనం యీ 100 పౌనులకూ మదుపు పెట్టబడిన పెట్టుబడితో గల నిష్పత్తిని లెక్కగట్టినట్లయితే, మనం యీ సాపేక్ష పరిమాణాన్ని లాభపు రేటు అంటాం. ఈ లాభపు రేటును రెండు విధాలుగా వ్యక్తంచెయ్యవచ్చునన్న సంగతి స్పష్టం.

వేతనాల రూపంలో మదుపుపెట్టబడిన పెట్టుబడి 100 పౌనులు అనుకోండి. సృష్టింపబడిన అదనపు విలువ కూడా 100 పౌనులే అయితే — దీన్నిబట్టి మనకి కార్మికుడు తన పనిదినంలో సగంకాలం ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ చేస్తున్నట్లు అవగతమవుతుంది — యీ లాభాన్ని మనం వేతనాల రూపంలో మదుపు పెట్టబడిన పెట్టుబడి విలువ ప్రకారం లెక్కగడితే, — మదుపుపెట్టబడిన విలువ 100, రాబట్టుకున్న విలువ 200 కనుక — లాభపు రేటు 100 శాతం అని చెప్పాల్సివుంటుంది.

మరోవంక, మనం వేతనాలకోసం మదుపుపెట్టబడిన పెట్టుబడినే కాకుండా మదుపు పెట్టబడిన మొత్తం పెట్టుబడిని, అంటే, ఉదాహరణకు, 500 పౌనులను — దీనిలో 400 పౌనులు ముడిపదార్థాలు, యంత్రాలు, మొదలైనవాటి విలువ అయినట్లయితే — తీసుకుంటే 100 పౌనుల లాభం మదుపుపెట్టబడిన మొత్తం పెట్టుబడిలో అయిదో వంతు మాత్రమే వుంటుంది కనుక, లాభపు రేటు 20 శాతం మాత్రమే అవుతుంది.

లాభపు రేటును వ్యక్తంచేసే మొదటి పద్ధతి మాత్రమే ప్రతిఫలం చెల్లింపబడిన శ్రమకూ, చెల్లింపబడని శ్రమకూ మధ్య అసలైన నిష్పత్తిని, శ్రమ exploitation* (ఈ ఫ్రెంచి మాటను ఉపయోగించడానికి మీరు నన్ను అనుమతించాలి)యొక్క అసలైన

* దోపిడి. — సం.

స్థాయిని తెలియజేసే పద్ధతి. రెండవ వ్యక్తీకరణ పద్ధతి సామాన్యోపయోగంలో వుంది, వాస్తవానికి అది కొన్ని సందర్భాలకు తగినది కూడా. ఏదేమైనా కూడా, కార్మికునినుంచి పెట్టుబడిదారు గుంజే ఉచిత శ్రమయొక్క స్థాయిని మరుగుపరచేందుకు మాత్రం అది మిక్కిలి ఉపయోగకరమైన పద్ధతి.

ఇకముందు నేను చేసే వ్యాఖ్యలలో అదనపు విలువ వేర్వేరు వ్యక్తుల మధ్య ఏ విధంగా విభజితమైందన్న దానితో ప్రసక్తిలేకుండా, పెట్టుబడిదారుచేత గుంజుకోబడిన యావత్తు మొత్తపు అదనపు విలువకూ లాభం అన్న పదాన్ని వాడుతాను; మరి లాభపు రేటు అన్న పదాన్ని వాడినప్పుడెప్పుడూ వేతనాలకోసం మదుపుపెట్టబడే పెట్టుబడితోనే నేను లాభాలను కొలుస్తాను.

# 12. లాభాలు, వేతనాలు, ధరల మధ్య సాధారణ సంబంధం

ఒక సరుకు విలువనుండి ఆ సరుకుపై ఖర్చుపెట్టబడిన ముడిపదార్థాలు, తదితర ఉత్పత్తి సాధనాల కోసం అయ్యే విలువను అంటే, దానిలో యిమిడివున్న గత శ్రమకు సరైన విలువను తీసెయ్యండి. అప్పుడిక సరుకు విలువలోని మిగిలిన భాగం, చిట్టచివర పనిచేసిన కార్మికుడు సరుకుకు చేర్చిన శ్రమ మొత్తపు విలువగా తేలుతుంది. ఆ కార్మికుడు ప్రతిరోజూ 12 గంటలు పనిచేస్తే, 12 గంటల సగటు శ్రమ 6 షిల్లింగులకు సమానమైన బంగారపు మొత్తం రూపంలో ఫలవంతమైతే, అదనంగా చేర్చబడిన యీ 6 షిల్లింగుల విలువ మాత్రమే అతని శ్రమ ఉత్పన్నంచేసిన విలువ అవుతుంది. అతని శ్రమకాలంచేత నిర్ణయింపబడిన యీ నిర్దిష్ట విలువ అనే ఏకైక నిధినుండి మాత్రమే అతనూ, పెట్టుబడిదారూ యిద్దరూ కూడా తమతమ వాటాలను, లేక లాభాంశాలను పొందాల్సివుంటుంది. వేతనాలుగాను, లాభాలుగాను పంచుకోవలసిన విలువ యిదే. ఈ రెండు పక్షాలూ దాన్ని ఎన్ని వేర్వేరు అనుపాతాల్లో పంచుకున్నా కూడా యీ విలువలో మాత్రం ఎటువంటి మార్పూ ఉండదనడం స్పష్టం. ఒకేఒక కార్మికుని స్థానంలో కార్మికజనాన్నందరినీ పెట్టినా, ఒక పనిదినానికి బదులు, ఉదాహరణకు ఒక కోటీ, ఇరవై లక్షల పనిదినాలు పెట్టినా మార్పేమీ ఉండదు.

పెట్టుబడిదారూ, కార్మికుడూ యీ పరిమిత విలువను మాత్రమే, అంటే, కార్మికుని మొత్తం శ్రమ మేరకు లెక్కింపబడే యీ పరిమిత విలువను మాత్రమే పంచుకోవలసివున్నది కనుక, వారిలో ఒకనికి ఎక్కువ వస్తే రెండవ వానికి ఆ మేరకు తక్కువ వస్తుంది, ఒకనికి తక్కువవస్తే రెండవవానికి ఆ మేరకు ఎక్కువ వస్తుంది. ఎప్పుడైనాసరే ఒక

నిర్దిష్టమైన మొత్తం యివ్వబడినప్పుడు, దానిలో ఒక భాగం ఏమేరకు తగ్గితే రెండవభాగం ఆమేరకు పెరుగుతుంది. వేతనాలలో మార్పు వస్తే లాభాలలో కూడ తద్వ్యతిరేక దిశలో మార్పు వస్తుంది. వేతనాలు పడిపోతే, లాభాలు పెరుగుతాయి: మరి వేతనాలు పెరిగితే లాభాలు పడిపోతాయి. కార్మికునికి, మనమింతకుముందు అనుకున్నట్లు, 3 షిల్లింగులు, అనగా అతను ఉత్పన్నంచేసిన విలువలో సగం, లేక అతని మొత్తం పనిదినం, సగం ప్రతిఫలం చెల్లింపబడిన శ్రమతోను, సగం ప్రతిఫలం చెల్లింపబడని శ్రమతోను కూడివున్నట్లయితే, పెట్టుబడిదారు కూడా 3 షిల్లింగులు పొందుతాడు గనుక, లాభపు రేటు 100 శాతం వుంటుంది. అలాకాకుండా కార్మికునికి 2 షిల్లింగులు మాత్రమే ముట్టినట్లయితే, లేక అతను తన కోసం మొత్తం పనిదినంలో మూడవవంతు మాత్రమే పనిచేసినట్లయితే, పెట్టుబడిదారు 4 షిల్లింగులు పొందుతాడు, అప్పుడు లాభపు రేటు 200 శాతమవుతుంది. కార్మికుడు 4 షిల్లింగులు పొందితే, పెట్టుబడిదారు 2 షిల్లింగులు మాత్రమే పొందుతాడు, అప్పుడు లాభపు రేటు 50 శాతానికి పడిపోతుంది. కానైతే యీ మార్పులు ఏవీ సరుకు విలువలో మార్పు తీసుకురావు. అందుచేత, వేతనంలో వచ్చే సాధారణ పెరుగుదల మూలంగా సాధారణ లాభపు రేటు పడిపోతుందేగాని, సరుకుల విలువలపై దాని ప్రభావమేమీ వుండదు.

కాని, సరుకుల విలువలు, చివరకు ఏవైతే వాటి మార్కెట్ ధరలను అనివార్యంగా నియంత్రితం చేస్తున్నాయో ఆ విలువలు, కేవలం వాటిలో యిమిడివున్న మొత్తం శ్రమ పరిమాణాలచేతనే నిర్ణయింపబడుతాయిగాని, ఆ పరిమాణాన్ని ప్రతిఫలం చెల్లింపబడిన, చెల్లింపబడని భాగాలుగా విభజించడంద్వారా నిర్ధారితం కావు. ఉదాహరణకు, 12 గంటలలో ఉత్పత్తిచెయ్యబడిన విడి సరుకులయొక్క, లేక సరుకు సముదాయాలయొక్క విలువలు స్థిరంగా వుండిపోతాయని దీని అర్థం ఎంతమాత్రమూ కాదు. ఒక నిర్దిష్ట శ్రమకాలంలో, లేక ఒక నిర్దిష్ట శ్రమ పరిమాణంచేత ఉత్పత్తి చెయ్యబడిన సరుకుల సంఖ్యగాని, రాశిగాని వినియుక్తమైన శ్రమయొక్క ఉత్పాదక శక్తిపైన ఆధారపడుతుందిగాని, శ్రమకాలపు పరిమితి పైనగాని, దైర్ఘ్యంపైనగాని ఆధారపడదు. ఉదాహరణకు 12 గంటల పనిదినంలో, అధిక ఉత్పాదక శక్తి కలిగిన నూలుకార్మికుని శ్రమద్వారా 12 పౌన్ల నూలు తయారుకాగా, అంతకన్న తక్కువ ఉత్పాదక శక్తి కలిగిన నూలుకార్మికుని శ్రమద్వారా కేవలం 2 పౌనుల నూలు మాత్రమే తయారవుతుంది. మరి అప్పుడు 12 గంటల సగటు శ్రమ మొదటి సందర్భంలో 6 షిల్లింగుల విలువలో ఫలించినట్లయితే, 12 పౌనుల నూలు ధర 6 షిల్లింగులవుతుంది; రెండవ సందర్భంలో 2 పౌనుల నూలు ధర కూడా 6 షిల్లింగులే అవుతుంది. అందుకని, ఒక పౌను నూలు ధర ఒక సందర్భంలో 6 పెన్నీలు కాగా, రెండవ సందర్భంలో ఒక పౌను నూలు ధర 3 షిల్లింగులవుతుంది. ధరలోని యీ తేడా, వినియుక్తమైన శ్రమయొక్క ఉత్పాదక శక్తులలోని తేడావల్ల సంభవిస్తుంది. అధికతర ఉత్పాదక శక్తిగల

శ్రమద్వారా ఒక్క గంటలోనే ఒక పౌను నూలు తయారుకాగా, తక్కువ ఉత్పాదక శక్తిగల శ్రమద్వారా 6 గంటలలో ఒక పౌను నూలు తయారవుతుంది. ఒక సందర్భంలో, సాపేక్షంగా వేతనాలు అధికమూ, లాభపు రేటు అల్పమే అయినప్పటికీ ఒక పౌను నూలు ధర కేవలం 6 పెన్నీలు మాత్రమే వుంటుంది; రెండవ సందర్భంలో, వేతనాలు తక్కువా, లాభపు రేటు అధికమూ అయినప్పటికీ, ఒక పౌను నూలు ధర 3 షిల్లింగులుంటుంది. ఇది ఎందుకిలా అవుతుందంటే, ఒక పౌను నూలుధర దానిలో యిమిడివున్న శ్రమ మొత్తం పరిమాణంచేత నిర్ణయింపబడుతుందేగాని, ఆ మొత్తం శ్రమ పరిమాణం ప్రతిఫలం చెల్లింపబడిన, చెల్లింప బడని శ్రమగా విభజింపబడే నిష్పత్తి ద్వారా నిర్ణయింపబడదు. అందుకని, అధికధర కలిగిన శ్రమ చౌక సరుకులనూ, చౌకధర కలిగిన శ్రమ ప్రియమైన సరుకులనూ ఉత్పత్తి చెయ్య వచ్చునని నేనింతకు ముందు చెప్పిన మాటలోని విరోధాభాస యీ విధంగా తొలగిపోయింది. సరుకు విలువ దానిలో యిమిడివున్న శ్రమ పరిమాణంచేత నిర్ణయింపబడుతుంది, మరి దానిలో యిమిడివున్న శ్రమ పరిమాణం వినియుక్తమైన శ్రమయొక్క ఉత్పాదక శక్తులపైనే ఆధారపడుతుంది, తత్పర్యవసానంగా శ్రమయొక్క ఉత్పాదకతలో వచ్చే ప్రతి ఒక్క మార్పు తోనూ అది మారుతుంది — అన్న సాధారణ నియమపు వ్యక్తీకరణ తప్ప యిది వేరేమీకాదు.

# 13. వేతనాల పెంపుదలకై, లేదా తగ్గుదలను నిరోధించేందుకై జరిగిన పోరాటంలో ముఖ్య సందర్భాలు

ఇప్పుడు మనం వేతనాల పెంపుదలకై, లేదా తగ్గుదలను నిరోధించేందుకై జరిగిన పోరాటంలో కొన్ని ముఖ్య సందర్భాలు పరిశీలిద్దాం.

1. శ్రమశక్తి విలువ, లేక మరింత సాదా లోక పరిభాషలో, శ్రమ విలువ జీవితావసర వస్తువుల విలువచేత, లేక వాటిని ఉత్పత్తిచెయ్యడానికి అవసరమైన శ్రమపరిమాణంచేత నిర్ణయింపబడుతుందని మనం పైన చూశాం. మరి అప్పుడు, ఏ దేశంలోనైనా కార్మికుని దైనందిన సగటు జీవితావసర వస్తువుల విలువ (6 గంటల పనిని తెలియజేసే) 3 షిల్లిం గులలో వ్యక్తంచెయ్యబడినట్లయితే, కార్మికుడు తన రోజువారీ పోషణకు అవసరమైనదాన్ని తయారుచేసేందుకుగాను రోజూ 6 గంటలు పనిచెయ్యాల్సివుంటుంది. మొత్తం పనిదినం 12 గంటలైనట్లయితే, పెట్టుబడిదారు కార్మికునికి 3 షిల్లింగులు చెల్లించడంద్వారా ఆ రోజుకి అతని మొత్తం శ్రమయొక్క విలువకు చెల్లుపెడతాడు. పనిదినంలో సగం ప్రతి ఫలం చెల్లింపబడని శ్రమ అవుతుంది, లాభపు రేటు 100 శాతం అవుతుంది. కాని యిప్పుడు,

ఉత్పాదకతలో తగ్గుదల కారణంగా, మాటవరుసకు పూర్వమంత వ్యావసాయిక ఫలసాయాన్నే ఉత్పత్తిచెయ్యడానికి, యింకా ఎక్కువ శ్రమ అవసరమవుతుందనుకోండి, తత్ఫర్యవసానంగా సగటు దైనందిన జీవితావసర వస్తువుల ధర 3 నుంచి 4 షిల్లింగులకు పెరుగుతుంది. అటువంటి సందర్భంలో శ్రమయొక్క విలువ $^1/_3$వ వంతు, లేక $33^1/_3$ శాతం పెరుగుతుంది. కార్మికుని యిదివరకటి జీవన ప్రమాణాన్నిబట్టి, అతని రోజువారీ పోషణకు సమానమైన విలువను ఉత్పత్తిచెయ్యడానికి యిప్పుడు అతను పనిదినంలో 8 గంటలు పనిచెయ్యాల్సివుంటుంది. అందుచేత, అదనపు శ్రమ 6 గంటలనుండి 4 గంటలకూ, లాభపు రేటు 100 శాతంనుండి 50 శాతానికీ పడిపోతుంది. కాని అటువంటి పరిస్థితిలో, కార్మికుడు వేతనాలు పెంచాల్సిందిగా పట్టుబట్టినట్లయితే, అతను కేవలం తన శ్రమకు పెరిగిన విలువను మాత్రమే కోరుతున్నాడన్నమాట; ప్రతి యితర సరుకు విక్రేతా, తన సరుకులయొక్క ఖర్చులు పెరిగినప్పుడు, దాని పెరిగిన విలువను రాబట్టుకోవడానికెలా ప్రయత్నిస్తాడో, సరిగా యిదీ అటువంటి ప్రయత్నమే తప్ప వేరుకాదు. వేతనాలు పెరగకపోతే, లేక జీవితావసర వస్తువుల విలువలలో వచ్చిన పెరుగుదలకు సరిపడ పెరగకపోతే, శ్రమయొక్క ధర శ్రమయొక్క విలువ కంటె తగ్గిపోతుంది, కార్మికుని జీవన ప్రమాణం పడిపోతుంది.

కాని, మార్పు యిందుకు భిన్న దిశలో కూడా జరగవచ్చు. శ్రమ ఉత్పాదకత పెరిగిన కారణంగా, అదే ప్రమాణపు సగటు దైనందిన జీవితావసర వస్తువులే 3 షిల్లింగులనుంచి 2 షిల్లింగులకు పడిపోవచ్చు, లేక దైనందిన జీవితావసర వస్తువుల విలువకు సరిపడ పునరుత్పత్తి చేసేందుకుగాను పూర్వం మాదిరిగా పనిదినంలో 6 గంటలుకాక, కేవలం 4 గంటలే అవసరం కావచ్చు. కార్మికుడు పూర్వం తను 3 షిల్లింగులకు ఎన్నైతే జీవితావసర వస్తువులను కొన్నాడో యిప్పుడు అన్నింటిని 2 షిల్లింగులకే కొనగలుగుతాడు. శ్రమ విలువ పడిపోతుంది, నిజమే, కాని ఆ తగ్గిన శ్రమ విలువకు యిదివరకటన్ని సరుకులూ లభిస్తాయి. అప్పుడు లాభం 3 నుంచి 4 షిల్లింగులకు పెరుగుతుంది, లాభపు రేటు 100 నుంచి 200 శాతానికి పెరుగుతుంది. కార్మికుని నిరపేక్ష జీవనప్రమాణం యథాతథంగానే ఉన్నప్పటికీ, అతని సాపేక్ష వేతనాలూ, దానితోబాటే పెట్టుబడిదారుతో పోల్చినపుడు అతని సాపేక్ష సామాజిక స్థాయీ తగ్గిపోతాయి. కార్మికుడు తన సాపేక్ష వేతనాలలోని యీ తగ్గుదలను ప్రతిఘటిస్తే, తన సొంత శ్రమయొక్క పెరిగిన ఉత్పాదక శక్తులలోనుంచే కొంతవాటాను పొందడానికీ, సామాజిక నిశ్రేణిలో తన పూర్వ సాపేక్ష స్థాయిని నిలుపుకొనేందుకూ ప్రయత్నిస్తున్నాడన్నమాట. ఈవిధంగా ధాన్యపు చట్టాలు రద్దుచెయ్యబడిన తర్వాత, ధాన్యపు చట్ట వ్యతిరేక ఆందోళనోద్యమకాలంలో తామిచ్చిన గంభీర వాగ్దానాలకు పూర్తి విరుద్ధంగా, ఆంగ్ల ఫ్యాక్టరీ యజమానులు వేతనాలలో దరహంపైన 10 శాతం కోతపెట్టారు. కార్మికుల ప్రతిఘటన ఆదిలో భగ్నంచెయ్యబడింది గాని, పరిస్థితుల పర్యవసానంగా — వాటిని నేనిక్కడ

వివరించడం సాధ్యంకాదు – యీ 10 శాతపు కోత తర్వాత తిరిగి భర్తీచెయ్యబడింది.

2. జీవితావసర వస్తువుల విలువలూ, తత్పర్యవసానంగా శ్రమ విలువా యథాతథంగా ఉండిపోవచ్చును, కాని డబ్బు రూపంలో వాటి విలువలో అంతకుముందు వచ్చిన మార్పు పర్యవసానంగా, డబ్బు రూపంలో వాటి ధరలలో మార్పు రావచ్చు.

ఉదాహరణకు, మరింత సంపన్నమైన గనులు కనుగొనబడటం మొదలైన కారణాల మూలంగా, అంతకుముందు ఒక ఔన్సు బంగారాన్ని ఉత్పత్తిచేసేందుకు పట్టిన దానికన్న యిప్పుడు రెండు ఔన్సుల బంగారాన్ని ఉత్పత్తిచెయ్యడానికి ఎక్కువ శ్రమవ్యయం కాకపోవచ్చు. అప్పుడు బంగారం విలువ సగానికి లేక 50 శాతం పడిపోతుంది. అన్ని యితర సరుకుల విలువలూ డబ్బు రూపంలో అంతకు ముందరి ధరలకు రెట్టింపు ప్రమాణాలలో వ్యక్తం చెయ్యబడతాయి కనుక, శ్రమ విలువకు కూడా అదే వర్తిస్తుంది. అంతకుముందు 6 షిల్లింగులలో వ్యక్తంచెయ్యబడుతూవచ్చిన 12 గంటల శ్రమ, యిప్పుడు 12 షిల్లింగులలో వ్యక్తం చెయ్యబడుతుంది. కార్మికుని వేతనం 6 షిల్లింగులకు పెరిగేందుకు బదులు 3 షిల్లింగులుగానే ఉండిపోయినట్లయితే, డబ్బు రూపంలో అతని శ్రమ విలువ అతని శ్రమ విలువలో సగానికి మాత్రమే సమానమవుతుంది, అతని జీవనప్రమాణం దారుణంగా పడిపోతుంది. అతని వేతనం పెరిగినా, బంగారపు విలువ పడిపోయినదానికి సరైన నిష్పత్తిలో పెరగకపోయినట్లయితే, అప్పుడు కూడా ఇంచుమించుగా యిదే సంభవిస్తుంది. అటువంటి సందర్భంలో శ్రమయొక్క ఉత్పాదక శక్తులలోగాని, సరఫరా గిరాకీలలోగాని, లేక విలువల్లోగాని ఏ మార్పూ సంభవించదు. డబ్బు రూపంలో ఆ విలువల పేర్లు తప్ప మరేదీ మారదు. అటువంటి సందర్భంలో కార్మికుడు తన వేతనాన్ని తగిన రీతిలో పెంచాలని పట్టుబట్టరాదని చెప్పడమంటే దాని అర్థం, అతను వస్తురూపంలో కాక, పేర్లరూపంలో జరిగే చెల్లింపులతో తృప్తిపడాలని చెప్పడమే తప్ప మరేమీకాదు. డబ్బు విలువ పడిపోయినప్పుడల్లా, పెట్టుబడిదారులు యీ అవకాశాన్ని వినియోగించుకొని కార్మికులను దగాచెయ్యడానికి సర్వసన్నద్ధంగా ఉంటారని గత చరిత్రంతా రుజువుచేస్తోంది. బంగారు నిక్షేపాలున్న కొత్త ప్రాంతాలు కనుగొనబడిన కారణంగాను, వెండిగనుల్లో మరింత సక్రమ పద్ధతిలో పనిజరుగుతున్న కారణంగాను, పాదరసం మరింత చౌకధరకు సరఫరా అవుతున్న కారణంగాను బంగారం, వెండి మొదలైన బహుమూల్య లోహాల విలువ మళ్ళీ పడిపోయిందని పలువురు అర్థశాస్త్రజ్ఞులు నొక్కిచెప్తున్నారు. యూరప్ ఖండంలో సర్వత్రా, ఏకకాలంలో వేతనాల పెంపుదలకోసం ప్రయత్నం జరుగుతున్నదంటే దానికి యిదే కారణం.

3. మనం యింతదాకా పనిదినానికి నిర్దిష్టమైన హద్దులున్నాయని అనుకుంటూవచ్చాం. కానైతే, దానికదిగా పనిదినానికి స్థిరమైన హద్దులంటూ ఏమీ లేవు. పెట్టుబడియొక్క నిరంతర ప్రవృత్తి ఏమిటంటే, శ్రామికుల శారీరక శక్తిని దృష్టిలో ఉంచుకొని పనిదినాన్ని

సాధ్యమైనంత ఎక్కువ మేరకు పొడిగించడం. ఎందుకంటే, అలా ఏమేరకు పొడిగిస్తే ఆ మేరకు అదనపు శ్రమా, తత్ఫలితంగా వచ్చే లాభమూ పెరుగుతాయి. పనిదినాన్ని పొడిగించడంలో పెట్టుబడి ఎంత ఎక్కువగా విజయం సాధిస్తే అంత ఎక్కువ ప్రమాణంలో అది యితరుల శ్రమను సొంతపరుచుకోగలుగుతుంది. 17వ శతాబ్దంలోను, 18వ శతాబ్దంలో మూడింట మొదటి రెండు భాగాల్లోనూ సైతం ఇంగ్లండు అంతటా పదిగంటల పనిదినం సామాన్యమైన పనిదినంగా ఉంటూవచ్చింది. జాకొబిన్ వ్యతిరేక యుద్ధకాలంలో — నిజానికది బ్రిటిష్ కార్మికజన సామాన్యంపై బ్రిటిష్ పారిశ్రామిక ప్రభువులు జరిపిన యుద్ధం[23] తప్ప వేరుకాదు — పెట్టుబడి తన కరాళ నృత్య ప్రదర్శనచేసి, పనిదినాన్ని 10నుంచి 12, 14, చివరకు 18 గంటలదాకా కూడా పెంచింది. సుమారు 1815లో ప్రచురింపబడిన తన చిన్న పుస్తకమొకదానిలో, యీ మాదిరి పరిస్థితి యిలాగే కొనసాగినట్లయితే, బ్రిటిష్ జాతి జీవితపు మూలాధారానికే దెబ్బ తగులుతుందని మాల్తుస్ రాశాడు.[24] మరి అతను ఊహా విహార ప్రవృత్తి కలవాడని ఎవరూ ఎంతమాత్రం అనుమానించరు. సాధారణ స్థాయిలో పరిశ్రమల్లో ప్రవేశపెట్టబడేందుకు కొద్ది సంవత్సరాలకు ముందు, సుమారు 1765 ప్రాంతంలో, ఇంగ్లండులో "పరిశ్రమలను గురించిన రచన" అనే పేరున ఒక చిన్న పుస్తకం వెలువడింది. ఆ చిన్న పుస్తకపు గుప్త రచయిత,* కార్మికవర్గపు గర్భశత్రువు పనిదినాన్ని పెంచాల్సిన ఆవశ్యకతపై మాటలు గుప్పించాడు. ఈ ప్రయోజనసిద్ధి కోసం మిగిలిన సాధనాలతోబాటు, అతను వర్క్ హౌస్‌లు[25] నిర్మింపబడాలని ప్రతిపాదించాడు. అతను చెప్పినదాని ప్రకారం అవి "బీభత్స నిలయాలు"గా ఉండాల్సివుంటుంది. ఈ "బీభత్స నిలయాల"కు యీ గుప్త రచయిత నిర్దేశించిన పనిదినపు వ్యవధి ఎంతో తెలుసాండి? 12 గంటలు! తర్వాత 1832లో, పెట్టుబడిదారులూ, అర్థశాస్త్రజ్ఞులూ, మంత్రులూ సరిగా యీ 12 గంటల కాలాన్నే 12 ఏళ్లలోపు పిల్లలకు అమల్లో వున్నదే కాకుండా, ఆవశ్యకమైన పనిదినపు వ్యవధి అని ప్రకటించారు.

తన శ్రమశక్తిని అమ్ముకోవడంద్వారా — ప్రస్తుత వ్యవస్థలో కార్మికునికి అలా చెయ్యక గత్యంతరం లేదు — కార్మికుడు తన ఆ శ్రమశక్తిని పెట్టుబడిదారుకి అతని వినియోగం నిమిత్తం సమర్పిస్తాడు, కాని హేతుబద్ధమైన కొన్ని హద్దుల్లో మాత్రమే అతనలా సమర్పిస్తాడు. అతడు తన శ్రమశక్తిని నిలుపుకొనేటందుకుగాను దాన్ని అమ్ముతాడు, అంతేగాని దాన్ని నాశనం చేసుకొనేందుకు కాదు; కానైతే ఉపయోగ క్రమంలో సహజసిద్ధంగా దానిలో కొంత అరుగుతరుగులుండవచ్చు. తన శ్రమశక్తిని దాని రోజువారీ, లేక వారంవారీ విలువకు అతను అమ్ముతున్నాడంటే, ఒక రోజులోనే రెండు రోజుల శ్రమశక్తీ, ఒక వారంలోనే రెండు

* జి. కన్నింగ్‌హాం కావచ్చు. — సం.

వారాల శ్రమశక్తి వ్యర్థమై పోకూడదనీ, వ్యయమై పోకూడదనే దాని అర్థం. 1000 పౌనుల ఖరీదుగల ఒక యంత్రాన్ని తీసుకోండి. అది పదేళ్లలో పూర్తిగా అరిగిపోయేట్లయితే, ఏ సరుకుల ఉత్పత్తిలోనైతే అది తోడ్పడుతున్నదో వాటి విలువకు అది ఏటా 100 పౌనుల చొప్పున చేరుస్తూవుంటుంది. అదే కనుక 5 ఏళ్లలోనే పూర్తిగా అరిగిపోయేమాటైతే, ఏటా అది 200 పౌనుల విలువను చేరుస్తుంది. అంటే దాని సాలుసరి అరుగుతరుగుల విలువ, అది ఎంతకాలంలో పూర్తిగా అరిగిపోయి పనికి రాకుండా పోతుందో ఆ కాలానికి విలోమ నిష్పత్తిలో వుంటుంది. మరి యిదే కార్మికునికీ యంత్రానికీ మధ్యగల వ్యత్యాసాన్ని తెలియజేస్తుంది. యంత్రం ఏ నిష్పత్తిలోనైతే ఉపయోగింపబడుతుందో, దాని అరుగుదల సరిగా అదే నిష్పత్తిలో వుండదు. అందుకు విరుద్ధంగా, గణితరీత్యా పని స్వల్పంగానే పెరిగినా, మనిషి పైకి కనిపించే దానికన్న అధికతర నిష్పత్తిలో క్షీణిస్తాడు.

పనిదినాన్ని హేతుబద్ధమైన దాని పాత హద్దుల్లోకి తగ్గించడానికి కార్మికులు పోరాటం చేస్తున్నప్పుడు, లేక చట్టం ద్వారా సామాన్య పనిదిన ప్రమాణాన్ని నిర్ణయింపచేసుకోవడం సాధ్యంకాని కారణంగా కార్మికునినుండి పెట్టుబడిదారు గుంజుకొనే అదనపు పనికాలపు అనుపాతంలోనే కాకుండా, అంతకన్న అధికానుపాతంలో వేతనం పెంపుదలద్వారా అదనపు పనికాలాన్ని నిరోధించడానికి పోరాటం చేస్తున్నప్పుడు, కార్మికులు తమపట్లా, తమ సంతానంపట్లా కేవలం మత విధిని మాత్రమే నిర్వర్తిస్తారు. వారు కేవలం పెట్టుబడియొక్క నిరంకుశ అనధికారాతిక్రమణలకు మాత్రమే హద్దులుపెడతారు. విరామకాలమనేదే మానవ వికాసానికి అంగణం ఏ మానవునికైతే స్వేచ్ఛానుసారంగా గడిపేందుకు కొంచెం కూడా విరామకాలం ఉండదో, ఎవని యావజ్జీవితమూ, నిద్రాహారాదులకు వ్యయమయ్యే కాలంపోను మిగిలిన కాలమంతా, పెట్టుబడిదారుకు అతను చేసే చాకిరిలోనే గడిచిపోతుందో, అటువంటి వ్యక్తి గొడ్డుకంటె కనాకష్టమని చెప్పాల్సివుంటుంది. అతను శారీరకంగా శిథిలమై, మానసికంగా పశుతుల్యుడై, యితరులకు సంపదను సృష్టించిపెట్టే కేవల యంత్రమవుతాడు. అయినా కూడా, ఆధునిక పరిశ్రమ చరిత్రనంతనూ పరిశీలిస్తే మనకొక విషయం స్పష్టమవుతుంది: పెట్టుబడికి కళ్లెం వెయ్యకపోతే, అది విశృంఖలంగా, నిర్దాక్షిణ్యంగా యావత్తు కార్మిక వర్గాన్నీ ఘోర పతనావస్థలోకి దిగజారుస్తుంది.

పనిదినాన్ని పొడిగించి పెట్టుబడిదారు అధిక వేతనం యివ్వవచ్చు, అలా యిచ్చి కూడా, వేతనంలోని ఆ పెరుగుదల తాను గుంజుతున్న అధికతర శ్రమకూ, తత్కారణంగా జరిగే శ్రమశక్తియొక్క శీఘ్రతర క్షీణతకూ అనురూపంగా వుండకపోయినట్లయితే, శ్రమ విలువను తగ్గించవచ్చు. ఇది మరోవిధంగా కూడా జరగవచ్చు. బూర్జువా గణాంకవేత్తలు లాంకషైరులోని ఫ్యాక్టరీ కార్మిక కుటుంబాల సగటు ఆదాయం పెరగడాన్ని ఒక ఉదాహరణగా పేర్కొంటూ వుంటారు. కాని వారొక విషయాన్ని చెప్పడం మరచిపోతున్నారు, కుటుంబ యజ

మాని, అతని భార్య, బహుశా ముగ్గురో నలుగురో పిల్లలూ యిప్పుడు పెట్టుబడి అనే "జగన్నాథ రథ చక్రాల"[26] కింద పడి నలిగిపోతున్నారు. కుటుంబపు మొత్తం వేతనాలలోని పెరుగుదల ఆ కుటుంబంనుండి గుంజుకోబడుతున్న మొత్తం అదనపు శ్రమకు అనురూపంగా ఉండటంలేదు.

ఫ్యాక్టరీ చట్టాలు వర్తించే అన్ని పరిశ్రమలలోనూ యీనాడు పనిదినానికి కొన్ని పరిమితులు అమల్లో వున్నట్లుగా పనిదినానికి కొన్ని నిర్దిష్టమైన హద్దులున్నప్పటికీ, శ్రమ విలువను పూర్వ స్థాయిలో అట్టేపెట్టడానికి సైతం వేతనంలో పెరుగుదల అవసరమవుతుంది. శ్రమ తీవ్రతను పెంచడంద్వారా, ఒక మనిషిచేత అతను అంతకుముందు రెండు గంటల్లో వ్యయపరుస్తూవుండినంత జీవశక్తిని ఒక్క గంటలోనే వ్యయపరిచేలా చేయించవచ్చు. ఇది, కొంతమేరకు, ఫ్యాక్టరీ చట్టాల పరిధిలో వున్న పరిశ్రమలలో యంత్రాల వేగాన్ని పెంచడం ద్వారాను, ఒకేఒక వ్యక్తి యిప్పుడు అజమాయిషీ చెయ్యాల్సిన యంత్రాల సంఖ్యను పెంచడంద్వారాను అమలుజరపబడింది. శ్రమ తీవ్రతలో, లేక ఒక గంటలో వ్యయమొనర్చబడే శ్రమరాశిలో పెంపుదలకు ఏదైనా అనుకూలానుపాతంలో పనిదిన ప్రమాణంలో తగ్గుదల వుంటే కూడా, కార్మికుని పరిస్థితి లాభసాటిగానే వుంటుంది. అలాకాకుండా, యీ పరిమితి అతిక్రమింపబడితే, ఒక రూపంలో అతను సాధించుకున్నదాన్ని మరొక రూపంలో కోల్పోతాడు, యిప్పటి 10 గంటల శ్రమా యింతకు పూర్వపు 12 గంటల శ్రమ అంతటి వినాశకరమూ కావచ్చు. పెంపొందుతున్న శ్రమ తీవ్రతకు అనురూపంగా వేతనాల పెంపుదలకోసం పోరాడటంద్వారా పెట్టుబడియొక్క యీ ధోరణిని అరికట్టడంలో కార్మికుడు కేవలం తన శ్రమయొక్క తరుగుదలనూ, తన సంతానపు అధ్వాన్న స్థితినీ మాత్రమే ప్రతిఘటిస్తాడు.

4. కొన్ని కారణాలుగా – వాటిని స్పష్టీకరించడం ప్రస్తుతం అనవసరం – పెట్టుబడిదారీ ఉత్పత్తి కొన్ని వలయావర్తాల గుండా సాగుతుందని మీ అందరికీ తెలుసు. అది నిస్తబ్దత, పునరుజ్జీవనం, వికాసం, అత్యుత్పత్తి, సంక్షోభ, మాంద్య స్థితుల గుండా గడుస్తూ సాగుతూ వుంటుంది. సరుకుల మార్కెట్ ధరల్లోను, మార్కెట్ లాభపు రేట్లలోనూ పై దశల ననుసరించి మార్పులు జరుగుతూవుంటాయి, అవి ఒక్కొక్కమారు సగటును మించి పెరుగుతూ, మరొకప్పుడు సగటుకన్న కిందికి పడిపోతూవుంటాయి. మొత్తం వలయావర్తాన్ని పరిశీలించిన మీదట, మార్కెట్ ధరలో వచ్చే ఎగుడుదిగుళ్లలో ఒకటి మరొకదాన్ని సరిపుచ్చుకుంటాయనీ, పూర్తి వలయావర్తంలో సగటు సరుకుల మార్కెట్ ధరలు సరుకుల విలువలచేత నియంత్రితం చెయ్యబడుతాయనీ మీరు చూస్తారు. సరే! ఇక మార్కెట్ ధరలు పడిపోతున్న దశలోను, సంక్షోభ, మాంద్య దశల్లోనూ కార్మికుడు పనిలోంచి తొలగింపబడకపోయినా, అతని వేతనం తగ్గింపబడటం మాత్రం ఖాయం. తను దగా చెయ్యబడకుండా ఉండేం

దుకుగాను, కార్మికుడు, మార్కెట్ ధరలు అంతగా పడిపోయినా కూడా, ఏ పరిమాణాను పాతంలో వేతనాలను తగ్గించాల్సిన అవసరమేర్పడిందన్న అంశంపై పెట్టుబడిదారుతో చర్చించవలసివుంటుంది. వికాసం దశల్లో పెట్టుబడిదారు అదనపు లాభాలను సంపాదించు కుంటూపోయేటప్పుడు, కార్మికుడు తన వేతనాల పెంపుదల కోసం పోరాడకపోయినట్లయితే, పారిశ్రామిక వలయపు సగటును తీసుకున్నప్పుడు, అతడు తన సగటు వేతనాన్ని, లేక తన శ్రమ విలువను సైతం పొందడు. వలయావర్తంలోని ప్రతికూల దశల్లో కార్మికుని వేతనం విధిగా దెబ్బతినేటప్పుడు, వలయావర్తపు వికాస దశల్లో అతను నష్టపరిహారం పొందకుండా మిన్నకుండాలనడం పరమ మూర్ఖత్వం తప్ప వేరేమీకాదు. సాధారణంగా, సరఫరా గిరాకీలలో నిరంతరాయంగా ఏర్పడే హెచ్చుతగ్గుల మూలంగా నిరంతరాయంగా మార్పుచెందే మార్కెట్ ధరలను సమానమొనర్చడంద్వారా మాత్రమే అన్ని సరుకుల విలువలూ సాధించుకోబడుతాయి. ప్రస్తుత వ్యవస్థ ప్రాతిపదికమేరకు, శ్రమ కూడా యితర సరుకుల మాదిరిగా కేవలం ఒక సరుకు మాత్రమే. అందుకని, తన విలువకు అనురూపమైన సగటు ధరను తెచ్చుకొనేందుకు గాను, అది కూడా అటువంటి ఎగుడుదిగుళ్లకే గురికాక తప్పదు. ఒకవంక దాన్నొక సరు కుగా పరిగణిస్తూ, మరోవంక సరుకుల ధరలను నియంత్రితంచేసే నియమాలనుండి దాన్ని మినహాయించాలనుకోవడం అసంగతమైన విషయం. బానిసకు అతని పోషణకుగాను జీవితా వసర వస్తువుల ఒక నిర్ణీత మొత్తం శాశ్వతంగా ముడుతుంది; కాని వేతన కార్మికునికి అటు వంటిదేమీ వుండదు. ఒక సందర్భంలో వేతనం పడిపోయిన కారణంగా వచ్చే లోటును కనీసం భర్తీచేసుకోడానికైనా కార్మికుడు మరో సందర్భంలో వేతనాన్ని పెంచుకొనేందుకోసం పోరాడాల్సివుంటుంది. అలా కాకుండా, కార్మికుడు తననుతాను పెట్టుబడిదారు అభీష్టానికి వదిలేసి, అతని ఆదేశాలనే శాశ్వత ఆర్థిక నియమంగా శిరసావహించినట్లయితే, అతనికి బాని సకుగల భద్రత మినహాగా బానిసకుండే యాతనలన్నీ మాత్రం అతను అనుభవించాల్సివుం టుంది.

5. నేనింతవరకు వివరించిన సందర్భాలన్నింటిలోనూ — మరి వాటి సంఖ్య 100కి 99 — వేతనాల పెంపుదలకోసం జరిగే ప్రతి పోరాటమూ అంతకుముందు సంభవించిన మార్పులను అనుసరించి మాత్రమే జరిగినట్లు మీరు గమనించారు; మరి ఆ ఉత్పత్తి మొత్తంలో, శ్రమయొక్క ఉత్పాదక శక్తులలో, శ్రమ విలువలో, డబ్బు విలువలో, గుంజుకోబడిన శ్రమ పరిమితి లేక తీవ్రతలో, సరఫరా గిరాకీలలో వచ్చే ఎగుడుదిగుళ్లపై ఆధారపడి, పారిశ్రా మిక వలయావర్తపు విభిన్న దశలకు అనుగుణంగా మార్కెట్ ధరల్లో వచ్చిన హెచ్చుతగ్గులలో అంతకుముందు వచ్చిన మార్పుల అనివార్య పర్యవసానాలుగా మాత్రమే జరిగినట్లు మీరు గమనించారు. ఒక్కమాటలో చెప్పాలంటే అది పెట్టుబడి పూర్వ చర్యకు శ్రమ ప్రతిచర్య. వేతనాల పెంపుదలకోసం జరిగే పోరాటాన్ని యీ పరిస్థితులన్నింటినుండీ వేరుచేసి పరిశీలించ

డమంటే, వేతనాల మార్పును మాత్రమే పరిగణనలోకి తీసుకొని, వేటిమూలంగా వేతనాలలో మార్పు వచ్చిందో ఆ యితర మార్పులన్నింటినీ ఉపేక్షించడమంటే, మీరు పొరపాటు పూర్వ సిద్ధాంతంనుంచి బయల్దేరి, తప్పు నిర్ధారణలకు చేరుకోవడమే అవుతుంది.

# 14. పెట్టుబడికీ శ్రమకీ మధ్య పోరాటమూ, దాని ఫలితాలూ

1. వేతనాల తగ్గింపుకు వ్యతిరేకంగా దఫదఫాలుగా కార్మికులు జరిపే పోరాటమూ, వేతనాల పెంపుదలకోసం దఫదఫాలుగా వారు చేసే ప్రయత్నాలూ, వేతన వ్యవస్థనుండి అవిభాజ్యమైనవనీ, సరుకులలో శ్రమ యిమిడివున్నందుననూ, మరి ఆ కారణంగా ధరల మార్పులను నిర్ణయించే సాధారణ నియమాలు శ్రమకికూడ వర్తిస్తాయి గనుకనూ శ్రమ యొక్క యీ ప్రతిఘటనా, ప్రయత్నమూ సంభవిస్తాయని నేను పైన నిరూపించాను; వేతనాలలో సాధారణ పెంపుదల సాధారణ లాభపు రేటు తరుగుదలకు దారితీస్తుందేగాని, సరుకుల సగటు ధరలపైనగాని, వాటి విలువలపైనగాని దాని ప్రభావమేమీ ఉండదని కూడా నిరూపించాను; చివరకు యీకింది ప్రశ్న ఉత్పన్నమవుతుంది: పెట్టుబడికీ శ్రమకూ మధ్య జరిగే యీ అవిరామ పోరాటంలో, శ్రమ విజయం సాధించే అవకాశం ఎంతవరకు వుంది?

నేను దీనికి ఒక సాధారణ సూత్రంతో యిలా జవాబు చెప్పగలను: అన్ని యితర సరుకుల విషయంలో మాదిరిగానే శ్రమ మార్కెట్ ధర కూడా, దీర్ఘకాలక్రమంలో, శ్రమ విలువకు తననుతాను అనువర్తిగా చేసుకొంటుంది; అందుచేత ఎన్ని ఎగుడుదిగుళ్లు వచ్చినా, — కార్మికుడు ఏమైనా చేయవచ్చుగాక — సగటున కార్మికుడు తన శ్రమ విలువను మాత్రమే పొందుతాడు. శ్రమ విలువ అన్నది శ్రమశక్తి విలువ మాత్రమే, అది దాని పోషణకూ, పునరుత్పత్తికీ అవసరమైన జీవితావసర వస్తువుల విలువచేత నిర్ణయింపబడుతుంది. జీవితావసర వస్తువులయొక్క ఆ విలువ చివరకు వాటిని ఉత్పత్తిచెయ్యడానికి అవసరమైన శ్రమపరిమాణంచేత నియంత్రితమవుతుంది.

కాని, శ్రమశక్తి విలువను లేక శ్రమ విలువను అన్ని తదితర సరుకులనుండీ వేరుచేసే కొన్ని విలక్షణాంశాలున్నాయి. శ్రమశక్తి విలువ రెండు మూలాంశాల సమ్మేళనం — ఒకటి కేవలం శారీరకమైనది, రెండవది చారిత్రకమైనది, లేక సామాజికమైనది. దాని కనిష్ట పరిమితి కార్మికుని శారీరక శక్తిచేత నిర్ణయింపబడుతుంది, అంటే, తనను తాను పోషించుకోడానికీ, సంతానాన్ని కని పోషించడానికీ, తన భౌతిక అస్తిత్వాన్ని శాశ్వతంగా పొడిగించడానికీగాను, కార్మికవర్గం జీవించివుండేందుకూ, సంతానాన్ని వృద్ధిచేసేందుకూ తప్పనిసరిగా

అవసరమైన జీవితావసర వస్తువులను పొందాల్సివుంటుంది. అందుచేత ఆ అనివార్య జీవితావసరవస్తువుల విలువయే, శ్రమ విలువ కనిష్ట పరిమితి అవుతుంది. మరోవంక పనిదినపు పరిమితి కూడా అంతిమ పరిధిచేత — విశేషంగా హెచ్చుతగ్గులకు గురయ్యే స్వభావం కలిగినదే అయినా — పరిమితమై వుంటుంది. దాని అంతిమ పరిమితి కార్మికుని శారీరక శక్తిచేత నిర్ణయింపబడుతుంది. కార్మికుని జీవశక్తుల రోజువారీ క్షీణత ఒక నిర్ణీత పరిమితిని మించినట్లయితే, అతను రోజురోజూ తిరిగి దాన్ని ఉపయోగించలేడు. కానైతే, నేనింతకు ముందే చెప్పినట్లు, యీ పరిమితి విశేషంగా హెచ్చుతూ తగ్గుతూ ఉండే స్వభావం కలిగినది. ఆరోగ్యవంతమూ, దీర్ఘాయుష్కమూ అయిన కార్మిక తరాల పరంపర కార్మిక మార్కెట్టును నింపినట్లే, అనారోగ్యవంతమూ, అల్పాయుష్కమూ అయిన కార్మిక తరాల శీఘ్ర పరంపర సైతం కార్మిక మార్కెట్టును నింపుతుంది.

ఈ కేవల శారీరకాంశమే కాకుండా, ప్రతి దేశంలోనూ శ్రమ విలువ సాంప్రదాయికమైన జీవన ప్రమాణాన్నిబట్టి నిర్ణయింపబడుతుంది. అది కేవలం శారీరక జీవితమే కాక, మనుషులు ఏ సామాజిక పరిస్థితుల్లో పెరిగారో, జీవిస్తున్నారో, ఆ సామాజిక పరిస్థితులనుంచి ఉత్పన్నమయ్యే కొన్ని అవసరాల పరిపూర్తి కూడా. ఇంగ్లీషువారి జీవన ప్రమాణాన్ని ఐరిష్‌వారి జీవన ప్రమాణానికి తగ్గించివేయవచ్చు; జర్మన్ రైతు జీవన ప్రమాణాన్ని లివోనియన్ రైతు జీవన ప్రమాణం మేరకు తగ్గించివేయవచ్చు. ఇందుకు సంబంధించి, చారిత్రక సంప్రదాయమూ, సామాజిక అలవాటూ ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తాయన్న విషయాన్ని మిస్టర్ థార్న్‌టన్ రచించిన "అధిక జనాభా" అనే పుస్తకంనుండి మీరు తెలుసుకోవచ్చు. అందులో ఆయన ఇంగ్లండులోని విభిన్న వ్యావసాయిక మండలాలలోని సగటు వేతనాలు కొద్దిగానో గొప్పగానో ఏ అనుకూల పరిస్థితులలోనైతే ఆ మండలాలు భూదాస్యం నుండి విముక్తిచెందాయో ఆ పరిస్థితులనే కొద్దిగానో గొప్పగానో అనుసరించి ఇప్పటికీ కూడ భిన్నంగా వున్నాయని చూపిస్తాడు.

శ్రమ విలువలోకి ప్రవేశించే యీ చారిత్రక, లేక సామాజికాంశాన్ని విస్తరింపజేయనూ వచ్చు, తగ్గించనూవచ్చు, లేక పూర్తిగా అంతమొందించవచ్చు, అప్పుడిక శారీరకాంశం తప్ప మరేదీ మిగలదు. నిస్సంకోచంగా పన్నులు స్వాహాచేసి, పనిబాధ్యతలు లేకుండా జీతాలు మేసేవారి పక్షం వహించిన వృద్ధ జార్జ్ రోజ్ అంటూవుండినట్లు, మన పవిత్ర క్రిస్టియన్ మత సుఖ సువిధులను ఫ్రెంచి మతవిరోధుల దాడినుండి కాపాడేందుకు సాగింపబడిన జాకొబిన్ వ్యతిరేక యుద్ధ కాలంలో, ఇంగ్లీషు వ్యవసాయదార్లు (వీరిని గురించి యింతకు ముందరి మన ప్రకరణాల్లో ఒకదానిలో మిక్కిలి సున్నితంగా ప్రస్తావించాం) వ్యవసాయ కార్మికుల వేతనాలను శారీరకావసరాలకు సంబంధించిన ఆ కనీస స్థాయి కంటెకూడా తగ్గించేశారు. అయితే పేదల చట్టాల[27] ద్వారా కార్మిక జాతి నశించిపోకుండా కొనసాగేందుకు

అవసరమైన ఆ లోటు భర్తీచెయ్యబడింది. వేతన కార్మికుణ్ణి బానిసగానూ, షేక్స్పియర్ చేత సగర్వంగా తలెత్తుకు తిరిగేవాడుగా అభివర్ణింపబడిన చిన్నరైతును దరిద్ర దామోదరుని గానూ మార్చే ఒక మహత్తర మార్గమిది.

విభిన్న దేశాలలోను, లేక ఒకే దేశపు విభిన్న చారిత్రక యుగాలలోను ప్రామాణిక వేతనాలను లేక శ్రమ విలువలను సరిపోల్చడంద్వారా, శ్రమ విలువ స్థిరంగా ఉండదనీ, యితర అన్ని సరుకుల విలువలూ స్థిరంగా ఉన్నాయనుకున్నప్పటికీ, అది ఒక అస్థిర పరిమాణంగానే ఉంటుందనీ మీరు గ్రహిస్తారు.

ఇదేరకమైన తులనాత్మక పరిశీలనద్వారా లాభంయొక్క మార్కెట్ రేట్లే కాకుండా, దాని సగటు రేట్లు కూడా మారుతాయని రుజువవుతుంది.

కాని లాభాలకు సంబంధించినంతవరకు, వాటి కనీస పరిమితిని నిర్ణయించే నియమం అంటూ ఏదీ లేదు. లాభం తగ్గుదలకు కనిష్ఠ పరిమితి ఏమిటో మనం చెప్పలేము. మరి మనం ఆ పరిమితిని ఎందుకు నిర్ణయించలేము? వేతనాల కనీస పరిమితిని నిర్ణయించగలమేగాని వాటి గరిష్ఠ పరిమితిని నిర్ణయించలేముగనుక. మనం కేవలం యిది మాత్రమే చెప్పగలం: పనిదినపు పరిమితి నిర్ధారితమైనప్పుడు లాభపు గరిష్ఠ పరిమితి శారీరకంగా అవసరమైన కనీస వేతన పరిమితికి అనురూపంగా ఉంటుంది; వేతనం నిర్ధారితమైనప్పుడు లాభపు గరిష్ఠ పరిమితి కార్మికుని శారీరక శక్తులకు అనుగుణమైన పనిదినపు పొడిగింపుకి అనురూపంగా ఉంటుంది. అందుచేత, లాభపు గరిష్ఠ పరిమితి శారీరకంగా అవసరమైన కనీస వేతన పరిమితిచేతా, పనిదినంయొక్క శారీరక గరిష్ఠ పరిమితిచేతా పరిమితం చెయ్యబడుతుంది. లాభపు గరిష్ఠ రేటుకు గల యీ రెండు హద్దుల నడుమా వైవిధ్యాలకు సంబంధించిన ఒక బృహత్ సోపాన శ్రేణి వుంది. లాభపు వాస్తవిక ప్రమాణ నిర్ధారణ పెట్టుబడికీ శ్రమకీ మధ్య అనవరత పోరాటం ద్వారా మాత్రమే జరుగుతుంది, ఈ పోరాటంలో పెట్టుబడిదారు వేతనాలను శారీరకంగా అవసరమైన కనీస పరిమితికి తగ్గించేందుకూ, పనిదినాన్ని శారీరకంగా సాధ్యమైన గరిష్ఠ పరిమితికి పెంచేందుకూ నిరంతరం ప్రయత్నిస్తూ వుంటాడు, రెండవవైపు కార్మికుడు యిందుకు విరుద్ధ దిశలో నిరంతరం పోరాడుతూవుంటాడు.

ఈ విషయం ప్రత్యర్థుల బలాబలాల తారతమ్యపు సమస్యగా పరిణమిస్తుంది.

2. తదితర అన్ని దేశాల్లో మాదిరిగానే, ఇంగ్లండులో కూడా పనిదినాన్ని పరిమితం చేసే సమస్యకు సంబంధించినంతవరకు, చట్టపరమైన జోక్యం ద్వారా తప్ప అదెన్నడూ పరిష్కారం కాలేదు. బయటనుండి కార్మికుల నిరంతరాయమైన ఒత్తిడి లేకుండా ఆ జోక్యం ఎన్నడూ సంభవించియుండేది కాదు. ఏది ఏమైనా, కార్మికులకూ పెట్టుబడిదార్లకూ మధ్య ప్రైవేటు ఒప్పందం ద్వారా యీ ఫలితం ఎన్నడూ సాధ్యం కాదు. సాధారణ రాజకీయ

కార్యాచరణయొక్క యీ ఆవశ్యకతే, తన కేవల ఆర్థిక శక్తి ప్రయోగంలో పెట్టుబడిదే పైచేయి అన్న సంగతిని రుజువుచేస్తుంది.

శ్రమ విలువ పరిమితులకు సంబంధించినంతవరకు, యివి క్రియలో ఎప్పుడూ కూడా సరఫరా గిరాకీల ఆధారంగానే నిర్ణయింపబడుతాయి. ఇక్కడ సరఫరా గిరాకీలంటే: శ్రమకోసం పెట్టుబడియొక్క గిరాకీ, కార్మికులచేత శ్రమ సరఫరా అని నా ఉద్దేశం. వలసదేశాలలో సరఫరా గిరాకీల నియమం కార్మికునికి అనుకూలంగా వుంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో వేతన స్థాయి సాపేక్షంగా అధికంగా ఉండటానికి అదే కారణం. పెట్టుబడి అక్కడ శతవిధాల ప్రయత్నించినా కూడా, వేతన కార్మికులు స్వతంత్ర, స్వయంపోషక రైతులుగా మారే అనవరత క్రమాన్ని నిరోధించలేదు. అమెరికన్ జనాభాలో అత్యధిక భాగానికి సంబంధించినంతవరకు వేతన కార్మికుని స్థితి కేవలం ఒక స్వల్పకాలికమైన అవస్థ మాత్రమే, వారు దాన్ని ఎక్కువ వ్యవధిలోనో తక్కువ వ్యవధిలోనో వదిలేస్తారు. ఈ వలస పరిస్థితులను చక్కబరచేందుకుగాను, పితృతుల్యమైన బ్రిటిష్ ప్రభుత్వం కొంతకాలంపాటు ఆధునిక వలస సిద్ధాంతమనబడే దాన్నొకదాన్ని చేపట్టింది. వేతన కార్మికుడు మరీ వేగంగా స్వతంత్ర రైతుగా మారిపోకుండా నివారించేందుకుగాను, వలసదేశపు భూమి ధరను కృత్రిమంగా పెంచెయ్యడమే యీ సిద్ధాంత లక్ష్యం.

కాని యిప్పుడిక, పూర్వపు నాగరక దేశాల సంగతి చూద్దాం. ఆ దేశాల్లో యావత్తు ఉత్పత్తి క్రమంపైనా పెట్టుబడిదే పెత్తనం. ఉదాహరణకు, 1849–1859 మధ్య కాలంలో, ఇంగ్లండులో వ్యవసాయ కార్మికుల వేతనాల్లో పెరుగుదల సంగతిని తీసుకోండి. దాని పర్యవసానం ఏమిటి? వ్యవసాయదారులు – మన మిత్రుడు వెస్టన్ ఎవరికైతే సలహా యిచ్చివుండునో ఆ వ్యవసాయదారులు గోధుమ విలువనుగాని, కనీసం దాని మార్కెట్ ధరలనుగాని పెంచుకోలేకపోయారు. అందుకు భిన్నంగా వారు ధాన్యాలను అయినకాడికి అమ్ముకోవలసివచ్చింది. కాని ఆ 11 సంవత్సరాల్లోనూ అన్ని రకాల యంత్రాలనూ వారు ప్రవేశపెట్టారు, మరింత శాస్త్రీయమైన పద్ధతులను అవలంబించారు, సాగుకు లాయకీ అయిన భూమిలో కొంతభాగాన్ని పచ్చిక బీడుగా మార్చారు, వ్యవసాయ కమతాల విస్తీర్ణాన్ని పెంచి, దానితోపాటు ఉత్పత్తి స్థాయిని పెంచారు. ఈ చర్యల ద్వారాను, తదితర చర్యల ద్వారాను ఉత్పాదక శక్తిని పెంచడంద్వారా శ్రమకు గిరాకీని తగ్గించి, వ్యావసాయిక జనాభాను మరోమారు సాపేక్షంగా అధికం చేశారు. పురాతనమైన, స్థిరపడిన దేశాలలో వేతనాల పెరుగుదలకు వ్యతిరేకంగా వేగంగానో, నెమ్మది నెమ్మదిగానో పెట్టుబడి ప్రతిక్రియకు పూనుకొనే సాధారణ పద్ధతి యిదే. యంత్రాలు శ్రమతో నిరంతరం పోటీపడుతూ వుంటాయనీ, శ్రమ ధర ఒకానొక ఉచ్చ స్థాయిని చేరుకొన్నప్పుడు మాత్రమే ప్రవేశపెట్టబడగలవనీ రికార్డో సహేతుకంగానే చెప్పాడు;[28] కాని శ్రమయొక్క ఉత్పాదక శక్తులను పెంచడానికి యంత్రోపయోగం

ఏకైక మార్గం కాదు, ఇంకా అనేక మార్గాలున్నాయి. సాధారణ శ్రమను సాపేక్షంగా అనావశ్యకంచేసే యీ పరిణామమే మరోవంక నిపుణ శ్రమను సరళంచేసి, తద్వారా దాని విలువను తగ్గిస్తుంది.

ఈ నియమమే మరోరూపంలో కూడా పనిచేస్తుంది. సాపేక్షంగా వేతనస్థాయి అధికంగా ఉన్నా కూడా, శ్రమయొక్క ఉత్పాదక శక్తులు అభివృద్ధిచెందడంతో పెట్టుబడి సంచయనం త్వరితగతిలో జరుగుతుంది. అందుకని, ఆడం స్మిత్ – ఆయన రోజుల్లో ఆధునిక పరిశ్రమ యింకా తన శైశవావస్థలోనేవుంది – చేరుకున్న నిర్ణయానికే, అంటే త్వరీకృతమైన పెట్టుబడి సంచయనం, కార్మికుని శ్రమకు అధికతర గిరాకీని సమకూర్చడంద్వారా, పరిస్థితిని కార్మికునికి అనుకూలంగా తిప్పితీరాలన్న నిర్ణయానికే మనం కూడా చేరుకుంటాం. ఈ దృక్కోణంనుంచే పలువురు సమకాలీన రచయితలు గత 20 ఏళ్లకాలంలో ఇంగ్లీషు జనాభా పెరుగుదలతో పోల్చినప్పుడు ఇంగ్లీషు పెట్టుబడి ఎంతో త్వరితంగా పెరిగినప్పటికీ, వేతనాలు మరింతగా పెరగకపోవడంపట్ల ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కానైతే సంచయనంలో పెరుగుదలతోబాటుగానే పెట్టుబడి అంగనిర్మాణంలో కూడా క్రమానుగతమైన మార్పు సంభవిస్తుంది. మొత్తం పెట్టుబడిలోని స్థిరపెట్టుబడి అనబడే భాగం – అంటే యంత్రాలు, ముడిపదార్థాలు, సాధ్యమైన అన్నిరకాల ఉత్పత్తి సాధనాలతో కూడిన భాగం పెట్టుబడిలోని యితర భాగంతో – అంటే వేతనాలకోసం, లేక శ్రమను కొనేటందుకు వెచ్చింపబడే భాగంతో – పోల్చినప్పుడు మరింత అధికంగా పెంపొందుతుంది. మిస్టర్ బార్టన్, రికార్డో, సిస్మాండీ, ప్రొఫెసర్ రిచర్డ్ జోన్స్, ప్రొఫెసర్ రామ్సే, షెర్బ్యులే మొదలైనవారు యీ నియమాన్ని కొంచెం యించుమించుల్లో సరిగానే పేర్కొన్నారు.

పెట్టుబడికి సంబంధించిన యీ రెండు విభాగాలమధ్యా గల అనుపాతం ఆదిలో 1:1 అయినట్లయితే, పరిశ్రమ అభివృద్ధిచెందేకొద్దీ అది 5:1 వగైరా వగైరాలు అవుతుంది. 600 మొత్తపు పెట్టుబడిలో 300 పరికరాలు, ముడిపదార్థాలు వగైరాలకు వెచ్చింపబడి, మిగిలిన 300 వేతనాలకోసం వెచ్చింపబడినట్లయితే, 300 మంది కార్మికులకు బదులు 600 మంది కార్మికులకు గిరాకీ కల్పింపబడాలంటే మొత్తం పెట్టుబడి కేవలం రెట్టింపు అయితే సరిపోతుంది. కాని 600 పెట్టుబడిలో, 500 యంత్రాలూ, ముడిపదార్థాలు, మొదలైన వాటికోసం వెచ్చింపబడి, కేవలం 100 మాత్రమే వేతనాలకోసం వెచ్చింపబడినప్పుడు, 300 మందికి బదులు 600 మంది కార్మికులకు గిరాకీ పెరగాలంటే, అదే పెట్టుబడి 600నుంచి 3,600కు పెరగాల్సివుంటుంది. అందుచేత పరిశ్రమ అభివృద్ధి క్రమంలో శ్రమకుగల గిరాకీ పెట్టుబడి సంచయనంతో సమగతిలో సాగదు. శ్రమకు గిరాకీ అప్పటికీ పెరుగుతూనే వుంటుంది, కాని పెట్టుబడి పెరుగుదలతో పోల్చినప్పుడు, అది అంతకంతకు పతనోన్ముఖమైన నిష్పత్తిలో పెరుగుతుంది.

ఆధునిక పరిశ్రమాభివృద్ధి కార్మికులకు వ్యతిరేకంగాను, అంతకంతకు అధికాధికంగా పెట్టుబడిదారుకు అనుకూలంగాను త్రాసు మొగ్గేలా విధిగా చేసితీరుతుందనీ, తత్ఫర్యవసానంగా పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క సాధారణ ధోరణి సగటు వేతన ప్రమాణాన్ని కుదించడమేగాని పెంపొందించడం కాదనీ, వేరేమాటల్లో చెప్పాలంటే శ్రమ విలువను యించుమించుగా దాని కనీస పరిమితికి నెట్టడమేననీ నిరూపించేందుకు యీ కొద్దిపాటి అంశాలు చాలు. ఈ వ్యవస్థలో స్థితిగతుల ధోరణి యిలా వుండగా, పెట్టుబడియొక్క అతిక్రమణలకు వ్యతిరేకంగా కార్మికవర్గం తన ప్రతిఘటనకు స్వస్తిచెప్పి, తమ పరిస్థితిని తాత్కాలికంగానే అయినా మెరుగుపరచుకోడానికి అడపాదడపా లభించే యాదృచ్ఛికావకాశాలనుండి సాధ్యమైనంత అధిక ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నాలు చెయ్యకుండా వదులుకోవాలని దీని అర్థమా? వారు ఆ విధంగా చేసినట్లయితే, గతీ మోక్షంలేని అత్యంత హీనస్థాయి దౌర్భాగ్య దామోదరులుగా దిగజారుతారు. వేతన ప్రమాణంకోసం కార్మికులు జరిపే పోరాటాలు యావత్తు వేతన వ్యవస్థలోనూ అవిభాజ్యంగా ముడివడివున్నాయనీ, 100కి 99 సందర్భాల్లో వేతనం పెంపుదలకోసం జరిపే ప్రయత్నాలు శ్రమయొక్క నిర్దిష్ట విలువను యథాతథంగా నిలుపుకొనేందుకు చేసే ప్రయత్నాలు మాత్రమేననీ, పెట్టుబడిదారులతో తమ శ్రమయొక్క ధరకోసం బేరమాడాల్సిన ఆవశ్యకత కార్మికులు తమనుతాము సరుకులుగా అమ్ముకోక గత్యంతరంలేని పరిస్థితిలో అంతర్నిహితమై వుందనీ నేను నిరూపించానని అనుకుంటాను. పెట్టుబడితో తమ అనుదిన ఘర్షణలో కార్మికులు పిరికివారై వెనుకంజవేసినట్లయితే, వారు అంతకన్న పెద్ద ఉద్యమాన్ని దేన్నీ ప్రారంభించే అర్హతను తప్పనిసరిగా కోల్పోతారు.

అదే సమయంలో, వేతన వ్యవస్థతో ముడివడివున్న సాధారణ బానిసత్వం సంగతిని పూర్తిగా అటుంచి, కార్మికవర్గం యీ రోజువారీ పోరాటాల అంతిమ పరిణామాన్ని అతిగా అంచనావేసుకోకూడదు. తాము ఫలితాలతోనేగాని ఆ ఫలితాల కారణాలతో పోరాడటంలేదన్న సంగతినీ; తాము పతనోన్ముఖ గతిని కేవలం మందగింపచేస్తున్నారే తప్ప దాని గతిని మళ్లించడంలేదన్న సంగతినీ; వ్యాధిని ఉపశమింపజేసే ఔషధాలను వాడుతున్నారేగాని వ్యాధిని రూపుమాపడం లేదన్న సంగతినీ వారు మరిచిపోరాదు. అందుచేత కార్మికులు, పెట్టుబడియొక్క నిరంతరాతిక్రమణలనుండి లేక మార్కెట్‌లో వచ్చే మార్పులనుండి నిరంతరం ఉత్పన్నమయ్యే అనివార్యమైన అసంఘటిత పోరాటాలకే పరిమితమైపోకూడదు. ప్రస్తుత వ్యవస్థ, తమపై రుద్దే కష్టాలు ఎన్ని వున్నప్పటికీ, దానితోబాటే అది సమాజపు ఆర్థిక పునర్నిర్మాణానికి అవసరమైన భౌతిక పరిస్థితులనూ, సామాజిక రూపాలనూ ఉత్పన్నం చేస్తుందన్న సంగతిని వారు తెలుసుకోవడం అవసరం. "సరసమైన రోజువారీ పనికి సరసమైన దినసరి వేతనం!" అన్న యథాతథవాద నినాదం స్థానంలో "వేతన వ్యవస్థ రద్దు కావాలి!" అన్న విప్లవాత్మక నినాదాన్ని వారు తమ పతాకంపై లిఖించుకోవాలి.

విషయానికి న్యాయం చేకూర్చేందుకుగాను నేను యివ్వవలసి వచ్చిన ఈ సుదీర్ఘమైన, బహుశా మీకు విసుగును కూడ కలిగించిన వివరణానంతరం, యీ కింది నిర్ధారణలను ప్రతిపాదిస్తూ యిక నా నివేదికను ముగిస్తాను:

మొదటిది, వేతనాల రేటులో సాధారణమైన పెరుగుదల కారణంగా లాభపు సాధారణ రేటు పడిపోతుంది, కాని మొత్తంమీద, సరుకుల ధరపై దాని ప్రభావమేమీ ఉండదు.

రెండవది, పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క సాధారణ ప్రవృత్తి సగటు వేతన ప్రమాణాన్ని దిగజార్చడమేగాని పెంచడంకాదు.

మూడవది – ట్రేడ్ యూనియన్లు పెట్టుబడియొక్క అతిక్రమణలను ప్రతిఘటించే కేంద్రాలుగా చక్కగా పనిచేస్తాయి. తమ శక్తిని అవివేకంగా ప్రయోగించిన కారణంగా అవి పాక్షికంగా వైఫల్యం పొందుతాయి. ఏకకాలంలో, అమల్లో వున్న వ్యవస్థను మార్చ ప్రయత్నించేందుకు బదులు, కార్మికవర్గపు అంతిమ విముక్తిని సాధించేందుకు బదులు, అంటే వేతన వ్యవస్థను సమూలంగా రద్దుచేసేందుకు తమ సంఘటిత శక్తిని ఒక సాధనంగా వినియోగించేందుకు బదులు, ప్రస్తుత వ్యవస్థయొక్క దుష్ఫలితాలకు వ్యతిరేకంగా అసంఘటిత పోరాటానికి తమను తాము పరిమితం చేసుకోవడమే వాటి సాధారణ వైఫల్యానికి కారణం.

మార్క్స్‌చేత 1865 మే
ఆఖరుకీ, జూన్ 27కీ మధ్య
రచింపబడింది

మొట్టమొదటిసారి విడిగా
చిన్న పుస్తకం రూపంలో
లండనులో 1898లో ప్రచురింపబడింది